భారతి

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులు
మే 1976
వెల: రూపాయిన్నర

C6



కృష్ణంరాజు
సమర్పించు
గోపీకృష్ణమూవీస్
భక్తకన్నప్ప
మాటలు: ముళ్ళపూడి వెంకటరమణ
ఫొటోగ్రఫీ: వి.యస్.ఆర్.స్వామి
నిర్మాత.
యు.వి. సూర్యనారాయణరాజు
దర్శకుడు బాపు
సోల్ డిస్ట్రిబ్యూటర్స్
లక్ష్మీ కంబైన్స్
విడుదల: లక్ష్మీ ఫిలింస్
సంగీతరావ్

KCLVA 104M131

భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

మే 1976

సంపుటము : 53 సంచిక : 5

విడిప్రతిక వెల రూపాయిన్నర.

విషయానుక్రమణిక

మే 1976

జన్మకొక శివరాత్రి	డా. ముకురాల రామారెడ్డి	4
పాలకురికి సోమేశ్వర చరిత యక్షగానము	శ్రీ గాజుల వీరయ్య	5
అమర గౌతమీ కోకిల	శ్రీ బంకుపల్లె లక్ష్మణశాస్త్రి	13
అర్వాచీన తూర్పు గాంగరాజుల, గజపతిరాజుల బిరుదములు	డా. సి. వి. రామచంద్రరావు	14
శ్వేతపత్రం	శ్రీ వకుళాభరణం జగన్మోహనరావు	25
పచ్చ గన్నేరుచెట్లు	శ్రీమతి ఉమాశశి	26
చలం	శ్రీ వి. మోహన్ ప్రసాద్	29
'కామాయని' కావ్య సౌందర్యం	శ్రీ గాదంశెట్టి	31
చెట్ల గొంతుల్లో	"సాంధ్యశ్రీ"	34
నీళ్ళ రావు	శ్రీ కాసల నాగభూషణం	35
రాక రాక	"విశాపతి"	36
నదు	కెఎస్వీ	37
జనం సరిత్తు	"సలంద్ర"	
చెరగని చిహ్నం	శ్రీ బండి రాధాకిష్ణ	38
ఆత్మసాక్షి	డా. చందు సుబ్బారావు	39
కొన్ని నాణాలు	డా. ఎం. అమ్జద్ అలి	40
నేనే ప్రమాణం	శ్రీ వెల్లపిల్ల సూర్యనారాయణమూర్తి	43
కాకతీయ గణపతిదేవుడు-కళింగ దండయాత్ర	డా. వై. గోపాలరెడ్డి	44
కలగూరగంప		49
గ్రంథ విమర్శలు		56



25-4-76 చైత్రబహుళద్వాదశి ఆదివారము

కళాప్రపూర్ణ, దేశోద్ధారక శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారి

అ ష్టో త్త ర శ త జ యం తి.

జన్మకొక శివరాత్రి

(ఒకసారి మృత్యువు కేక విన్నప్పుడు కలిగిన భావాలు)

డా. ముకురాల రామారెడ్డి

పల పలన విచ్చుకొని విత్తు ప్రళయమ్మైన
వరుసలో సృష్టినే చూచి వచ్చినాను ;
ఒకరి నొకరము మరవము,
యుగయుగాల మమత —
నీ వద్దకే పయనమయినాను.

2

బళ్ళున తెల్లవారెనని వార్తను తెచ్చిన వేగుచుక్క,
తా మెల్లగ దాగి,
సంధ్య పొలిమేరలచాయన తోచి,
మళ్ళి అల్లల్లన తొంగి చూచి, అపహాస్యముచేసి ;
మొగాన చీకటిం జల్లుచు పోయె ;
మారెడు మశానమె దక్కె అదృష్ట గమ్యమై.

3

నిండిన ఈ తమఃప్రకృతి నీ పరమాంశముగా గ్రహించియే
మండగజేసినాను - చరమాశను వత్తిగ దాల్చి పెట్టి-
నా గుండెను గండ దీపముగ ;
కోర్కెలు మల్లెలనాగు బుస్సలై దండల నల్లుకొన్నవిగదా !
'కయిలాసము బొందితోడిదే'.

4

దాపరికాలతో గ సుపుదామని,
వేసిన ఎత్తులన్ని లోలోపలినుండి పొక్కుచు విలోలములై,
వ దట్టహాస హేలాపరమై బటానబయలైనవి ;
ఈ మలిసంజ జాములో
నీ పదభూషలో ప్రళయ నృత్యములో లయమై తరించనా.

5

త్వమిథునము వారసత్వానకు
మొకటె సంసార భద్ర ;
ఆముదము బూసుకొన్న వస్తాదు నెదిరి ఢీకొన్న చిత్రకేళి ;
కుస్తి చాలించితి — గెలిచి ఓడి.

6

ప్రజల కార్యమని,
నా వంతుకే చేదు రసము తాపి పంపిన సోదరాలు ;
పేలిక వేషాల ప్రేతాల చూచి,
కన్నీనల గంగను నిల్పుకొన్న స్మృతులు ;
పైతోలు దాపుగా పవళించి,
ఉపవాసవ్రత మొప్పుకొన్న నిర్వాసగతులు ;
రాతిరి పగ లొక్కరీతిగా
సర్వమంగళమని గడిపిన జ్ఞాపకాలు ;
కమ్ముకొనిరాగ : అచలయోగము లభించి,
ఊరు దూరమై పోయి, అఘోరవేషమై,
హఠాత్తుగా మతి భూతియై మిగిలితి,
ఈ క్షణములో కపాల పరీక్ష కొరకు.

7

మంచి చెడ్డల మూటను మరచి వచ్చి,
నీ పదము ముందు చిత్తయి నిలువవలెసె ;
ఉన్నపాటున సన్ను లేకుండ చూపి,
అంత తానయి తోచె రహస్యమొకటి.

8

స్వామి ! నీ చరణము సోకి ;
భాష మరచి,
భావ జడమునై,
నీ మహోచ్ఛ్వాస మెక్కి,
దృక్శిఖావిస్ఫులింగమై,
తేలి తేలి తాండవానందపరవశత్వమున బోదు.

పాలకురికి సోమేశ్వర చరిత యక్షగానము

శ్రీ గాజుల వీరయ్య

బసవ పురాణముల విషయమున పరిశోధనము గావించు నేను సోమనాథుని రచనల నన్నింటిని జూచితీరవలయునని నిశ్చయించితిని. అవి యెచ్చటెచ్చట లభింపగలవో అరయుచుండ శ్రీ హిరే మల్లూర్ ఈశ్వరన్‌గారి 'హరిహరన రగళెగళు' అను పరిశోధనా వ్యాసమును చూచుట తటస్థించినది. అందు వారు హరిహరుని రగడలున్న తాళపత్ర గ్రంథములలో సోమనాథుని రగడలు కలసియున్నట్లు వ్రాసియున్నారు. ఆ తాళపత్ర గ్రంథముల ఆచూకి వారు ఆ గ్రంథము నందే వ్రాసియున్నందున చిత్రదుర్గ మురుఘా మఠము, ప్రతులను జూడబోయితిని. అచట లభింపమిచే మైసూరునకు వెడలితిని. అచట గంగోత్పత్తి రగడను చూచిన యనంతరము మిగిలిన సోమనాథుని గ్రంథములనుకూడ చూడగోరగా అచటనున్న శ్రీ బసవారాధ్యగారు మీరు ధారవాడలో పరిశోధనము గావించుచు నిచ్చటికి సోమనాథుని గ్రంథముల విషయమై రావలసివచ్చినదా ? యనిరి. "ధారవాడలో వీరశైవ గ్రంథములన్నియు లభించునని తెలిపిరి. అనంతరము ధారవాడలో కర్నాటక విశ్వవిద్యాలయ కన్నడ పీఠమునకు సంబంధించిన వచన సంశోధనా విభాగమును సందర్శించితిని. నా ఆశ్చర్యమున కంతు లేదు. సోమనాథుని గ్రంథములలో ఒక గంగోత్పత్తి రగడతప్ప సర్వము నిచట ఒక్క ప్రతితో కాదు కొన్ని ప్రతులతో లభించుచున్నవి. సోమనాథుని లఘు కృతులకు పాఠాంతరములు చూచుకొనవలయునన్న ఇచటికి రాక చేసిన పని వ్యర్థమేమో! సోమనాథుని రచనలుగా నింతవరకు తెలియబడని రెండు లఘుకృతులు నాకిచట గనిపించినవి. ఒకటి అష్టావరణ మంగళాష్టకము, (పాల్కురికి సోమనాథను నిరూపిసిద అష్టావరణ మంగళాష్టక. 13వ పేజి నెం. 1347). రెండవది వివాహ మంగళాష్టకము. (పాల్కురికె సోమారాధ్యను నిరూపిసిద వివాహ మంగళాష్టక కె. వి. వచన సంశోధక విభాగము నెం.791) ఇవి రెండును సంస్కృత భాషలో వ్రాయబడినవి. అష్టావరణ మంగళాష్టకము రచించియుండిన రచించి యుండవచ్చును గాని వివాహ మంగళాష్టకము సోమనాథునిదై యుండునా అని కొందరు సందేహింపవచ్చును. వీరశైవులకు మాత్రమే సంబంధించినదీ వివాహ మంగళాష్టకము. ఈ రెండు కృతులకు కడపట సోమనాథుడు తన ఇతర లఘుకృతులందు చెప్పిన విధముగా తన కర్తృత్వమును చెప్పుకున్నను ఇవి సోమనాథుని రచనలే యనిపించుచున్నవి. ఆ విషయమటుండ ఇతర కృతములైన తెలుగు తాళపత్ర గ్రంథములలో పాల్కురికి సోమేశ్వర చరితము యక్షగానమొకటి కనబడినది. (నెం. 1258) ఇది యింతవరకు ఆంధ్ర సాహిత్యచరిత్ర గ్రంథములందు పేర్కొనబడియుండలేదు. ఇందు ఎన్నియో విశేషములుండుటచే ముందు దీనిని గురించి తెనుగులోకమునకు తెలుపవలయునన్న ఉద్దేశములో నీ వ్యాసమును వ్రాయుచున్నాను.

పాల్కురికి సోమేశ్వర చరిత యక్షగానమును రచించిన కవి కొంపెలి మల్లికార్జునుడు. ఇతడు

"నుతపురాతన భక్త నూతన భక్త
సతత శైవిక భవిష్యద్భక్త భక్త
సాదర గురులింగ జంగమ సుప్ర
సాద సారోద కాస్వాదన దేహ
ధరు"-డగు కాళహస్తిపార్యుని పుత్రుడు ఇతడు.

"ఉగ్రవర లబ్ధ కవితా
వాగ్రవనుండు కాళహస్తి పార్యతనూజుం
డాగ్రహ నిగ్రహ శాలిప
దగ్రజు కొంపోలి మల్లికార్జును దలతున్"

అని చెప్పుటవలన నితనికి మల్లికార్జునుడను అన్న యున్నట్లు తెలియుచున్నది. వాగా కవి కొంపోలి చిన్న మల్లికార్జునుడని చెప్పనొప్పును.

'మాకు నన్నలైన మల్లప్ప సంగప్ప
............బద్ధగతి నొనర్తు'

అని వ్రాసి యుండుటవలన సంగప్ప యను అన్నయు నితనికి నున్నట్లు

దెలియుచున్నది. "మాకు" శబ్దమునుబట్టి ఇతనికి తమ్ములును నుండి రేమో యనుట కవకాశమున్నది. ఇతని తల్లి పేరు సూచింపబడలేదు.

ఇతడు పాల్కురికి సోమాచార్య పాదవనజాత జాతభాస్వద్భక్తి యుక్త శిష్య ప్రశిష్య ప్రౌత్రుద్మనిష్యంద మకరంద నిర్మగ్న లగ్న రూఢాంఘ్రి కలియుగ రుద్రుడును, ప్రౌఢదేశిక పట్టభద్రుడును, కుదన్యవాద విఖండనుడును, మృదుభక్తుడును, వీరమాహేశ్వరాచార్యుడును, పిడుపర్తి సోమన ప్రియతనూజాతుడునగు బసవేశునను శిష్యుడు. మల్లికార్జునుడు తన యక్షగానమును గురువైన బసవేశ్వరునకే అంకితము గావించెను.

సోమేశ్వర చరితమునందు కవి తన కాలమునుగాని గ్రంథారంభ పరిసమాప్తి తిథులను గాని సూచింపలేదు. ఇతని తండ్రిగాని అన్నలు గాని ఏవైనా గ్రంథములు రచించిరేమో తెలియదు. కాగా ఇతని కాలమును ఇతరాధారములవలన తెలిసికొనవలసి యున్నది. యక్షగాన ప్రతి వ్యయ నామసంవత్సర కార్తీకశుద్ధ ౧౨ గురువారము వఱకు చెన్న వీరయ్య అయ్యావార్లగారికికూరపాటిరామలింగంకుమాళ్ల అమరలింగం వ్రాసియిచ్చిన సోమేశ్వర చారిత్ర సంపూర్ణం అని సమాప్తి నొంది యుండుటచే నది క్రీ. శ. 1766 సంవత్సరము నవంబరు 13వ తేదీ నాటికి వ్రాయబడియుండును. దీనివలన కవికాలము క్రీ. శ 1766కంటె పూర్వమని చెప్పవచ్చును. ఇది యిట్లుండగా డా. యస్. వి. జోగారావుగారు ఆంధ్ర యక్షగాన వాఙ్మయమున (ద్వి. భా. P. 418) కాలము తెలని యక్షగాన కవులలో చేర్కొనిన అమర లింగమాత్యుని (పార్వతీ పరిణయకర్త) కాలము దీనివలన తేల్చవచ్చునేమో అనిపించుచున్నది.

కొంపోలి మల్లికార్జును తన గ్రంథమున
"తొల్లి కన్నడమున తోటసిద్ద మౌని
భక్తవరులకు నానతి యిచ్చినట్లు"– అనియు,

"తొల్లి యీకథచేసె వేడుక
తోట సిద్ధాచార్యవర్యుడు
బల్లిదుండెంతేని కన్నడ
విస్పష్టగాగ అది తెలుంగున
యక్షగానంబై తనర్చెను" అనియు

వ్రాసియున్నందున తోంటద (ఎడెయూరు) సిద్ధలింగయతి కన్నడమున వాసిన పాల్కురికి సోమేశ్వరపురాణమును అనుసరించియున్నట్లు స్పష్టమగును. అనగా మల్లికార్జునుడు తోంటదార్యునకు అర్వాచీనుడన్నమాట. తోంటదర్యుడు ప్రౌఢదేవరాయల సమకాలీనుడు. క్రీ. శ. 1462 ప్రాంతమున లింగైక్యమును బొందినట్లు వారి చరిత్ర చెప్పుచున్నది. అనేక గ్రంథములను వ్రాసి, యోగియై కన్నడ, తెలుగు, తమిళ దేశములందు సంచరించి మహిమలు చూపియున్నవాడు గావునను, ప్రౌఢదేవరాయలను సందర్శించి యున్నవాడు గావునను లింగైక్యము నొందునాటికి ఇతడు వృద్ధుడైయుండియుండును. వృద్ధాప్యమునకుముందే పాల్కురికి సోమేశ్వరపురాణమును రచించి యుండుననుకొన్నచో, ఇతని లింగైక్య కాలమునకు దీని ప్రచారము ఆంధ్రదేశమునకు చేరియుండును. కాగా ఈ కాలమునుండి క్రీ. శ. 1766 మధ్య మల్లికార్జుడు ఉండి యుండవలయును. మల్లికార్జునుని గురువు బసవేశుడు. ఇతడు సోమయ్యదేశికుని కుమారుడు. పద్యబసవ పురాణకర్త సోమనకు బసవనయను పుత్రుడుండెనో లేదో తెలియకున్నది. కాగా బసవనకు తండ్రి కాగల సోమయ్య ఇంకొకడు గలడు. ఇతడు ప్రౌఢదేవరాయలనుండి, శివరాత్రి కొప్పయ్య గారికి ప్రతాపరుద్రునిచే నీయబడి. అతని వంశీయులచే ననుభవింపబడి అనంతరము పోగుట్టుకొనబడిన డోకిపర్తి అగ్రహారమును బొందినవాడు. ఇతడు ప్రౌఢరాయలనుండి అగ్రహారమును బడసి యుండునప్పటికి వృద్ధుడై యుండవచ్చునని ఆంధ్రకవి తరంగిణి కర్త శ్రీ చాగంటి శేషయ్యగారు చెప్పియున్నారు. ఇట్లైన యెడల ఈతని (సోమయ్యయొక్క) కుమారుడును దాదాపున తోంటదార్యుని కాలమునకు సంబంధించినవాడు కావలసియుండును. బసవేశ్వరుడు మల్లికార్జునుని గ్రంథమును అంకితము గైకొనునాటికి శిష్యులు ప్రశిష్యులుగలవాడు గావున వృద్ధుడేయై యుండును. మల్లికార్జునుడు యక్షగాన రచనాకాలము నాటికి తాను బాలుడని స్పష్టముగా చెప్పికొనియున్నాడు. ఇతడీ బసవేశుని శిష్యుడేయైయుండి కన్నడ గ్రంథమునసుసరించియుండెనన్న యెడల తోండదార్యుని గ్రంథము రచింపబడిన అల్పకాలమునకే ఆంధ్రదేశమున ప్రచారమొందినదని చెప్పవలసి వచ్చును. సోమనాథుని బసవపురాణము పండితారాధ్య చరిత్ర రచనా కాలమునాటికే మిక్కిలి ప్రచారమొందినట్లు ఇది సంభవమైనచో నీ కవి 15వ శతాబ్ది అంత్యభాగమునందు జీవించియుండెనని చెప్పవచ్చును. ఈ కవికాలము విషయమై ఇంకను పరిశోధనలు జరుగవలసియున్నది.

మల్లికార్జునుడు తన యక్షగాన రచనావిషయమున నిట్లు మనవి చేసికొని యున్నాడు:

చ. సలలిత శబ్ద సంగతుల చంద మెఱుంగను లక్షణ క్రియా
కలనలు చిత్రగోచరము గావు ప్రబుద్ధుడగాను బాలుడన్
వలసుగ నభ్యసించుటకు వ్రాసితి నింతియెగాని యోసుధీ
తిలకములార! తప్పులని తిట్టకుడీ శరణంబు వేడెదన్.

దీనినిబట్టి మల్లికార్జునుడు ఈ యక్షగానమును భక్తి కొలది వ్రాసెనేగాని పాండిత్య పాటవములను చూపుటకు వ్రాయలే

దనుట తెల్లము. లక్షణ క్రియలను తానెఱుగనట్లును నితఁడు చెప్పుకొనుటలో విషయము కన్పించుచున్నది. ఏది యెట్లయినను రచనము నాటి కితడు పబుద్ధుఁడు గానందుననేమో అంత బిగిగా రచనము సాగింపలేదు. ఈ యక్షగానము మిక్కిలి చిన్నది. ఇరువది తాళపత్రములకు మాత్రము సరిపోయిన యితివృత్తముగలది. యక్షగానసూత్రము ప్రకారము ఉండవలసియున్న ఏకతాళము, ఆటతాళము, త్రిపుట, జంపె మొదలగు తాళవిశేష ప్రాధాన్యము గల రచనలు, ద్విపదలు, పద్యములు, ఏలలు. అర్ధచంద్రికలు, మంగళాష్టకము, నివ్వాళి, ధవళము వచనములు ఇందు గలవు.

యక్షగానములందుఁ గొన్ని ప్రదర్శనమునకు అభ్యాసమునకు రెంటికి నుపయోగపడును. కొన్ని కేవలము అభ్యాసమునకు మాత్రమే వినియోగపడును. ఈ యక్షగానము కేవలము అభ్యాసమున కుపయోగపడునది. ఈ యక్షగానము పూర్వము బాగుగా వాఖ్యానము చేయబడి యుండునని తోచుచున్నది. ఏందువలననగా ఏ యితర గ్రంథములందును లేక దీనియందు మాత్రముగల కొన్ని విషయములు వరంగల్లు ప్రాంతమున అధిక ప్రచారముననున్నవి. పాల్కురికి సోమనాథుని జన్మస్థలమును జూడఁబోయినప్పుడు పాలకుర్తి,వరంగల్ లలో నీ గ్రంథ విషయమును చెప్పకపోయినను నిందలి కథలు కొందరు చెప్పిరి.

యక్షగానములోని విషయములు :

ప్రథమమున శశిశేఖరుని ప్రార్థనముతో కవి మంగళాచరణము వాచరించెను. 'అని పరివేష్టించియున్న దేవుతుల నేమని వినుతించుచున్నాడు' అనుచు సారూప్య రుద్రగణములను, వృషభేశ్వరుని, భృంగీశ్వరుని, భైరవుని, కుమారస్వామిని, గణపతిని, వీరభద్రుని వినుతించెను. 'అని పండితారాధ్య స్తోత్రంబు చేసెనట యెటువలెను'అనుచు చీరయదగ్నిని గట్టిన శ్రీపతి పండితుని, హరుని గుడికి హరిని మ్రొక్కజేయుటకై తెచ్చివెలసిన మంచెన పండితుని, వాదులను గెలిచి కన్నులను శివునిచే బడసిన మల్లికార్జున పండితుని స్తుతించెను. కళ్యాణ బసవ దండేశునకును, శైవ కవితా కవీశ్వరులకును దండమొనర్చెను. తప్పుదారుల కవిత్వమును జెప్పు కాకవులను దిరస్కరించెను. శివ కథా సంస్కారము గావించెను. కృతీశ్వరునకు షష్ఠ్యంతములు చెప్పెను. అనంతరము పాల్కురికి సోమేశ్వరుని కథను వివరించెను.

శ్రీ విశ్వపతియగు సాంబమూర్తి కైలాసమున గొలువుండ వృషభేశ్వరునితో జరిగిన కేళీవివాద సంకేతము ప్రకారము మహేశ సానంద పాణిని మునులుగా బుట్టిన భృంగీశ్వరుఁడు మరల భువియందు పాల్కురికి సోముఁడై యవతరించి మహిమలను జూపి తిరిగి బసవేశ్వరుని గలియుట యిందలి యితివృత్తముగా కవి పేర్కొనెను. ఇది తోంటదార్యుని కథను అనుసరించినది యని చెప్పఁబడినను 'శ్రీ గురూత్తము డెల్లు పల్కఁగఁజేసె నటులే బల్కెద'అనియుండుటచే కవి గురువు చెప్పిన కథను కూడ ఆధారముగా దీసికొనెనని చెప్పక తప్పదు. 'మాకు నన్నలైన మల్లప్ప సంగప్ప .... బద్ధగతి నొనర్తు' అని వ్రాసియుండుటచే కవి తన సోదరుల సలహాలను కూడ తిసికొని యుండవచ్చును. కాగా సోమేశ్వర చరిత యక్షగానము కొన్ని విశేషములతోఁ గూడినది యైనది.

పాలకురికి గ్రామము

'నానావిధ వాక్యానోభయభాషా మహా ప్రబంధాధినాథుండగు సోమేశ్వరుని దేవస్థానంబగు పాల్కురికి పట్టణం బెట్టిదనిన' అనుచు కవి పాల్కురికి గ్రామమును వర్ణించెను.

'శ్రీశైల శిఖరికి చెలగు గోపురము
కైశాన్య భాగ మం దలరుచునుండు'

అని సిద్ధ లింగయతి చెప్పినవిధముగా శ్రీశైలమున కైశాన్య భాగమున గల తెలంగాణపుఁ బాల్కురికినే యీ కవి చెప్పియున్నాడు.

'శరణుచేఁ గొందఱికి స్మరణచేఁ గొందఱికి
సిరులిచ్చు నందరికి శ్రీ పాలకురికి
శ్రీ రజత ఘనగిరికి జేజేల నగరికిని
జేరువగు చూపరికి శ్రీ పాలకురికి'

ఇత్యాదిగా దానిని వర్ణించినాడు. లింగైక్య చిదిరె మఠము వీరభద్ర శర్మాదులు కీ.శే. చిలుకూరి నారాయణరావుగారి 'కర్నాటక హాల్కురికె' వాదమును ఎంత ఖండించి యున్నను శ్రీ సుబ్బరామప్పగారు పాల్కురికి సోమనాథుని జన్మస్థలము 'హాలకురికె'యని నేడును వాదించుచున్నారు. ఈ వర్ణన 'హాలకురికె'కు నింతప్రాధము పరిపొందదు.

సోమనాథుని జననీ జనకులు

శ్రీ పండితారాధ్య శిష్యసంపత్తికి
ప్రావగు నవ్విష్ణు రామిదేవునకు
నారాధ్య లోక పట్టాభిషేకుండు
నారామి దేవ శియాదేవి సతికి
గలిగె నయాన సాక్షాద్రుద్రుఁడనగ'

అని కవి వ్రాయుటఁబట్టి సోమనాథుఁడు విష్ణు రామిదేవుని

కుమారుడేయని చెప్పనొప్పను. ఇచట మల్లికార్జునకని తోంటదార్యుని అనుసరింపలేదు. కన్నడ సోమేశ్వర పురాణము ప్రకారము సోమ నాథుఁడు మంగళాంబికా గురులింగముల కుమారుడు. సిద్ధ లింగ యోగి దూరమున నుండినవాడై నందున పేర్లు వ్రాయుటలో పొర పాటు పడియుండవచ్చును. మల్లికార్జునుఁడు గురువుచే విన్న కథ వలన ఇట్లు మార్పు చేసి యుండవచ్చును. బసవ పురాణమున

భ్రాజిష్ణుఁడగు విష్ణు రామిదేవుండు
దేజిష్ణువగు శ్రీయాదేవి యమ్మయును
గారవింపఁగ నొప్పగాదిలి సుతుఁడ.

అని సోమనాథుఁడు వ్రాసియుండుటవలన 'గాదిలి సుతు'డను టచే పెంపుడుకొడుకని అర్థము గావించుకొని కొందరు పండితులు సోమనాథుని తల్లిదండ్రుల విషయమున కొన్ని కథలు చెప్పియున్నారు. ఇవి కల్పితములని యక్షగానమువలన చెప్పవచ్చును. విష్ణురామిదేవుడు ఆరాధ్య లోక పట్టాభిషేకుఁడగుటచే జంగముఁడు గాడని తెలియు చున్నది. ఇది సోమనాథుని కులము విషయమున నిట్లు వెలుగు చల్లుచున్నదియైనది.

సోమనాథుని భార్య:

ఏ యితర గ్రంథములందును సోమనాథుని భార్యపేరు చెప్ప బడి యుండలేదు. ఇందు చెప్పబడినది.

'సాలశివజ్ఞాన సంపత్తిఁ బొదలి
కారుణ్య సర్వమంగళ కళారూఢి
పేరైన మంగళాంబికఁ బెండ్లియాడి'

అని యున్నది. దీనిచే సోమనాథుని భార్యపేరు మంగళాంబికయని తెలియుచున్నది. సిద్ధలింగయతి సోమనాథుని తల్లిపేరు మంగళాంబిక యని వాయగా నితఁడామెను భార్యగా వ్రాయుటలో నితనికి తెలిసిన సత్యమే మూలమైయుండును.

సోమనాథుని నిత్యజీవనము :

సంతతలింగ నిష్ఠాపరతతో, వేదసమ్మత వీరశైవము ననుస రించి గురులింగ జంగము గురుభక్తితో, కరమొగ్గి పాదోదక ప్రసాద ములను గొనుచు, సద్భక్తగోష్ఠితో నానందమున దేలినదిగా సోమనాథుని జీవనము చెప్పబడినది. సోమనాథుఁడు భక్తదేవేల్పు, శివభక్తు లే కులజులని శ్రుతిమతము నలరించుట, భవిపాకములు భవిసంభాషణ భవి సందర్శన స్పర్శనలుగొనక చరించుట, జైన, బౌద్ధ, వైష్ణవ, శాక్తేయక మతస్థుల ననచుట చెప్పఁబడినవి. కరస్థలి విశ్వనాథునికడ కవిత్వమును నేర్చుట, కలకుట్టకూరి పోతిదేవరకడ జ్ఞానభక్తి క్రియల నెలవుల నరయుట, త్రివిధలింగములయందు జీవనత్రయమును అవినా భావముగ జేయుట, పడగాము రామేషుని శిష్యుఁడగు చెన్నరామునితో స్నేహముచేయుట, ఘనలింగ సుప్రసాదన దీనదేహుడై జంగమ ప్రాణ సువిధానియగుట, భక్తమాహేశ్వరులతో తావే షట్స్థలభావమువహించి యుండుట చెప్పబడినవి.

చారిత్రక విషయములు :

అనంతరము ఏకశిలా నగరమునకు సంబంధించిన ప్రతాప రుద్రుని గురించి తెలుపఁబడినది. ప్రతాపరుద్రుని కంకితముజేయ నతని కొలువులోని సాకల్యమల్లభట్టు నిరోష్ఠ్యరామాయణము వ్రాసి కొని వచ్చెను. అందరి బొగాము లిట్లని చెప్పటకు నెవడు గలడని పృథివీశ్వరుఁడడుగ చక్రపాణియైన రంగనాథుడుగాక మహిలో నిందు లకు సమర్థు లెవ్వరని సకల విద్వత్కవి పండ్యులు చెప్పిరి. ప్రతాప రుద్రుడు రంగనాథుని పిలువనంపెను అతడు శ్రీ రంగనాథాజ్ఞ శిరమునఁబూని వీరవైష్ణవనుత విశదులు గొలువ, కరముల శంఖ చక్రములు శోభిల్ల, తిరముగా తిరుమణి తిరుచూర్ణధరులు నిరుగెలం కులను శ్రీహరియని పలుక కంతురంగాందోళికాది వైభవముతో వరు దెంచెను. త్రోవలో త్రిపురాంతక గోపురమును జూడక గ్రుడ్డివాడై అహోబలమున కరిగెను. ఇచట ఇతర గ్రంథములయందువలెనే కథ సాగును. అనంతరము రంగనాథుఁడు పాల్కురికి సోమనాథుని గన పాల్కురికి కరుగును. అపుడు సోమనాథుఁడు...

"మహనీయ రుద్రాక్షమాలికల్దాల్చి
బహు జటాజూట మేర్పడ జక్కనొల్తి
చెలియుగ రూఢసాక్షాద్రుద్రుఁడగుచు
పలువురు బసవేశ బసవేశ యనుచు
వేదాగమ పురాణ విద్యాప్రసంగ
మేదుర శివకథామృత వార్ధి"

దేలుచు సొనధానముగ శిష్యజనంబులు గొలువ రత్నకంబళము నందా సీనుడై యుండెను. శివధ్యాన నిశ్చలతఁ దనరు కుమారుఁడు చతు ర్ముఖ బసవేశ్వరుఁడు అంతర్ద్వారమున నిలిచియుండ చెన్నమల్లేశ్వ రుడు (చెన్నమల్లు) ఉండెను. రంగనాథుఁడు వెలుపలి వాకిటనున్న చెన్నమల్లేశ్వరాదులతో అనేక విధములుగా వాదించెను. చతుర్ముఖ బస వేశ్వరునిలో అనేక విధములుగా వాదించెను. చతుర్ముఖ బసవేశ్వ రునితో వాదించి ఓడిపోయెను. చతుర్ముఖబసవేశ్వరుడు అతనికి లింగ ధారణము గావింపఁజేసెను. అనంతరము రంగనాథుఁడు.

పాహిమాం దయా విలాస
పాహిమాం మహేశ్వరేశ
త్రాహి త్రాహి సోమనాథ
త్రాహి త్రాహి సుగుణయూథ

ఇత్యాదిగా సోమనాథుని స్తుతింప సోమనాథుఁడతనికి నిలువు గన్ను లొసంగెను. అనంతరము అతనికి ఏకామ్రనామకరణము గావించెను.

......"ఏకామ్రగురుచిత్త
నలినభృంగ సోమనాథలింగ" అను

మకుటముగల అన్యవాద కోలాహలములోని ఏకామ్రగురువు ఇతఁడేనని దీనివలన గుర్తింపవచ్చును. రంగనాథులకు ఏకామ్ర నామధేయ మేర్పడుట ఈ యక్షగానమువలన మాత్రమే తెలియవచ్చుచున్నది. దీనివలన **A Descriptive Catalague of the Telugu Manuscripts** గ్రంథమునందు నెం. 1471 (మెకంజీ) అన్యవాద కోలాహలమును గురించియున్న దీనికికర్త ఏకామ్రగురుడుగానోతచ్ఛిష్యుడుగానోఊహింప బడుచున్నాడు అను వ్రాతలవలనను, దీని కర్త రంగనాథుడుగాని అతని శిష్యుడుగాని ఉండనగును. రంగనాథుడు అనంతరము శైవ కవియై గ్రంథములను వ్రాసియున్న విషయము ఇతర గ్రంథముల వలన తెలియవచ్చును. రంగనాథునకు శైవమతము ననుగ్రహించిన తర్వాత సోమనాథునికీర్తి విస్తరిల్లినది. పాల్కురికి ప్రాంతమున చెంచెతలు సోమనాథుని కీర్తిని యాలలుగా పాడిరి.

భృంగీలై యవతారించి
అంగాలింగా సావధాన
సంగతిని నిన్ను గొల్చిన ఓ సోమనాథ!
రంగనాథు భక్తుజాయవె.

దేవాదేవూ నెరుగాలేక
త్రోవాదప్పలోకూలికూ
నీవ్వాదిక్కై బోధసేయవా ఓ సోమనాథా
శైవమతము అంతరింపక.

అసమాన్యమైన ప్రమథ కథలూ
బసవపురాణముచేసి
వసుధలోన వెలయింపవా ఓ సోమనాథా|
రసిక శైవకవులు మెచ్చగా.

అనంతరము ప్రతాపరుద్రుఁడు శంభుని గుడికిపోయి పురాణ కాలక్షేపమును గుఱించి వినుట, ధూర్త విప్రుని నింద యథా పకారము ఇతర గ్రంథములందు వలెనే సాగినది. ఓరుగంటి పాలకుర్కి స్వారప్పయు, శివదేవయ్య, శివరాత్రి కొప్పయ్య ఆదిగాగల భక్తులు విచారపూర్వకముగా నీ వృత్తాంతమును సోమనాథునకు విన్నవించిరి.

"పరవాది మత్తేభ పంచవక్త్రుండు
పరవాది పాథోధి బడబానలుండు
పరవాది సింహవిర్భర శరభంబు
పరవాది గాఢాంధ భాస్కరమూర్తి
పరవాది భేకకుంభద్భుజంగంబు
కపట దుర్జన మస్తక త్రిశూలంబు"

నైన సోమనాథుఁడు ఓరుగంటికి వెడలెను. ఓరుగంటి ద్వారమున భవిప్రతిమలక్రిందుగా బండి నడువకపోయినది, సోమనాథుఁడొక పత్రికను వ్రాసి చూపినంతనే ప్రతిమలు పటపట పగిలి పడిపోయినవి. దీనిని పరవాదులు మంత్రవిద్య యనిరి. మాతో వేదవాదంబు సరి చెప్పడని రాజవీధిని నిలిచిరి. సోమేశ్వరుఁడు తన యనుగ్రహమున నచట నరుగు నొక రజకునిచేత వేదంబులు చదివించునట్లు శిష్యుల నియోగించెను. వారు

ధరణిపై నాల్గు బరులుగా వ్రాయించి
కరమొప్ప నొక్కొక్కటి దాటఁ జేయ
సరవిపై శూద్ర వైశ్య క్షత్రియాకృతులఁ
బరగి యా రజకుండు బ్రాహ్మడై నిలిచెను.

'మొదలంగ న్యాసమును బ్రణవమునుజేసి' వేదములు తూ చా తప్ప కుండ చదివెను.

అనంతరము ప్రతాపరు ద్రుడు సోమనాథుని జూడ నెంచెను. మంత్రులు భవుల నతడు చూడడనిరి. పాల్కురికి సోమన కీ వృత్తాంతమును దెలుప' శంభులింగంబుఁగౌగిలించుకయుండు కాలంబునందు, గన్నులను జూతునేననెను. సోముని వాక్యము ప్రకారము ప్రతాపరు ద్రుఁడు వచ్చెను. సోముఁడు ద్విపదయందు ప్రాసయతి ప్రయోగము తప్పుగాదని తెలిపెను. వాదులు నోరు గదపరైరి. అనంతరము వారు రాజుతో నొక కుట్రను గావించిరి. ఇతఁడు లింగహీనులను గనఁడు గదా! నీ చేతులు శంభునిపైనుండి తీసివైచిన నెట్లు చూడదో చూతముగాక యనిరి. రాజు సోముని వంచించుటకై కరములను దీయ యత్నించెను. కాని

"వదలరయ్యెను కరద్వంద్వంబు గట్టిగా
మదనారి హస్తముల మాడ్కిగను పెట్టెన్".

అనంతరము సోమనాథుఁడు వెడలిపోయెను. ప్రతాపరుద్రుని హస్తములు లింగమున కంటుకొనియుండ రాకపోగా అపరాధము క్షమించు

నట్లు తెలియచెప్పి పంపెను. సోమనాధుఁడు క్షమింపగా నతనిచేతులు ప్రక్కకు వచ్చినవి.

అనంతరము కొన్నాళ్లుండి సోమనాధుఁడు ప్రతాపరుద్రునకు అతీతానాగత వర్తమానంబులు దెలిపి ఇచటుమ్లేచ్ఛాక్రాంతమయ్యెడి. మాకు శీలంబులకు కఠినంబని శివగంగకు ప్రయాణోన్ముఖుఁడయ్యెను. అపుడు ప్రతాపరుద్రుఁడు:

త్రిపుట॥ గతియు మతియును దిక్కుదెస యెడ్డదయు—నీవేమాకు నెన్నగ
పతియు తల్లియు తండ్రి తోడును ప్రాణపదము
అయ్య నేనొనరించిన శతాపరాధములైన గావవలె
జియ్యనను ఒంటి బంటుగజేసి యేలి
దేవమాకిక బుద్ధిమతులవి తెలియనానతి యిచ్చిదిక్కే—
కానవేమి స్వామి చల్లని కరుణజూచి.

యని వేడెను. ప్రతాపరుద్రునికి సోముడు శివపూజా విధానమును దెలిపి నీకు "శంభుండు ప్రసన్నుండయ్యెడి. మీద గంగా గర్భంబున శివైక్యంబు వొందెదవు" అని తెలిపి పంపెను, గంగాగర్భమున శివైక్యమును పొందిన ప్రతాపరుద్రుఁడు రెండవ ప్రతాపరుద్రుడే గాని వేరొకడుగాడు. సంస్కృత నీతి సారమును రచించిన రుద్రదేవుడు ప్రతాప రుద్రుడను పేరుగలవాడుగా

చ॥ పరువడి నాంధ్రభాషఁగల బద్దెన నీతియు సంస్కృతంబులో
పరగ ప్రతాపరుద్ర నరపాలునిచే రచియింపబడ్డయా
నరవరు నీతిసారము వినం జదువంగడు మంచిదంచుఁజె
చ్చెరఁగవి నీతిపద్ధతులుజేసె వినోదము బాఁబోధకున్.

అను పద్యమువలన జెప్పబడినను సోమనాధుఁడు రెండవ ప్రతాప రుద్రుని కాలమువాడని చెప్పుటకు మీది ప్రతాపరుద్రుని గంగా గర్భ శివైక్యము దోహదమిచ్చుచున్నది. దీనివలన బండారు తమ్మయ్య గారు సోమనాధునికాలము విషయమున జేసిన ప్రథమ ప్రతాప రుద్ర (రుద్రదేవ) కాల ప్రయత్నము సర్వము వృధాయగుచున్నదని తెలుప వచ్చును.

సోమనాధుఁడు శివగంగకు పోవు సమయమునకే బొడ్డొఖుకన్నయ సోమనాధ భాష్యమునకు టీక రచించెను. ఇతడు ఏకామ్రగురుశాఖకు చెందినవాడు.

"సోమనాధుని భాష్య స్తోత్రంబు టీక
చేసి మెప్పించుకొని శిష్యుడై పొగెన్
అతఁడు మనోహ్వాహ్వాయమంతఁ బూనెన్."

అని వ్రాయబడియున్నందు మనోహరీయమగు టీక వ్రాసినవాడు మనోహరుడనబరగిన బొడ్డొఖుకన్నయ. మనోహరీయమున ఈతని నిజనామ మున్నట్లులేదు. అనంతరము సోమనాధుడు శివగంగకు వెడలెను.

"ప్రవిమలంబైన పలుకలగుంటి
నడుమనొక్క గృహంబు నాట్యమంటపము
గరు వేడ్క నిర్మింపగా నందునిండ
నింద్రాక్ష రుద్రాక్ష లేపందిరులుగ
సాంద్రమైన విభూతి సయ్యగర్పించి
ఆగమ ఫణితిచే నమరినయట్టి
యోగస్థలంబున" నుండెను.

సోమనాధుని సమాధిని గురించి పండితులందు వివిధ అభిప్రాయములున్నవి. మకుటాగమములోని చతుర్ధపటలమున

శివాలయ సమీపేవా శివారామస్య వ్యాంతికే
శివతీర్థ సమసేవా బిల్వమూలేవదీతడే
సమాధిం కారయేత్ ప్రాజ్ఞోః వక్ష్యేతల్ల క్షణం శృణు.

అని యున్నది. దీని ప్రకారము సోమనాధుని సమాధి శివాలయము (కల్లేశ్వరాలయము) సమీపముననే యున్నది. బెంగళూరుజిల్లా మాగతి తాలూకా కల్లెమను గ్రామమున నీ సమాధికలదు. శివగంగకువచ్చి సమీపముననున్న కల్లెమున శివభక్తయగు చెన్నమ్మను జూడవచ్చి యచట లింగైక్యమందెను. ఈ విషయమున యక్షగానము గ్రామ విశ్లేశము గావింపలేకపోయినది. సోమనాధుని సమాధి పలుకలగుంటి మధ్యమునలేదు. ఉన్నదన్నచో సోమనాధుని సమాధియున్న కల్లేశ్వర దేవాలయముగల గుట్టయంతయు నొక గుండుగా చెప్పవలసివచ్చును. శ్రీ లింగైక్య శివమూర్తిశాస్త్రి గారిననుసరించి లింగైక్య బండారు తమ్మయ్యగారు సమాధి చిత్రమునొకదానిని ప్రచురించియున్నారు. అది చూడబోగా కల్లేశ్వరుని ఉత్సవ విగ్రహములను ఊరులోనికి దీసి కొనిపోవుటకు ముందు నిలుపు తెలుపు (వేదిక) గా తెలిసినది. చూచుటకును నట్లే యున్నది. కాగా అచటి పెద్దలు పాలారాధ్యులు (కల్యయందలి పేరకైన మఠసంబంధులు, పాలకురికివారి పేరును ధరించిన వారు) కన్నడ సోమేశ్వర పురాణములోని

ఇంతఱిల సంభ్రమం గూడి నలవిం శరణ
తింలిలి బళిక్కె మకుటాగమం నాడి పే
ళ్దంలె కల్లేశ్వరన రాజాంగణద బాగిలొళదెసె యొళెసకదిందె
కంతుహరరూప సోమారాధ్య రాణతియె
ళం లపకవెగొండు శుభవెనిసిప్పంతె యొ

రంతె ఘనతర శివసమాధియం లెగెద రెంతెనె పేళ్వెనెపెదు
(సంధి 15)

అను పద్యమును (షట్పది) బట్టి కల్లేశ్వరాలయముయొక్క వాకిటికి ప్రక్కనున్న బూడియున్న యొక శిలాకృతిని చూపిరి. ఇది సమాధి వలె గనిపింపదు. పూడియున్నది. కొంత త్రవ్వింపగా నది స్తంభముపై దూలముల కాధారముంచునొక చతురస్రమైన మలచిన ఫలకముగా నాకు గోచరించినది. దీని విషయమున ప్రక్కనే శాసనములున్నవని వారనినారుగాని ముద్రితములైన యాశాసనము లన్నియు చదువ నందొకటియు సోమనాథునికి సంబంధించినది కానరాకపోయినది. రాజాంగణమనగా ఆవరణమంతయునని లెక్కించినచో శివాలయము వెనుక పేర్కొనదగిన సమాధి యున్నది. ఇది గుండు చాటుననున్నది. ఈ సమాధి యొక చిన్న గుడివలె ఎత్తైన వేదిక యందున్నది. సమాధిపైన ఉన్నతమైన నందికేశ్వర విగ్రహము గలదు. దానిని గుడినుండి వెలుపలికి దీయవలను పడదు. ఇదియే సోమనాథుని సమాధియని నా నమ్మకము. దీనికి ఆధారములివి. పద్యబసవ పురాణ కర్తయగు పిడుపర్తి సోమనాథుడు.

"కలిమల నంగభంగ శివగంగకు చెంగట గ్యేమన్పురిన్
బలకల గుంటిమాటున సమాధి రచింపంగజేసి భూతిలో
దలముగంబోసి యందు వయిదా వసియించుచు గావగన్భు భృత్యుల నియమించి విశ్చలతనుండె వృషేంద్ర పదాంతరంగుడై"

అని వ్రాసియున్నాడు. 'గుంటిమాయిన' యని ముద్రిత గ్రంధము లందు గన్పించును. 'మాయిన' శబ్దమున కర్థములేదు. కల్యవిషయమున శ్రీ హయవదన రావుగారు మైసూరు గజెటీరు Vol-Vనందు ఈ విధముగా వ్రాసియున్నారు:

(P. 185) On a small hill to the West of the village are situated a lingayat Matha and Kalleswra temple. The farmer is a decent and substancial structure with a court yard and a cave containing Gaddiges or tombs one of which with a big Nandi sculptured on a slab is said to be the tomb of Palakuriki Someswara, The latter was a great Veerasaiva teacher and author who flourished at the close of the 12th century and who according to the chennabasava curana died at this villag.

దీనినిబట్టియు సోమనాథుని సమాధి యిదియేయని తెలియుచున్నది. పాలారాధ్యులు ఈ సమాధిని చతుర్ముఖ బసవేశ్వరుని దందురు. ఈ విషయమున విన్న మొన్న కల్పింపబడినదియేయని సులువుగా పై హయవదనరావుగారి వ్యాఖ్యవలన తెలిసికొనవచ్చును.

సోమనాథుడు ధ్యానమున తనకు గన్పించిన శివునిలో లీన సమాధిపై స్ఫటికాకృతిని విరిచి కనిపించి పొమ్మని చెప్పినట్లున్నది.

'భవిజాడనంచు నాపట్టిన నియమంబు
కడమకాకుండగ బుడమిజనులు
నారూపు నీరూపు నడుమగాంచుట దేవ
నాకు ప్రియంబైన నందిరూపు
పటికంబునను దార్చి భర్గ నీ గర్భంబు
నందునన్ను ధరించి నందియంబు
మానునట్లుగ నీ సమాధి మీదట గొంత
దడవుంచి సద్భక్త తతినలింప

గొంచుపొమ్ము రజతకు ధరమ్మనకునన్ను
ననిన నట్ల కొంచు నరుగు శివుని
సమ్ముఖంబునందు సమ్మదంబుననుండె
సోమతుల్యుడగుచు సోమగురుడు.

అని పిడుపర్తి సోమనాథుడు పద్య బసవపురాణమున వ్రాసియున్నాడు. పాలకురికియందు సోమనాథుని సమాధియని ఊరులోనియొక గుడియందలి శివలింగమును జూపింతురు. ఇది సమాధివలె కనిపింపదు.

సోమనాథుని విగ్రహము బయటనున్నది. కాగా సోమనాథుడు భజించిన శివలింగమది యనిపించును. ఒక వేళ సోమనాథుని సమాధియేయను కొనినను తప్పులేదు. వీరశైవాచార్యుల సమాధులు ఒకరికొకటిగాక ప్రతినిధి సమాధులును నుండుట కర్నాటకమున మఠములందు జూడవచ్చును. ఉదాహరణమునకు చిత్రదుర్గము రుఘా మఠములో నొక ప్రతినిధి సమాధి పూర్వ మఠాధిపతికి సంబంధించినది యున్నది.

పాలకుర్తియందు సోమనాథుని గుడియందు నిత్యమును పూజలు జరుగుచున్నవి అర్చకుల బెళ్ళిగండివారు (వారిపేరు మరచినందులకు క్షంతవ్యుడను) లోటులేకుండ చూచుకొనుచున్నారు. వారికిగాని, ఇతరులకుగాని సోమనాథునికి సంబంధించిన కళ్యాణాష్టకములు, నివ్వాళులు, ధవలములు తెలిసికొనవలసినవి కొన్ని యక్షగానమున నున్నవి. వానిచే ముగించుట యుక్తమనుకొందును గావున వ్రాయుచున్నాను.

సోమనాథునకు శిష్యులు పాడిన కాళ్యాణాష్టకములు

అల శివుని గుడిజాడ కంధుండై తనపాద
నలి నములుగను రంగనాథునికి
నిలువుగన్ను లొసంగి నిజభక్తి నదముక్తి

దెలుపు పాల్కురికి సోమ లింగమునకు
శివం కళ్యాణం! భవం కళ్యాణం॥

కళ్యాణగణ సోమగణ సోమనాధునకు
కళ్యాణ మావృషభ కరివరునకు
కళ్యాణ మిష్ట లింగధ్యాన నిరతునకు
కళ్యాణమీశ్వరాకారునకు
శివం కళ్యాణం! భవం కళ్యాణం॥

తొలగి భవిజాడ కన్నోయి జాడక బండి
నలరు ... ... వోర్గంటి యవ్వాకిట
నిలచి భవిప్రతిమ దునిసిపడ శీలముల్
దెలుపు పాల్కురికి సోమలింగమునకు
శివం కళ్యాణం! భవం కళ్యాణం॥

తలహ జారమున వాదమడన్న రజకునిది
సలలితంబుగ శ్రుతులు చదువజేసి
చెలువుగా నిజ మహిమచే విప్రజయమును
దెలుపు పాల్కురికి సోమలింగమునకు
శివం కళ్యాణం! భవం కళ్యాణం॥

చలపట్టి కపటవేషములతో నంగహీ
నులువచ్చి భక్తుని నుడువ వినుచు
లలినొప్పగా శైవలాంఛనా సాంగముల్
దెలుపు పాల్కురికి సోమలింగమునకు
శివం కళ్యాణం॥ భవం కళ్యాణం॥

విలమితో తనుజాచు నెడలకాకతిరుద్రు
డలర శంభుని విడనాడుహస్త
ములను బంధించి క్రమ్మరవేద భక్తికల్
దెలుపు పాల్కురికి సోమలింగమునకు
శివం కళ్యాణం॥ భవం కళ్యాణం॥

తొలుతనె ప్రతాపరుద్రునిచే... ...
జలము శంభునకును మజ్జనముసేయు
వలువుతము నిత్యవుత్సవ మొనర్చిన భక్తికేల్
దెలుపు పాల్కురికి సోమలింగమునకు
శివం కళ్యాణం॥ భవం కళ్యాణం॥

వలునుతంబుల ... ... బాసి మోక్షాపేక్ష
దలచిన తన పాద పద్మములు నమ్మి
కొలచిన మనోహరుని మనుముక్తి వరరక్తి
దెలుపు పాల్కురికి సోమలింగమునకు
శివం కళ్యాణం॥ భవం కళాణం॥

తొలు దొలుత భృంగి నాధుఁడు సుకేశ ఒడునై
నిలిచి సానంద పాణినతు ? లగుచు
కలియుగంబున మల్లికార్జునునకు కృతుల్
దెలుపు పాల్కురికి సోమలింగమునకు
శివం కళ్యాణం॥ భవం కళ్యాణం॥

నివ్వాలులు :

(అపుడు అంగనలు నివ్వాలు లిచ్చిరట. యెటువలెను.)

జయభూషణ వ్యాళి శమిత సూదాళి
నియని క్రూరజహేళి నీకు నివ్వాళి
అజనుత గుణపాళి హస్తకంకాళి
నిజభక్త కమలాళి నీకు నివ్వాళి
ప్రచలార్ధతను కాళి భవచంద్రమౌళి
నిబిడ తాండవకేళి నీకు నివ్వాళి
దైత్యాది దంభోళి తత్వ్రవాళి
నిత్యకంధరకాళి నీకు నివ్వాళి
నటనా ప్రకరతోళి నంది బాహాళి
నిటలాక్ష నటశూలి నీకు నివ్వాళి!

అంగనలు పాడిన ధవళములు

జయ జయ కలుష వినాశ
జయ జయ శివసంకాశ
జయ జయ పాల్కురికేశా
జయ జయ శ్రీ సోమేశా.

ఇతి శివం!

అమర గౌతమీ కోకిల

శ్రీ బంకుపల్లె లక్ష్మణశాస్త్రి

శ్లో॥ శ్రీ గౌతమీకోకిల ఏషమూర్తిః
శ్రేయస్సు సాహిత్య సుధీహృదోత్థః
స్వాతంత్ర్యభావేన మహాంధ్రభూమా
కావ్య ప్రపంచేచ సుభాసతాంహి

ఉ॥ సాహితి పల్లవంబుల రసానుభవంబగు స్వాదుకూతలన్
స్నేహముచూపి పాంథహృది,చేతనామూర్తిగనిల్చి-ఆద్వనిన్
వాహినిపొంగుటూర్మిగ సుభాస సమాస గుణాలరూపుతో
సోహమటంచు చాటెదవు సుందర గౌతమి కోకిలావనిన్

ఉ॥ నాకు తలంపులేదని ఘనంబగు కాంక్షనుదాత్త వృత్తికన్
దాకితివేమొ! స్వామి! విని తానుగ పూవును గోసికొంచు స్వ
ర్లోక సువీర హృత్తలి, విలోకిత పుష్పసుమంబు జేసితే
మాకుమ నికునున్మరి సముంచిత కావ్యమెబంధువై భువిన్
నీకరుణాత్త జీవిత వినిర్మల కీర్తికి వేణువూదుతే

ఉ॥ ఆకుల చాటు మాటులను-ఆ కవిగూడులనుండి రెక్కలన్
ఛేకముతో పదంపడి విశేష విశాల సుసాహితీ తలిన్
"నీ"కనుగొనలందొలకు నిత్యవినిర్మల మందహాస రే
ఖా కమనీయ కాంతికళిక-ల్-నను గూయగజేసెనంటివే!

చం॥ కరుణ రసైకవాది ! హృదిగాంచిన కాంచనభావమంతనీ
వర రచనన్ మనంబదుర బంచితివయ్యా! మహానుభావ! నీ
కరుణ రసైక దీపములకాంతులు, శాంతము సత్యభావమున్
సరసపు సౌహృదంబు వెదజల్లెను గౌతమివోలె పంటలన్

సీ॥ వినిచి పదములతో ననురణిత రసము
తలపుల కెరటాల తరిని జూపి
నిలిపి మైత్రిని నాకు నీకు నెన్ని జనమ్ముల
సౌహృదంబని భువిని మెలగి
తిరిగి వృత్తమవెల్ల దీపావళీ గీత
కావ్యాలటంచున్ క్రాంతిజూపి
పంచి, యూహాచవా పక్వామృతపుబాలు
వీరమాతగ వాణి తీరు జూపి
నవ్యకవులను ధ్వనిమయ నవకమంత
తిక్కనాదిగ కావ్యగోదీప్త ఘృతము
పంచితెల్గుల రసమయ భావహృదయ
మందు దీపాళి వెల్గించు మహిత కవివి.

సీ॥ నీ గీతి విశ్వమంతా గొంతువిడి పాడు
నీ ప్రేమ వారధి నేటి తరవయి
నీ కాంక్షపుష్పాలు వేత్ర సమాధులన్
నిలచి, వి, కసితము లిలను వెలసి
నీ సరస కావ్యాల వేసభుల కోసమో
గాసి చెందక విలచు కరము ధ్వనిక
నీ కవికాగడా నిత్యమై రుద్రుని
ఫాల భాగమ్మున పరిఢ విల్లు
నీదు కావ్యాలు ముక్త రురీదు కూల
ములయి తెల్గులతల్లికి సరిగు ! నీదు
ప్రేమ రత్నంబు సాహితీ సీమపంట
లవని గౌతమిపల్కు మహాకవి యని.

సీ॥ వంశధారాలక్ష్మి వరలిన యాంధ్ర వి
ద్యారణ్య వేణుస్వరపు గూతి
గిడుగు జడివాన వో విడిది గూటను జేరి
క్రొంగొత్త పల్కుతో గూయుకూత
వీర రవీంద్రుని బాలవాణీ స్వరానావా
దిగనాంధ్ర సాహితీ వగలకూత
శ్రీపాద భారతి శ్రీల్గొని గోదావ
రీ-తరంగాల శుశ్రుతల కూత
మోత మ్రోగించె తెల్గుల మోదీ పూర్ణ
కర్మ కలశాల! సౌ వర్మ వేదరవళి !
కరుణ కల్పక రసములు గావసంత
ములను, నేబది గాదను చెలిమి నీది.

అర్వాచీన తూర్పుగాంగరాజుల, గజపతి రాజుల బిరుదములు

డా. సి. వి. రామచంద్రరావు

అర్వాచీన తూర్పు గాంగరాజుల శాసనములనుండి తెలియవగు వారి బిరుదములను ఈ క్రింది శీర్షికల క్రింద చర్చించవగును.

1. అభిషేకనామములు
2. 'త్రికళింగాధిపతి' బిరుదము
3. 'గజపతి' బిరుదము
4. 'రావుత' బిరుదము
5. మతసూచకములగు బిరుదములు.

1. అభిషేకనామములు:

అర్వాచీన తూర్పు గాంగులకుముందు క్రీ. శ 498 ప్రాంతమున తమ రాజ్యమును, గాంగశకమును, కళింగమున స్థాపించి, అర్వాచీన గాంగులవలెనే ఆత్రేయ గోత్రీకులైన, పూర్వాగాంగ ప్రభువులు, "అనంతవర్మ", "దేవేంద్రవర్మ" అను అభిషేక నామములను, యథాక్రమమున, ఒకరి తర్వాత ఒకరు ధరించిరి.[1] పూర్వగాంగులలో లెక్కిడబడిన రెండవ మధుకామార్ణవుని (క్రీ. శ. 1016) తనయుడై, అర్వాచీనగాంగులలో మొదటివాడుగ నెంచబడుచున్న మూడవ వజ్రహస్తుడు (క్రీ. శ. 1038–1070)' అనంతవర్మ' బిరుదాంకితుడు; మూడవ వజ్రహస్తుని కుమారుడు రాజరాజ (క్రీ.శ. 1070–1078) "దేవేంద్రవర్మ" బిరుదాంకితుడు; రాజరాజ తనయుడు చోడగంగదేవ చక్రవర్తి (క్రీ. శ. 1078-1152) అనంతవర్మ బిరుదాలంకృతుడు. పూర్వగాంగులలో, మూడవ వజ్రహస్తుని తండ్రి, రెండవ మధుకామార్ణవుడు 'దేవేంద్రవర్మ' బిరుదమును, వజ్రహస్తుని పితామహుడు రెండవ వజ్రహస్తుడు 'అనంతవర్మ' బిరుదమును ధరించినవారు. మూడవ వజ్రహస్తుని శాసనములుగాని, అతని పుత్రుడు దేవేంద్రవర్మ రాజరాజు శాసనములుగాని, అతని పౌత్రుడు అనంతవర్మ చోడగంగుని శాసనములుగాని, తూర్పుగాంగులలో మొదటగా ఈ బిరుదములను ధరించినవారెవ్వరో చెప్పవు. అనంత వర్మ చోడగంగుని తర్వాతి కాలమునాటి అర్వాచీన గాంగరాజుల తామ్రపట్టికల పీఠికలలో, గంగవాడి (కోలారుజిల్లా, కర్నాటక) రాజ్యమునకు చెంది, తూర్పుగాంగుల కూటస్థుడైన కోలాహలుడు మొదటగా 'అనంతవర్మ' బిరుదమును వాడినాడని చెప్పబడినది.[2] అనంతవర్మ చోడగంగుని కాలమునుండి గల అర్వాచీన గాంగుల తామ్రపట్టికలు, వందలాది శిలాశాసనములు, చోడగంగుడు శా. శ 999 లేక క్రీ. శ. 1077 లో రాజ్యమునకు వచ్చినప్పటినుండి రెండవభానుదేవుని (క్రీ. శ. 1305–1327) కాలము వరకు, అనగా 240 సంవత్సరములు, అందరు అర్వాచీన గాంగరాజులు 'అనంతవర్మ' నామమును మాత్రమే, వారి నిజ నామములతోపాటుగాని, నిజనామములను విడచిగాని, వాడిరని తెలవు చున్నవి. శిలాశాసనములలో శా శ. 1229 (క్రీ. శ. 1307) తర్వాత మనకు 'అనంతవర్మ' అను బిరుదు కానవచ్చుటలేదు. అనగా మూడవ నరసింహుని (క్రీ. శ. 1327–1353) కాలము నుండీ, ఇంకనూ చెప్పవలసిన రెండవ భానుదేవుని (క్రీ.శ. 1305–1327) మరి రాజ్యవత్సరములనుండియే, అర్వాచీన గాంగరాజులు ఏదో కారణమున, 'అనంతవర్మ' బిరుదమును వాడుట మానిరని చెప్పవలసియున్నది నాల్గవ నరసింహుని కాలము (క్రీ. శ 1378–1409) నుండి. గాంగరాజులు శాసనములలో తమ పరిపాలనా సంవత్సరములను చెప్పుటయు మానివేసిరి. బహుశా, వారి ప్రాభవము తగ్గిపోవుచున్నదనుటకు ఇది ఒక సూచన కావచ్చును. పైన చెప్పిన దానినిబట్టి అర్వాచీన తూర్పు గాంగరాజులలో మొదటి ముగ్గురు రాజులైన అనంతవర్మ మూడవ వజ్రహస్తదేవుడు, దేవేంద్రవర్మ రాజరాజదేవుడు - అనంతవర్మ చోడగంగదేవుడు—వీరి బిరుద నామములనుబట్టి, 'అనంతవర్మ', 'దేవేంద్రవర్మ' 'బిరుదములను వారి తరువాతి రాజులు యథాక్రమమున వాడిరని నిర్దేశించ వీలుగాదు.

2. త్రికళింగాధిపతి :

గాంగశకము 39వ సంవత్సరమునాటి ఇంద్రవర్మ జిర్జింగి తామ్రపట్టికలనుబట్టి[3] గాంగశకము 64వ సంవత్సరమునాటి

మహాసామంతవర్మ పొన్నుటూరు తామ్రపట్టికలను[4] బట్టి, పూర్వ గాంగులలో వరుసక్రమమున మొదటి ఇద్దరు రాజులైన ఈ ఇంద్ర వర్మ, మహాసామంతవర్మలు 'త్రికళింగాధిపతి' బిరుదమును వహించిరని తెలియుచున్నది. సామంతవర్మ తర్వాతి పూర్వగాంగరాజులలో, ఒకరిద్దరు 'సకల కళింగాధిపతి' బిరుదమును వహించినను, ఎవరునూ 'త్రికళింగాధిపతి' బిరుదమును వహించినట్లు తెలియరాదు సామంతవర్మతర్వాత 'త్రికళింగాధిపతి' బిరుదమును వహించినవాడు, అర్వాచీన గాంగులలో మొదటివాడుగ పరిగణింపబడుచున్న మూడవ వజ్రహస్తుడే. ఈ బిరుదము, శా. శ. 976 నాటి మూడవ వజ్రహస్తుని మందసా తామ్రపట్టికలో[5] తప్ప, మిగిలిన అతని తామ్రశాసనము లన్నిటియందును గానవచ్చును. అంతేకాక, ముఖలింగమందలి అతని శిలాశాసనము[6]లలో కొన్నిటియందును ఈ బిరుదము చెప్పబడ్డది. మొదటిసారిగా శా. శ. 967 (క్రీ. శ. 1045) నాటి మూడవ వజ్రహస్తుని నరసీపట్నం తామ్రపట్టికలలో ఈ బిరుదము కానవచ్చును.[7] త్రికళింగముగ పేర్కొనబడిన ఉత్కళ, కొంగొద, కళింగ ప్రాంతములను తన అధికారము క్రిందికి తెచ్చి మూడవ వజ్రహస్తుడు ఈ బిరుదము వహించినాడని ఆర్. డి. బెనర్జీ అభిప్రాయము.[8] విర్జిత రాజన్యుని బిరుదముల వహించుట హైందవ పాలకులలో ఒక సంప్రదాయము. కళచురి వంశజుడైన మహారాజాధిరాజ కర్ణదేవుని క్రీ. శ. 1045 వారణాశి తామ్రపట్టికలనుబట్టి, అతనికి 'త్రికళింగాధిపతి' బిరుదము కలదని తెలియుచున్నది.[9] ఈ కాలమున అర్వాచీన గాంగులు, కళచురులు విరోధులై ఉండుటను బట్టి, కర్ణదేవుని రణమున నిర్జించి మూడవ వజ్రహస్తుడు 'త్రికళింగాధిపతి' బిరుదమును వహించినాడని మనము ఊహించవచ్చును. కాని ఇచట ఒక ఇబ్బంది కలదు. మూడవ వజ్రహస్తుని క్రీ. శ. 1058నాటి నడగాం తామ్రపట్టికలయందును,[10] అదే వత్సరము నాటి కర్ణదేవుని సారనాథ్ శాసనమునను ఈ బిరుదము కానవచ్చుచున్నది. అనగా ఒకే సమయమున మూడవ వజ్రహస్తుడు, కర్ణదేవుడు ఈ బిరుదమును ధరించి యుండిరని తెలియుచున్నది. బహుశః త్రికళింగ మనబడు భూభాగమున కొంత ప్రాంతమును ఇద్దరును ఆక్రమించి, పరిపాలించుటచే, ఈ బిరుదమును ఇద్దరును వహించిరని తలచవలసియున్నది. త్రికళింగ భూభాగ మేదను విషయమున చరిత్రకారులలో అభిప్రాయ భేదములు కలవు.[11] ఈ విషయమున ఆర్. డి. బెనర్జీ అభిప్రాయమును పైన తెల్పియుంటిమి. ఈ 'త్రికళింగాధిపతి' బిరుదమును, వేంగిచాళుక్యులు[12], దక్షిణ కోసల సోమవంశీయులు[13], త్రిపురి కళచురులు,[14] అర్వాచీన గాంగులు—అందరును వహించి యుండుటనుబట్టి, వీరందరి రాజ్యములను వెంబడించి గోదావరీ, మహేంద్రగిరి మధ్యస్థదేశమగు కళింగమునకు పశ్చిమమునవున్న అరణ్య ప్రాంతమును త్రికళింగముగా గ్రహించవలసియున్నది. వేంగీ చాళుక్యుడైన అమ్మంగరాజు మచిలీపట్నం శాసనమున చాళుక్య భీముని తనయుడైన విజయాదిత్యుని గూర్చి అతడు త్రికళింగాటవితో కూడిన వేంగిమండలమును ఆరు మాసములు పాలించి దివంగతుడాయెనని చెప్పబడ్డది. 'విజయాదిత్యః షణ్మాసాన్ వేంగీమండలమ్ త్రికళింగాటవీ యుక్తమ్ పరిపాలయ దివం యయౌ.''[15] ఈ చాళుక్య శాసనము త్రికళింగము అటవీ ప్రాంతమని చెప్పబడుట గమనించవలెను.

అర్వాచీన గాంగులలో మూడవ వజ్రహస్తునితర్వాత ఈ బిరుదమును ధరించినవారు క్రమముగా వజ్రహస్తుని కుమారుడు దేవేంద్రవర్మ రాజరాజు, రాజరాజు కుమారుడు అనంతవర్మచోడగంగుడు, చోడగంగుని (ప్రపౌత్రుం) డును మూడవ రాజరాజు (క్రీ. శ. 1198–1211) కుమారుడును అగు మూడవ అనియంక భీముడు (క్రీ.శ. 1211–1238). అనంతవర్మ చోడగంగుని, మూడవరాజరాజు కాలముల మధ్యపాలించిన (మూడవ) కామార్ణవుని (క్రీ.శ.1147–1156), రాఘవుని (క్రీ. శ. 1156–1170), రెండవ రాజరాజు (క్రీ. శ. 1170–1190) యొక్క తామ్ర పట్టికలు నేటికి లభ్యముకాదు. ముఖలింగము, శ్రీకూర్మము, మరికొన్ని ప్రదేశములందు పరిమిత సంఖ్యలోనున్న ఈ ముగ్గురు రాజుల శిలాశాసనములందు 'త్రికళింగాధిపతి' బిరుదము కానరాదు. కామార్ణవుని మొదలు మూడవరాజరాజువరకుగల రాజులు, కళింగమున కొంత వెలనాటి చోళులకు, కాకతీయులకు గోల్పోయి వారికి సామంతులై సత్వహీనులగుటచే "త్రికళింగాధిపతి" బిరుదమునకు అర్హత గోల్పోయి ఉండవచ్చును. మూడవ రాజరాజు కుమారుడు మూడవ అనియంక భీముడు (క్రీ. శ. 1211-1238), వెలనాటి చోళులకు, కాకతీయులకు నష్టపడిన ప్రాంతములను తిరిగి జయించి, గాంగుల ప్రాభవవైభవములను మరల నిలిపి, 'త్రికళింగాధిపతి' బిరుదమును మరల వహించినాడు ఏ కారణముననో మొదటి నరసింహుని (క్రీ. శ. 1238–1263) కాలమునుండి అర్వాచీన తూర్పుగాంగ రాజులు, వారి శిలాశాసనములందును, తామ్రపట్టికలయందును ఈ బిరుదమును వాడలేదు; బహుశః, ఆకాలమునకు ఈ బిరుదమున కుండిన రాజకీయ ప్రాముఖ్యము లుప్తమైపోయి వుండవచ్చును.

3. గజపతి :

అనంతవర్మచోడగంగుని శిలాశాసనములలో కానవచ్చు అతని బిరుదములలో 'నవనవతి సహస్ర కుంజరాధీశ' (99 వేల ఏనుగుల అధిపతి) అనునది ఒకటి.[16] తూర్పుగాంగులలో ఈ బిరుదమును ధరిం

చిన వారిలో మొదటివాడు కడపటివాడు ఇతడే. జగన్నాథక్షేత్ర కవివె యగు "మాదలాపాంజి" అను గ్రంథము చోడగంగుడు క్రీ. శ. 1134 లో రాజధానిని కళింగనగరము (ముఖలింగము) నుండి కటకమునకు మార్చెనని నుడువుచున్నది.[17] చోడగంగుడు రాజధానిని కటకమునకు మార్చక పూర్వమే, తన 19 వ పరిపాలనా వత్సరము (క్రీ. శ. 1097) నాటికే ఈ బిరుదమును వహించినట్లు శిలా శాసనములు తెలుపుచున్నవి. శా. శ. 1034 నాటి అనంతవర్మ చోడ గంగుని కోర్నితామ్రపట్టికలు అతడు తూర్పున ఉత్కలేశ్వరుని, పశ్చిమమున వేంగీపాలకుని రాజ్యమున పునః ప్రతిష్ఠితులు గావించెనని చెప్పుచున్నవి.[18] రాజ్యభ్రష్టుడయి, సింహాసనమున చోడగంగునిచే పునఃప్రతిష్ఠితుడైన ఉత్కళరాజెవ్వరో తెలియుటలేదు; కాని, కోర్నితామ్ర పట్టికలనుండి విశదమగు విషయమేమన, ఈ ఉత్కళ రాజెవ్వడైనను అతడు చోడగంగుని ఆధిపత్యము నంగీకరించినాడనుట. చోడగంగుని తండ్రి దేవేంద్రవర్మరాజరాజు సేనాపతి బణపతి తాను ఉత్కళమును జయించినట్లు చెప్పకొని యున్నాడు.[19] దీనినిబట్టి ఉత్కళము; దేవేంద్రవర్మ రాజరాజు (క్రీ. శ. 1070–1078), అనంతవర్మ చోడగంగు (క్రీ. శ. 1078–1152) ల కాలమునుండే గాంగుల సామంత రాజ్యమైయున్నట్లు అనుకొనవలెను. కొందరు చరిత్రకారులచే ఉద్యోతకేసరిగ గుర్తింపబడిన ఈ ఉత్కళ పాలకుని,[20] ఎవరో మరియొకరాజు నిర్జించి పదవీ భ్రష్టుని గావించి యుండవలయును[21]; చోడగంగు డపుడా ఉత్కల పాలకుని సాయమునకు వెడలి అతని శత్రువును నిర్జించి, అతనిని సింహాసనమున పునఃప్రతిష్ఠితుని గావించియుండును. ఉత్కళముమీద తాను నెరకొల్పిన ఈ అధీశ్వరత్వమే చోడగంగుని "నవనవతి సహస్రకుంజరాధీశ్వర" అను బిరుదము ధరించునట్లు చేసినదని మనము తలచవలెను. ఈ బిరుదము 'గజపతి'అను బిరుదమునకు మరియొక రూపమనుట విదితము. అందుచే తూర్పుగాంగరాజులలో 'గజపతి' బిరుదమును వహించిన మొదటిరాజుగా మనము అనంతవర్మ చోడగంగుని గ్రహించవలెను.

చోడగంగుని తర్వాత మూడవ అనియంకభీముని (క్రీ. శ. 1211-1238) వరకుగల అర్వాచీన గాంగరాజులెవ్వరును, 'గజపతి' బిరుదమునుగాని, ఆ అర్థమువచ్చు మరి ఏ బిరుదమునుగాని ధరించినట్లు కానరాదు. మొదటి నరసింహుని కాలమున (క్రీ. శ. 1238-1263) మరల ఈ బిరుదము పునరుద్ధరింపబడినది. బహుశః చోడగంగుని తర్వాతి పాలకులైన, కామార్ణవు డాదిగా మూడవరాజరాజువరకుగల రాజులు, బలహీనులై, వెలనాటి చోళులకు సామంతులైయుండినందున, వారీ బిరుదమును వహించుటకు చాలియుండకపోయిరనుకొనవలెను. మూడవ అనియంక భీముని, మొదటి నరసింహుల కాలమున గాంగులు మరల తమ స్వాతంత్ర్యము, తొల్లిటి వైభవమును సంపాదించి యుండుటచే, మొదటి నరసింహుడు ఈ 'గజపతి' బిరుదమును పునరుద్ధరించుటకు తలపడినాడు. మొదటి నరసింహుడు తన కపిలాస్ శాసనమున "శ్రీమదనంతవర్మ గజపతి వీర శ్రీ నరసింహదేవ" అని గజపతి బిరుదముతో పిలువబడుట గాంచవచ్చును.[22] మొదటి నరసింహుని తర్వాత మొదటి భానుదేవుడు (క్రీ. శ. 1263-1278)' శా. శ. 1196 నాటి ఒక ద్రాక్షారామ శాసనమున గజఘటాపతి అని, గజపతి అని పిలువ బడినాడు.[23] వింతగా, రెండవనరసింహుని (క్రీ. శ. 1278–1305) రెండవభానుదేవుని (క్రీ. శ. 1305–1327), మూడవ నరసింహుని (క్రీ. శ. 1327–1353), మూడవ భానుదేవుని (క్రీ. శ. 1353-1378), కాలములయందు మరల ఈ బిరుదము, నేటికి లభ్యమైనవారి శాసనములందు కానరాదు. నాల్గవ నరసింహుని (క్రీ. శ. 1378–1409), నాల్గవ భానుదేవుని (క్రీ. శ 1409–1434) కాలమునాటి శాసనములందు మరల ఈ బిరుదము కనిపించును. కాని ఇచట ఒక విషయము చెప్పవలసియున్నది. శా. శ. 1305 నాటి, నాల్గవ నరసింహుని ఒక సింహాచల శాసనమున, మూడవ నరసింహుడు "గజపతి పెదనరసింహదేవరాజు"లని పేర్కొనబడినాడు.[24] ఆట్లే, ఒరియా, తమిళ భాషలలోనున్న ఒక భువనేశ్వర శాసనమున, ఈ తెలుగు శాసనమందు వలెనే, మూడవ నరసింహుడు, ఒరియాలో 'వడ' (పెద్ద) నరసింహుడని, తమిళములో 'పెరియ' (పెద్ద) నరసింహుడని పేర్కొనబడినాడు.[25] కాన, మూడవ నరసింహుని శాసనములలో కానరాకపోయినను, అతడుకూడ "గజపతి" బిరుదము వహించెనని మనము తలచవలసియున్నది. ఇదే సామ్యమున. మొదటి భానుదేవుని తర్వాత వచ్చిన రాజులందరికి, వారి శాసనములలో కానరాకపోయినను, "గజపతి" బిరుద ముండెడిదని మనము ఊహించవలసియున్నది.

శా. శ. 1305 నాటి ఒక సింహాచల శాసనమున నాల్గవ నరసింహుడు శాసన సంస్కృత భాగమున, 'గజనివహపతేః నృసింహ క్షితి పతి తిలకః" అని, తెలుగు భాగమున "గజపతి వీరనరసింహదేవు"డని పేర్కొనబడినాడు.[26] అదే స్థలమందలి, శా. శ. 1311 నాటి మరియొక శాసనమున, "గజపతి శ్రీ వీరనరసింహ్వదేవరాజు" అని,[27] శా. శ. 1325నాటి వేరొక శాసనమున "గజపతి ప్రతాప వీర నరసింహ్వదేవ మహారాజులు"[28] అని చెప్పబడినాడు. అర్వాచీన తూర్పు గాంగులలో చివరివాడైన నాల్గవ భానుదేవుని, సింహాచలమందలి శా. శ. 1336: 1336, 1338నాటి మూడు శాసనములు "గజపతి" అని,[29] అదేస్థలమందలి శా. శ. 1344 నాటి మరియొక శాసనము "గజాధీశః" అని[30] పేర్కొనినది.

అర్వాచీన తూర్పుగాంగుల తర్వాత రాజ్యమునకువచ్చిన సూర్య వంశ గజపతులు, "గజపతి" బిరుదమును గాంగులనుండి వారసత్వ ముగ పొందిరి. "గజపతి" బిరుదమును చెప్పని సూర్యవంశ గజపతుల శాసన మొక్కటి గూడలేదు. సరస్వతీ విలాసము, గజపతి వంశీకులను గురించి ఇట్లని నుడువుచున్నది. "సతత దాన రాధాసుత......కపిలేశ్వరో కథం వర్ణ్యయతే; శ్రీ పురుషోత్తమ గజపతిః, శ్రీ వీరరుద్ర దేవో గజపతి రభవత్" [31] సూర్యవంశ గజపతులు, "గజపతి" బిరుదమును తమ శాసనములయందు ఏమరక వాడుటచే, ఆ బిరుదము వారి వంశనామముగా రూఢి అయినది. కావున, నేడు గజపతి రాజులన్న, సూర్యవంశ గజపతులైన కపిలేశ్వరుడు, పురుషోత్తముడు, ప్రతాపరుద్రుడు మాత్రమే స్మరణకు వచ్చెదరు. కాని నిజమునకు, పైన కనుపరచినట్లు, ఈ "గజపతి" బిరుదమును, నవనవతి సహస్ర కుంజరాధీశ్వర, గజఘటాపతి, గజనివహపతి, గజాధిశః అను దాని వివిధ రూపములలో, అనంతవర్మచోడగంగుని కాలమాదిగ అర్వాచీన తూర్పు గంగరాజులు వాడుచునే యుండిరి. అందువలన, ఈ "గజపతి" బిరుదము సూర్యవంశ గజపతుల కెంత వర్తించునో, అంత అర్వాచీన తూర్పుగాంగరాజులకు కూడావర్తించును.

ఈ సందర్భమున, శా. శ. 1345 నాటి, రెడ్డి రాణి అనితల్లి కలువచేరు శాసనమందలి ఒక శ్లోకమును పాఠకుల దృష్టి కి తేవలసి యున్నది.[32] కాకతీయ ప్రతాపరుద్రుని ప్రాభవమును గూర్చి చెప్పు సందర్భమున, ఈ శ్లోకమిట్లున్నది:

"గజపతి రుత్కళనాథః
పాశ్చాత్యాధీశ్వరో అశ్వపతిః
తాభ్యాం నరపతి రధికః
ప్రతాపరుద్రో యతస్స్మి లింగేశః

ఈశాసనము, ప్రతాపరుద్రునికాలము(క్రీ.శ1296-1323) నాటికేగజపతి,అశ్వపతి, నరపతి బిరుదములనుగూర్చి ఏర్పడియున్న ఒక సంప్రదాయమునకు శ్లోకరూపమిచ్చినదని తలచవలెను.[33] ఈ శ్లోకము ఉత్కళపాలకులు 'గజపతు'లని పిలువబడుచుండిరని చెప్పుచున్నది. ఈ శాసనమును ప్రకటించిన డాక్టర్ నేలటూరు వెంకటరమణయ్యగారు సూచించినట్లు, ఈ బిరుదము అనాదిగా ఏనుగులకు ప్రసిద్ధి చెందిన కళింగ పాలకులకు యదార్థముగ చెంద వలసియున్నది.[34] కాని వెంకటరమణయ్యగారే సూచించినట్లు శాస

ఆంధ్రగ్రంథమాల ప్రచురణలు

పండితారాధ్య చరిత్ర

డాక్టరు తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు వ్రాసిన పీఠికతో అమ్మకానికి సిద్ధంగాఉంది. వెల రు 15-00
(పోస్టేజి అదనం)

బసవ పురాణము

బైండుచేసిన రంగుల అట్టతో, కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావుగారి 'ప్రస్తావన'తో కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావుగారి విపుల పీఠికతో అమ్మకానికి సిద్ధంగా ఉంది. వెల : రు 7-50
(పోస్టేజి అదనం)

భగవద్గీత

కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు వ్రాసిన వ్యాఖ్యానముతో బైండు చేసి అమ్మకమునకు సిద్ధముగా నున్నది. వెల రు 7-50
(పోస్టేజి అదనం)

ఆంధ్రపత్రిక ఏజెంట్లద్వారా కూడా తెప్పించుకోవచ్చు.

..............................ప్రతులకు..............................

మేనేజరు

ఆంధ్రపత్రిక, గాంధీనగర్ విజయవాడ-3

నము, అది లిఖింపబడునాటికి ఉన్న పరిస్థితిని ప్రతిబింబించినది [35] శాసన కాలమునకు కాటయవేమారెడ్డి చిల్కాసరస్సువరకుగల కళింగ దేశమునంతయు జయించుటచే, మూడవ భానుదేవుని రాజ్యము ఉత్కళమునకు పరిమితమయినది [36] కాని ఇచట ఒక విషయము గమనింపవలెను. అర్వాచీన గాంగరాజులకు పూర్వము కళింగమునుకాని, ఉత్కలమునుగాని పాలించిన రాజు లెవ్వరును ఈ 'గజపతి' బిరుదమును ధరించినట్లు తెలియుటలేదు. అర్వాచీన గాంగులకుముందు కళింగమును పాలించిన పితృభక్త, మాఠర, వసిష్ఠ, పూర్వగాంగ వంశపు రాజు లెవ్వరును ఈ బిరుదమును వహించలేదు; అదేవిధముగ అర్వాచీన తూర్పుగాంగులకుముందు ఉత్కళమును పాలించిన శైలోద్భవ, కర, భంజ కేసరి వంశ రాజు లెవ్వరును ఈ బిరుదమును ధరించలేదు [37] అందుచే "గజపతి" బిరుదమును ధరించిన కళింగ-ఉత్కల పాలకులలో, అర్వాచీన తూర్పుగాంగులే ఆద్యులుగ కన్పట్టుచున్నారు.

రావుత:

"రావుత" బిరుదమును మొదటిసారిగ ధరించినవాడు మూడవ అనియంక భీముడు (క్రీ. శ. 1211-1238) అని అర్వాచీన తూర్పుగాంగశాసనములవలన తెలియనగును. ఏదో ఒకటి రెండు శాసనములందు తప్ప, మిగిలిన అన్ని శాసనములందు అనియంక భీముడు ఈ బిరుదముతో పేర్కొనబడియున్నాడు [38] రాజకుమారుడు, రాజపురుషుడు, అశ్వికుడు అను అర్థమున, సంస్కృతమున రాజపుత్ర శబ్దమునుండి, రావుత శబ్దము సాధింపబడినది [39] రావుత్త లేక రాహుత్త బిరుదము సామంత పరిపాలకుడు అను అర్థమున వాడబడినదని డి. సి. సర్కార్ సూచించినారు.[40] జగన్నాథ-పురి క్షేత్ర కవిలె యగు మాదలాపాంజి, అనంగ భీముడు (మూడవ అనియంక భీముడు) తనరాజ్యము, సర్వసంపదలు జగన్నాథస్వామికి అర్పించి, తాను రావుత బిరుదమును ధరించి, ఆదేవునికి సామంతుడుగ ప్రకటించుకొనెనని తెలుపుచున్నది.[41] ఈ గ్రంథమే, నాటినుండి గాంగరాజుల, రాజ్యాధినేత జగన్నాథస్వామియగుటచే, తాము రాజ్యమునకు వచ్చినను, పట్టాభిషేకమును వదలివేసిరని తెలుపుచున్నది.[42] మాదలాపాంజిలో చెప్పబడిన ఈ సంప్రదాయమును సమర్థించుచు, గాంగ శాసనములలో మొదటగా మూడవ అనియంక భీముడు రావుత, పురుషోత్తమ పుత్ర అను బిరుదములతో పేర్కొనబడియున్నాడు. అంతేగాక మూడవ అనియంక భీముని కాలమునుండి శాసనములు, సంస్కృతమున, "శ్రీ చతుర్దశ భువనాధిపతి శ్రీమత్పురుషోత్తమ చరణాదేశాత్" (చతుర్దశ భువనాధిపతియైన పురుషోత్తమ స్వామి ఆజ్ఞమేరకు[43]) అను వాక్యముతో ప్రారంభమగుట కానవగును. పురుషోత్తమ పుత్ర అను పదము "పురుషోత్తముని సామంతుడు" అను అర్థమున వాడబడినదని తలచవలెను. కొన్ని శాసనములలో, మూడవ అనియంకభీముని సామ్రాజ్యము "పురుషోత్తమ సామ్రాజ్య"మనియు, అనియంకభీమ చక్రవర్తి "పురుషోత్తముని" లేక "జగన్నాథుని" లేక "దేవాది దేవుని" సామంతుడనియు చెప్పబడినది. మూడవ అనియంకభీముని తర్వాత, కొంతమంది గాంగరాజులు, గజపతులు ఈ "రాహుత", "పురుషోత్తమపుత్ర" బిరుదములను వహించిరి. వారును, వారి శాసనములను, సంస్కృతమున "స్వస్తి చతుర్దశ భువనాధిపతి శ్రీమత్ పురుషోత్తమ చరణ ఆదేశత" అని ప్రారంభించి, తాము జగన్నాథ-పురీశునికి సామంతులమని ప్రకటించుకొనిరి. మూడవ అనంగభీముని తర్వాత వచ్చిన గాంగరాజులలో మొదటి నరసింహుడు, మూడవ నరసింహుడు "రావుత" బిరుదమును ధరించిరి.[44] మొదటి నరసింహుని కపిలాస్ శాసనము "స్వస్తి చతుర్దశ భువనాధిపతి శ్రీమత్ పురుషోత్తమ చరణాదేశాల్" అను మకుట వాక్యములో ప్రారంభింపబడి, రాజును "పురుషోత్తమ పుత్రు"డని పేర్కొనినది.[45] రెండవ భానుదేవుని మూడు శిలాశాసనములలో, ఆ చక్రవర్తి పరిపాలనా వత్సరములు, దేవునిపేర, "శ్రీజగన్నాథదేవర విజయరాజ్యసంవత్సరంబులు3,[46]" "శ్రీ దేవాదిదేవ శ్రీపురుషోత్తమ దేవస్య ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబులు 9[47]", "శ్రీ దేవాదిదేవ శ్రీ జగన్నాథ దేవరల విజయరాజ్య సంవత్సరంబులు 13[48]", గా చెప్పబడినవి. దేవునిపేర చెప్పబడ్డ ఈ పరిపాలనా వత్సరములు, దేవుని సామంతుడుగా, ధర్మకర్తగా రాజ్యము పాలించుచున్న రెండవ భానుదేవుని పాలనా వత్సరములే అను విషయమున సంశయములేదు.

గాంగుల సంప్రదాయములను కొనసాగించిన సూర్యవంశ గజపతులు, పురుషోత్తమస్వామికి, గాంగులకు మధ్యగల "అధిపతి-సామంత" సంప్రదాయమును, తాము కొనసాగించిరి. శా. శ. 1382నాటి కపిలేశ్వర గజపతి శ్రీశైల శిలాశాసన తెలుగు భాగమున "పురుషోత్తమ పుత్రు"డని, ఒరియా భాగమున "రావుతు"డని పిలువబడినాడు.[49] కలి వత్సరము 4361 (క్రీ. శ. 1460) నాటి రఘుదేవ నరేంద్రుని వరంగల్ శాసనము "విష్ణురాజ్య ప్రవర్ధమానస్య" అని ప్రారంభింపబడుటయేగాక, "చతుస్సముద్రాధిపతి శ్రీమతు శ్రీ పురుషోత్తమ ఆదేశాత్" అను మకుట వాక్యమును గూడ కలిగియున్నది.[50] ఈ శాసనమునను కపిలేశ్వరుడు "పురుషోత్తమ పుత్రు"డని పిలువబడియున్నాడు. కపిలేశ్వరుడుతన 35వ అంకవత్సరమునాటి ఒక శాసనమున తనను జగన్నాథుని తరపున రాజ్యభారము నిర్వహించుచున్న ఒక సేవకునిగా భావించుకొని ఆ దేవునికి తన కష్టనిష్ఠురములు నివేదించి, తాను చేయు కార్యముల బాగోగులను నిర్ణయించవలసినదిగా ఆ దేవునికిట్లు నివేదించుకొన్నాడు. "జగన్నాథా! నీ సేవకుడు రాజమందరి ఉన్నతాధికారులకు ఇట్లు తెలుపుచున్నాడు. సేవకులు, సైనికులాదిగా.........అందరిని వారి బాల్యమాదిగా క్షేమ మరసితిని. వారిప్పుడు నన్ను వదలివేసినారు. వారిని తగినట్లు శిక్షించదలచినాను. జగన్నాథస్వామీ! నా కార్యముల మంచి చెడులను నీవే నిర్ణయింపుము."[51]

5) మత సూచకములగు బిరుదములు:

అర్వాచీన తూర్పుగాంగ శిలాశాసనములలో, తామ్రపట్టికలలో పాలకుల మతాభిమానమును, మత ధోరణులను సూచించు బిరుదము లనేకము కలవు. చోడగంగుని (క్రీ. శ. 1070–1152) కాలము వరకు గల తామ్రపట్టికలలో, అర్వాచీన గాంగులు, పూర్వగాంగుల వలెనే, ప్రశంసా సహిత భక్తి శ్రద్ధలలో, తాము మహేంద్రాచల శిఖర ప్రతిష్ఠితుడైన శివ-గోకర్ణేశ్వరుని తమ కులదైవముగా పేర్కొనిరి. కాని, వింతగా, గాంగరాజులు ఈదేవునికిచ్చిన దాన, ధర్మమొకటికూడ తెలియరాదు. శా. శ. 1055, అనంతవర్మ చోడగంగుని పరిపాలన వత్సరము 60 నాటిది ఒకే ఒక శాసనము మహేంద్రగిరియందు కలదు. ఇది శ్రీ కరణ భీమనాథుడనువాడు దేవునికి సమర్పించిన నిత్యదీపమునుగూర్చి తెలుపును [52] మూడవ వజ్రహస్తుడు, దేవేంద్రవర్మరాజరాజు, శాసనములలో పరమమాహేశ్వర బిరుదముతో చెప్పబడిరి. అదే విధముగా రాజరాజు కుమారుడు అనంతవర్మ చోడగంగుడును తనతొలి శాసనములలో పరమ మాహేశ్వరు డని పేర్కొనబడియున్నాడు[53] కాని, చోడగంగుని మరి శాసనముల కాలమునుండి, అర్వాచీన గాంగుల మత ధోరణులలో ఒక క్రమాగత మైన మార్పుకానవచ్చుచున్నది; క్రమ క్రమముగా వీరు శైవము నుండి వైష్ణవమునకు మారజొచ్చిరి. చోడగంగుని తొలి శాసనము లని పేర్కొనదగిన, శా. శ. 1003 నాటి అతని కొర్ని, విశాఖ పట్నం తామ్రపట్టికలలో అతడు పరమ మాహేశ్వరుడు గా మాత్రమే పేర్కొనబడినాడు. కాని, మరికాలమునకు చెందిన, శా. శ. 1034 నాటి కొర్నితామ్ర పట్టికలలో అతడు పరమ మాహేశ్వరుడు గా మాత్రమేగాక, పరమ వైష్ణవుడుగను పేర్కొ బడినాడు[54]. పోగా, శా. శ. 1040 నాటి విశాఖపట్నం తామ్రపట్టిక అతనిని పరమవైష్ణవుడుగా మాత్రమే పేర్కొన్నవి.[55] ఈ సందర్భమున ఒక విషయమును జ్ఞాపకముంచు కొనవలయును. శా. శ. 1003 నాటి కొర్ని శాసనము ఆ కాలము నాటికి చోడగంగుడు ఉత్కలమును జయించినట్లు తెలుపదు; వంశ క్రమమును గుణార్ణవునితో ప్రారంభించును. శా. శ. 1034 నాటి కొర్నిశాసనము, ఆ కాలమునాటికి చోడగంగుడు ఉత్కలమును లోగొన్నాడని తెలుపును; వంశ క్రమమును మహావిష్ణువుతో ప్రారంభించును. శా. శ. 1057 నాటి శ్రీ కూర్మమందలి ఒక శిలాశాసనము చోడగంగుడు ప్రాక్, పశ్చిమోత్తరము లందలి రాజ్యములను గెలిచి, రక్తసిక్తములైన కత్తులను భాగీరథీ-గంగ, గౌతమీ గంగ (గోదావరి) నదులలో క్షాళితము గావించెనని తెలుపుచున్నది.[56] జగన్నాథక్షేత్ర కవిలె, మాదలా పాంజి క్రీ. శ. 1134 ప్రాంతమున చోడగంగుడు రాజధాని నగరమును కళింగ నగరము (ముఖలింగము, శ్రీకాకుళంజిల్లా) నుండి, మహానదీతీరస్థ మగు కటకమునకు మార్చెనని తెలుపుచున్నది [57] అనంతవర్మచోడ గంగుని తరువాతి కాలమునాటి గాంగ తామ్ర శాసనములు, చోడ గంగుడు పురుషోత్తమ స్వామికి సముద్రతీరమున ఒక దేవాయతనము నిర్మించెనని తెలుపుచున్నవి.[58] ఈ దేవాయతనము పురి – జగన్నాథ మందిర దేవాయతనమనుటలో సంశయములేదు. ఈ ఆధారములన్ని, కొర్ని తామ్రపట్టికల కాలమైన క్రీ. శ. 1112–1113 నకు కొంత ముందుగా చోడగంగుడు ఉత్కలమును జయించుటకు, అతని మత విశ్వాసమునందలి మార్పునకు సంబంధము గలదని సూచించును– వైష్ణవ గ్రంథమైన ప్రపన్నామృతమును బట్టి విశిష్టాద్వైతా చార్యుడైన రామానుజుడు క్రీ. శ. 1122, 1139 లలో జగన్నాథ పురికి వేంచేసెనని తలచబడుచున్నది. ఆకాలమునకే అతడు కళింగము నందలి శ్రీకూర్మమునకుకూడా వెడలి, శైవ క్షేత్రముగానున్న శ్రీకూర్మమును వైష్ణవ క్షేత్రముగ మార్చెనని తలచబడుచున్నది. కళింగ, ఉత్కలముల యాత్రలో రామానుజుడు అచటి పాలకుని వైష్ణవమునకు మార్చెనని ప్రపన్నామృతము నుడువుచున్నది. (నృపంవశీకృత్య సమంత్రి వర్గం సర్వం జనాంచసు సలక్ష్మనార్యః[59]) రామానుజుడు వైష్ణవమునకు మార్చిన ఈ కళింగోత్కల పాలకుడు అనంతవర్మ చోడగంగుడేయని మనము నమ్మవలసియున్నది. చోడ గంగుడు వైష్ణవము స్వీకరించిన తర్వాతనే తామ్రపట్టికలలో గాంగ వంశక్రమమును విష్ణుదేవునితో ప్రారంభించు ఆచారము ప్రవేశ పెట్టినాడు.

ఈ సందర్భమున ఒక విషయము నొక్కి చెప్పవలసియున్నది. శా. శ. 1040 నాటి విశాఖపట్నం శాసనమున చోడగంగుని "పరమవైష్ణవు"డని మాత్రమే పిలుచుటకుగల కారణమేదైనను, అతడుగాని, అతని తర్వాత వచ్చిన పాలకులుగాని, పూర్వీకుల మత మును విస్మరించలేదు గాంగరాజులు వైష్ణవమును అభిమానించి, పురియందలి పురుషోత్తమ–జగన్నాథుని గోకర్ణస్వామి స్థానమున తమ కులదైవము గావించుకొన్న తర్వాతగూడ, శైవమును పరిపూర్ణ ముగ ఆదరించిరని చెప్పుటకు కావలసినంత శాసనాధారము కలదు. శా. శ. 1034 నాటి కొర్ని శాసనమున చోడగంగుడు మొదటిసారిగ పరమవైష్ణవుడని పేర్కొనబడినాడు అదే శా. శ. 1034లో

అతడు భువనేశ్వరమునందలి కృత్తివాసస్వామికి, నిత్యదీపమునకై ఒక గ్రామము దానము గావించినాడు [60] శా. శ. 1036 నాటి ఒక శాసనము సార్థకముగ అతనిని "శివపూజా విధానైక హృదయ" అని పేర్కొనినది. [61] శా. శ. 1065నాటి ఒక ద్రాక్షారామ శాసనము, చోడగంగుడు అతని సోదరుడు పెర్మాడిరాజు, భీమేశ్వరస్వామికి, చోడగంగవైరాగి యాండారి [62] అను వానిద్వార కానుక లంపించిరని తెలుపుచున్నది. శా. శ. 1050లో చోడగంగుని రాణులందరును ద్రాక్షారామభీమేశ్వరుని దర్శించి, ఆ దేవునికి అఖండదీపమునకై ప్రత్యేకము ఏర్పాట్లు గావించి, శాసనములు వేయించిరి.[63] బహుశః వీరితోపాటు చోడగంగుడు కూడా ద్రాక్షారామమునకు వచ్చియుండ వచ్చును. శా. శ. 1071లో చోడగంగుని రెండవరాణి దెన్నవ మహాదేవి కుమారుడు అట్టహాసదేవుడు అఖండ దీపమునకై భీమేశ్వరునకు 50 గోవులను సమర్పించినాడు [64]. శా. శ. 1075లో చోడగంగుని సోదరుడు కొందరు బ్రాహ్మణులవద్ద ఒక రట్టడికమును విక్రయించుకొని దానిని భీమేశ్వరదేవుని కర్పూర చందనాదులకై సమర్పించినాడు.[65] నారాయణపురము (బొబ్బిలి తాలూకా) నందలి శాసనములు అనేకము ఈ పెర్మాడి సతులు, సుతులు నావపల్లి (నారాయణపురము) నీలేశ్వరునికి గావించిన దీపదానములను పేర్కొనుచున్నవి. [66] మరువెర్రు నందలి సోమేశ్వరునికి "అల్లుంచోడగంగుడు" (చోడగంగుని అల్లుడు?–అల్లుడగు చోడగంగుడు?–అలియ రామరాజువలె) అఖండదీపమునకై రెండుపుట్ల భూమిని దానమొనర్చినాడు.[67] ఇంతేగాక, గాంగ సామ్రాజ్యమందలి ముఖలింగం, నారాయణపురం, భువనేశ్వరం మొదలుగాగల శైవక్షేత్రమందలి శాసనము లనేకము చోడగంగుని రాజభృత్యులు, ప్రజలు శైవదేవాలయములకు భక్తిప్రపత్తులతో అర్పించిన అనేక విధములైన దానములను గూర్చి తెలుపును. ఇట్లు చోడగంగుడు నిజముగా వైష్ణవమును దీక్షగా స్వీకరించినాడనుకొన్నను, అతడును, అతని బంధుమిత్రులు, అతని సేవకులు, ప్రజలు శైవమునుగూడ వైష్ణవముతో సమముగ ఆదరించిరి. శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలలోని ముఖలింగం, శ్రీకూర్మం, రోణంకి, రెల్లివలస, నారాయణపురం, తూర్పుగోదావరి జిల్లాలోని ద్రాక్షారామం–ఈ స్థలములలో శా. శ. 1015 మొదలు శా. శ. 1071 వరకు లభించు చోడగంగుని శాసనము లన్నిటిలోని అతడు పరమ వైష్ణవుడుగా గాక పరమమాహేశ్వరుడని మాత్రమే చెప్పబడినాడు. ఈ శాసనము లేవన ;

శా. శ.	పరిపాలనా వత్సరము	దహింశా సంపుటము, సంఖ్య
1015	19	V. 1347
1015	19	V. 1348
......	37	V. 1025
......	37	V. 1029
......	45	V. 1095
1050	...	IV. 1191, 1192, 1194, 1195, 1196, 1197, 1198.
1053	57	X. 674
1054	58	V. 1015
...	58	V. 1342
1054	59	X. 679
1071	...	IV. 1199

ఇట్లు, అర్వాచీనగాంగులు శైవమునుండి వైష్ణవమునకు పూర్తిగా మారుటకు బదులు, శైవమునుండి స్మార్తమునకు, అనగా శివకేశవ అభేదత్వమునకు మారి, శైవ, వైష్ణవములను రెంటిని సమానముగ ఆదరించిరి. ఇట్టి ఆదరణ చోడగంగునికి పూర్వము నుండియే అర్వాచీన గాంగులు ఆచరణలో పెట్టిరి. చోడగంగుని తండ్రి దేవేంద్రవర్మ రాజరాజు, తన పేర రెంగుజేడు గ్రామమున రాజరాజేశ్వరాలయమును కట్టించినాడు; [68] నారాయణపురమందలి నలీశ్వరాలయమున సూర్యనారాయణుని ప్రతిష్ఠించినాడు.[69]

కామార్ణవుని (క్రీ. శ. 1147–1156) మొదలు రెండవ అనియంకభీముని (క్రీ. శ. 1190–1198) వరకుకల రాజుల తామ్రపట్టికలు నేటికి లభ్యముగాని, బహుస్వల్పముగ లభించిన, ఈ రాజుల కాలమందలి శిలాశాసనములందలి విషయాల్పత్వమును బట్టి, ఈ రాజుల మతాభిమానము, మతాదరణ కార్యముల గూర్చి ఏమియు తెలియరాదు. కాలము చెరగిపోయిన ఒక ముఖలింగ శిలాశాసనమున, కామార్ణవుని రాణి ఒకతె మధుకేశ్వర దేవునకు అఖండ దీప దానమొసగెనని తెలుపబడినది.[70] శా. శ. 1094 నాటి ఒక భువనేశ్వర శిలాశాసనమున "తపోధనుడు"ను, "శైవాచార్యుడు"నగు బాలకచ్చోటకుడనువాడు రెండవ రాజరాజు "రాజగురువు"గా చెప్పబడినాడు. మూడవ రాజరాజునకు సంబంధించి, శా. శ. 1120నాటి

అతని దశగోబ తామ్రపట్టికలుమాత్రమే నేటికి లభ్యమైనవి. ఈతామ్ర పట్టికలందలి పీఠిక, అటుతరువాతి రాజులందరి తామ్రపట్టికలలో పునరుక్తమైనది. ఈ దశ గోబ తామ్ర పట్టికలు మూడవ రాజ రాజు మతమునుగూర్చి ఏమియు తెలుపవు. సింహాచలము, శ్రీ కూర్మములందుగల అతని శిలా శాసనములును ఈ విషయమును గూర్చి ఏమియు తెలుపవు. కాని ఈ రాజులందరును తమ పూర్వు లనుసరించిన మత విధానమునే అనుసరించి, శైవ, వైష్ణవములను సమానముగ ఆదరించినారని తలచవలెను. ఇట్టి విధానమునే మూడవ రాజరాజు కుమారుడు, మూడవ అనియంకభీముడు అనుసరించినాడని అతని శాసనములవలన తెలియుచున్నది. మూడవ అనియంక భీముడు పురుషోత్తమ—జగన్నాథుని భక్తుడు; తన రాజ్యము, సర్వసంపదలు ఆదేవునికి సమర్పించి, అతని సామంతుడుగా, రావుత అను సామంత బిరుదమును ధరించి, రాజ్యమును పాలించినవాడని పైన తెల్పి యుంటిమి. ఈ సంప్రదాయమును అటు తరువాతి రాజులుగూడ అనుసరించిరనిగూడ పైన చెప్పియుంటిమి. కాని, మూడవ అని యంక భీమునికిగాని, అటు తరువాతి రాజులకుగాని పురుషోత్తము జగన్నాథునియందుగల భక్తి ప్రపత్తులు, వారు శైవమునుగాని, ఇతర హైందవ దేవతలనుగాని ఆదరించుటకు అడ్డురాలేదు. మూడవ అనియంక భీముని 8 వ పరిపాలనా వత్సరమునాటి ద్రాక్షారామ శాసన మొకటి, ఆరేడు 840 గద్యల ఎత్తుగల పుష్పమహాళి (స్వర్ణాభరణము ?)ను ద్రాక్షారామ భీమేశున కర్పించెనని తెలుపు చున్నది.[71] ఈ శాసనములో అనియంక భీమునికిగల పరమ వైష్ణవ పరమమాహేశ్వర, దుర్గాపుత్ర, శ్రీ పురుషోత్తమ పుత్ర, రుద్ర పుత్ర అను బిరుదములు అర్వాచీన గాంగ పాలకులు శైవ, వైష్ణవ ములయెడ కనబరచిన సమానగౌరవమును తెలుపును. దుర్గాపుత్ర, రుద్రపుత్ర అను బిరుదములు వాడిన వారిలో అనియంక భీముడు ప్రథముడుగా కనబడుచున్నాడు. అతని తర్వాత ఈ రెండు బిరుద ములను, గాంగరాజులందరును, సూర్యవంశ గజపతులును వాడిరి.[72] మొదటి నరసింహుని కపిలాస్ (దెంఖండ్ జిల్లా, ఒరిస్సా) శాసనమున అతనికి పరమమాహేశ్వర, దుర్గాపుత్ర బిరుదములు వాడబడినవి.[73] లింగరాజ దేవళ (భువనేశ్వరము) శాసనమొకటి సదాశివగురు అను వానిని మొదటి నరసింహుని గురువుగా పేర్కొనినది. ఈ సదాశివ గురుడు ఏకామ్ర క్షేత్రము (భువనేశ్వరము)న తనపేర సదాశివ మఠమును నిర్మించి, రాఢా, గౌడ మండలములనుండి వచ్చిన పరి వ్రాజకులకు ఆవాసము కల్పించినాడు.[74] శా. శ. 1268 లో మొదటి భానుదేవుడు నెయిడా విషయమందలి 12 గ్రామములు తన ఆయుష్కామ్యార్థము, వైద్యనాథేశ్వరునికి దానము కావించినాడు.[75] జాజ్‌పూర్ (ఒరిస్సా) సమీపమునగల సిద్ధేశ్వరమునందలి, నాల్గవ నరసింహుని 19 వ పరిపాలనా వత్సరమునాటి ఒక శిలాశాసనమున నరసింహుడు, రాజాధికారుల సమక్షమున 50 మాడల ఆదాయము వచ్చు ఒక గ్రామమును సిద్ధేశ్వర దేవున కర్పించినాడని తెలుపు చున్నది.[76] శైవ, వైష్ణవములకు ఇట్టి సమాన ఆదరమే గాంగ రాజులును కనపరచిరని, ముఖలింగము, శ్రీకూర్మము, సింహాచలము, నారాయణపురము, ద్రాక్షారామము, శ్రీకాకుళము (కృష్ణాజిల్లా), మరికొన్ని ప్రదేశములయందుగల వారి దాన ధర్మశాసనములు వ్యక్తము చేయును. కాని ఇచట ఒక విషయము మనము విస్మరించరాదు. మొదటి నరసింహుడాదిగాగల గాంగరాజులు తాము అభిమానించిన వైష్ణవమత దేవతలకే దేవాయతనములు ఎక్కువగా నిర్మించిరి. మొదటి నరసింహుని ఉదారాశయ ఫలితముగ రూపుగొన్న మహోన్నత కోణార్క సూర్యదేవాలయము[77] మనోహర సింహాచల దేవాలయము ఈ అభిప్రాయమునకు తావిచ్చుచున్నవి. మొదటి నరసింహుడు సింహాచలదేవాలయ విమానము, ముఖమంటపము, నాట్యమండపము, తిరుచుట్టుమాళిగె నల్లరాతిలో నిర్మించవలసినదని అభ్యాయిసేనాపతి అనువానిని నియోగించినాడు. అభ్యాయిసేనాపతి ఈ నిర్మాణమును శా. శ. 1190 (క్రీ. శ. 1268) లో పూర్తికావించినాడు.[78]

అర్వాచీన గాంగుల కాలమున వైదిక మతములేగాక, అవై

భారతి

చందా వివరములు

		ఏజంటుద్వారా	పోస్టులో
విడి ప్రతి	రు.	1-50	-
సంవత్సరచందా	రు.	18 00	19-20
6మాసములచందా	రు.	9-00	9-60

మేనేజరు

భారతి

దికమతమైన జైనమునకు కూడ ప్రోత్సాహము లభించినది. భోగాపురమందలి ఒక శిలాశాసనము, శా. శ. 1000 లో, కన్నమశెట్టి అనువాడు గాంగ ప్రభువైన రెండవ రాజరాజపేర, రాజరాజ జినాలయము నిర్మించెనని తెలుపుచున్నది.[79]

గాంగరాజుల తర్వాత వచ్చిన సూర్యవంశ గజపతులును గాంగ రాజులవలెనే శైవ, వైష్ణవములను సమానముగ ఆదరించిరి. గజపతులు కూడ గాంగులవలెనే, పురుషోత్తమ జగన్నాథుని తమ కుల దైవముగనెంచి, ఆ దేవుని సామంతులుగ రాజ్యమును పాలించిరి. గాంగులవలెనే వీరును పరమవైష్ణవ, పరమమాహేశ్వర, దుర్గాపుత్ర, శ్రీపురుషోత్తమ పుత్ర, రుద్రపుత్ర బిరుదములను వహించిరి. సింహాచల, శ్రీకూర్మక్షేత్ర స్వాములకు గజపతులు గావించిన దానధర్మములనేకము. ఈ బిరుదములన్నిటితో శా. శ. 1382 నాటి కపిలేశ్వరుని శ్రీశైల శాసనమొకటి కలదు[80] శా. శ. 1383లో కపిలేశ్వర గజపతి కొండపల్లి స్థలములోని నాలుగు గ్రామములను పాపనాశేశ్వరుని నిత్యనైవేద్యమునకు, బ్రాహ్మణుల, జంగముల అన్న సత్రములకు దానము గావించినాడు.[8] కపిలేశ్వరుని కుమారుడు హంవీరుని చిరువోలు తామ్రశాసనము వారి, హరస్తుతితో మొదలిడుటయేగాక, స్థానిక దేవతలైన కేశవదేవ, సంగమేశ్వర స్వాములను, 106 ఇతర అగ్రహారీకులతోబాటు చిరువోలి అగ్రహారమునందు భాగస్వాములుగ చెప్పినది.[82] జక్కంపూడి (కృష్ణాజిల్లా) యందలి ఒక శిలాశాసనము, హంవీరుడు జక్కిరెడ్డిపల్లె గ్రామమును బెజవాడ పాపవినాశదేవర నిత్యసేవలకును, జంగను, బ్రాహ్మణ సత్రములకును, దానమిచ్చినట్లు తెలుపుచున్నది.[83] ఈ హంవీరుడే మెంకిపాడు గ్రామమును బెజవాడయందలి రాజనారాయణ దేవాలయమునకు, దేవాలయ భృత్యుల పోషణార్థమై సమర్పించినాడు.[84] పురుషోత్తముని 34వ అంకవత్సరమునాటి ఒక ద్రాక్షారామశాసనము, అతడు ద్రాక్షారామేశ్వరునికి ఇచ్చిన కానుకలను గూర్చి తెలుపుచున్నది.[85] శా. శ. 1412లో పురుషోత్తమ గజపతి చదలువాడ (ప్రకాశం జిల్లా) గ్రామమందలి లింగోద్భవ మహాదేవునకు పోతవరము గ్రామమును సమర్పించినాడు.[86] బాపట్ల తాలూకాయందలి కొమ్మూరునందలి ఒక శాసనము ప్రతాపరుద్ర గజపతి కొండవీటి దండపాటయందలి నాలుగు గ్రామములను శ్రీ పర్వత (శ్రీశైల) మల్లికార్జునస్వామికి, అమృతపడి సేవకై యొసగెనని తెల్పుచున్నది.[87] ప్రతాపరుద్రుని వెలిచర్ల తామ్రపట్టికలు, విఘ్నేశ్వర, ఆదివరాహమూర్తుల స్తుతిలో ప్రారంభమగుచున్నది.[88] అలని రాజవోలు తామ్రపట్టికలు విఘ్నేశ్వర, బ్రహ్మ, సూర్య స్తుతులతో మొదలిడినవి.[89] ప్రతాపరుద్ర గజపతి కర్తృత్వమున పరమగుచున్న సరస్వతీ విలాసము. వినాయక, సరస్వతీ, హనుమంత, విష్ణు, శివ, కృష్ణ, సీతాద్రినాధ, దుర్గా స్తుతులతో ప్రారంభమగుచున్నది.[90]

అధోజ్ఞాపికలు

1. పూర్వగాంగులలో ఈ అభిషేక నామములను ధరించిన వారికై చూడు : మల్లంపల్లి సోమశేఖరశర్మ, "పూర్వ గాంగులు", విజ్ఞాన సర్వస్వము (వి. స), III, పు. 177 178లు.

2 రెండవ నరసింహుని కెందుపట్న తామ్రపట్టికలలో ఇట్లున్నది : "తతః కోలాహలః స ఏవం అనంతవర్మాభవత్. ధనకనక సమృద్ధ గంగావాడి ప్రసిద్ధః సకల విషయ ప్రభూతః ... తదధిపతిరథాద్యోననన్తవర్మ నృపేంద్రః"

—కళింగ దేశచరిత (సం. రాళ్ళబండి సుబ్బారావు). అనుబంధము, పు. 89. (శాసనపాఠము)

3. అదే పు 37

4. ఎపిగ్రాఫియా ఇండికా (ఎపి. ఇం). XXVII, పు 216 మొ.

5. "రాణక ధర్మఖేడి మందసా తామ్రపట్టికలు", Journal of the Bihar and Orissa Research Society JBORS, XVII, పు. 175–188లు" ఈ తామ్రపట్టికయు వజ్రహస్తుని సామంతుడైన ధర్మఖేడివి అని ధర్మఖేడి "రాణక" బిరుదము తెలుపును.

6. దక్షిణ హిందూదేశ శాసనములు (దహింశా), V.1122.

7. ఎపి. ఇం, XI, పు. 147.

8. చూడు సోమశేఖరశర్మ, వి. స, III, 236

9. ఎపి. ఇం, II, పు. 305

10. అదే IV, పు. 183 మొ.

11. చూడు. P. Acharya, "Trilinga, Trikalinga-

Kalinga Odra Utkala" Orissa Historical Research Journal (OHRJ), పు. 7 92లు.

12 ఎపి. ఇం, V, పు. 131; X V, పు. 137.

13. అదే, III, పు 47, 327లు.

14. అదే, II పు. 305.

15. అదే, V పు. 131.

16 చూడు ద హిం శా, V 1347 1348 1025

17. కళింగదేశ చరిత్ర (సం. రాళ్లబండి సుబ్బారావు), పు. 597

18. అదే, అనుబంధము, పు. 71–72లు. లేక భారతి, 1925, నవంబరు, పు. 101-102లు.

19 ఎపి. ఇం IV పు. 314 ము.

20. చూడు. వి. స. III పు. 244 245 లో మల్లంపల్లి సోమశేఖరశర్మ.

21. ఉద్ద్యోత కేసరిని ఓడించిన ఈ పరిపాలకుని సోమశేఖరశర్మ, బస్తరు ప్రాంతమును, అనగా చక్రకూట రాజ్యమును ఏలుచుండిన 'రాజభూషణ' మొదటి సోమేశ్వర మహారాజాగా గుర్తించుచున్నారు.
వి. స, III, పు. 244

22. ఎపి. ఇం, XXX III, పు. 41–44లు. (రెండవ శాసన పాఠము).

23. దహింశా. IV. 1084.

24. అదే. VI 752

25. ఎపి. ఇం. XXX II, పు. 229.

26. దహింశా, VI. 753

27. అదే, VI. 1006

28. అదే, VI. 731

29. అదే, VI. 1113, 1115, 707

30. అదే VI. 1019

31 సరస్వతీ విలాసమ్.

32. భారతి 1944, జూలై, పు. 62 ము.

33. ఈ శ్లోకము విజయనగరరాజులు కాకతీయులనుండి "నరపతి" బిరుదమును వారసత్వముగ పొందిరను తలంపునకు తావిచ్చుచున్నది.

34. కౌటిల్య అర్థశాస్త్రము, II. 2,49. కౌటిల్యుడు కళింగ, అంగ కరుశ, ప్రాచ్యదేశముల గజములు ప్రశస్తములని చెప్పినాడు.

35. భారతి, 1944, జూలై, పు 62 ము.

36 History of Reddi Kingdoms, పు. 130–132 లు.

37. చూడు సోమశేఖరశర్మ, "ప్రాచీన కళింగదేశ చరిత్ర," వి.స. III, పు. 98-105 లు; History and culture of the Indian people (Ed R. C. Majumdar) III, పు. 211-215 లు; పు. 144 ము॥; IV, పు 61 78 లు; V, పు. 209-212.

38. చూడు. దహింశా, IV. 1329, 1360, 1252, 1254;
V. 1282, 1290, 1276, 1284, 1267, 1231.

39 చూడు ఎపి. ఇం, XXVIII, పు. 243 లో డి.సి. సర్కార్

40. అదే XXVIII, పు. 243.

41. అదే XXX, పు. 19 ము॥ – డి. సి. సర్కార్ గ్రంథమునుండి ఉద్ధృతి మొనర్చిన భాగములు.

42. అదే

43. అదే. XXXI, పు. 94 ము॥

44. మొదటి నరసింహుని శిలాశాసనములకై చూడు, దహింశా, V. 1294, 1291, 1297, 1207
రెండవ నరసింహుని శిలా శాసనములకై, చూడు దహింశా, V. 1245; VI 1118; X. 719.

45 ఎపి. ఇం, XXXIII, పు. 41 ము॥

46. ద.హిం.శా, V. 1214

47. అదే, VI. 338.

48. అదే, VI. 714.

49. ఎపి. ఇం. XXXVI, పు. 79.

50 భారతి, 1958, జూన్, పు. 47 ము॥ [illegible]

51. Journal of the Asiatic Society of Bengal, LXII, పు. 95 ము॥

52. దహింశా, V. 1350
53. చూడు "చోడగంగుని కొర్ని తా మపటు కలు, శా. శ. 1003", కళింగదేశచరిత్ర, అనుబంధము, పు.61; "చోడగంగుని విశాఖపట్నము తామ్రపట్టికలు", Indian Antiquary, XVIII, పు. 161 మొ||.
54. కళింగదేశచరిత్ర, అనుబంధము, పు.72.
55. Indian Antiqursy, XXIII, పు. 165 మొ||.
56. దహింశా, V. 1335.
57. కళింగదేశ చరి త, పు. 597
58. ఎపి. ఇం, XXXI, పు. 249 మొ|| "Dasagoba plats of Rajaraja III. క. 1120". అనంత వర్మ చోడగంగుని తామ్రపట్టికల తర్వాత. మూడవ రాజ రాజుతో ప్రారంభించి మాత్రమే. గాంగ రాజుల తామ్రపట్టికలు నేటికి లభ్యమైనవి.
59. ప్రపన్నామృతము (మద్రాసు, 1877), పు. 100.
60. Orissa Historical Research Journal, I. ii పు–2.
61. ఎపి. ఇం, XXX, పు. 31.
62. దహింశా, IV. 1190.
63. అదే, IV. 1191, 1192, 1194, 1195, 1196, 1197, 1198.
64. అదే, IV. 1199.
65. అదే, IV, 1186.
66. అదే, X. 656, 658, 679, 659, 672, 692.
67. అదే, X. 690.
68. Indian Antiquary, XVIII, పు. 161.
69. చూడు, కళింగదేశచరిత్ర, పు. 535. మతపరముగ ఈ సమదృష్టి పూర్వగాంగులయందును గావంచున్నను. ఉదాహరణకు, గాంగశకము 79వ వత్సరమునాటి హస్తివర్మ తామ్రపట్టికలలో, హస్తివర్మ రోహణకి గ్రామమున అరుహలముల భూమిని నారాయణునకు కొసగినాడు. ఈ నారాయణుడు "సప్తార్ణవశాయినే సప్త సామోపగీతాయ సప్తలోకైక నాథాయ. రణ భీతోదయాభిధానాయ నారాయణాయ" అని ప్రస్తుతింప బడినాడు. (భారతి, 1934, సెప్టెంబరు, పు. 461 మొ||)
70. దహింశా, V. 1047.
71. అదే, IV. 1329.
72. గజపతుల ఈ బిరుదములకై, క్రిందచూచునది.
73. ఎపి. ఇం, XXXIII, పు. 41 మొ||
74. చూడు, Mahtav, History of Orissa, పు. 233.
75. ఎపి. ఇం, XXXII, పు. 325 మొ||; Annua Report on Epigraphy, 1960-61, సంఖ్య. 561.
76. ఏపి. ఇం, XXIX, పు. 105 మొ||.
77. నమ్రముగా, ఈ గొప్పకట్టడము, "కోణాకోణి కుటీరక ఉపకరద్ ఉష్మరశ్మే" అని 'కుటీరము'గా వర్ణింపబడి నది. చూడు. కళింగదేశచరిత్ర, అనుబంధము పు. 93 శాసన పాఠము).
78. దహింశా, VI 1142
79. అదే, X 710
80. ఎపి. ఇం. XXXVI, పు 79.
81. దహింశా, VI 761
82. ఎపి.ఇం, XXXIV, పు. 179
83. దహింశా, X. 728
84. అదే, X 740
85. అదే, VI. 1362
86. ఏపి. ఇం, XIII, పు. 155 మొ.
87. దహింశా, X. 738
88. భారతి, 1936, ఆగస్టు, పు. 271 లు మొ.
89. అదే, 1938, ఆగస్టు, పు. 237 మొ.
90. సరస్వతి విలాసమ్ (మైసూరు ప్రతి), పు. 1–2లు.

శ్వేతపత్రం

శ్రీ వకుళాభరణం జగన్మోహన్‌రావు

ప్రభూ నేడు
నా హస్తాంచలాలలో నన్ను-
నీకు స్వచ్ఛమైన శ్వేతపత్రంలా మార్చి
అందించాలనుంది.
నాడు-సత్యలోకంనుండి
పురిటింటికి వచ్చిన
పూర్ణకుంభోద్భవ
శిశువుగా నాకు జన్మనిచ్చింది.
ఆ ప్రభాత ప్రపంచంలో విహరిస్తూ
వియద్గంగా తీరంలో
వారిజమునై-వికసిత విశ్వంనై
వేళావలయిత దిశాశంఖనాదమునై
విలోల నయన చకోరమునై
నీకై -వీక్షించి-నిరీక్షించి
ఆపేక్షల పక్షాలనెత్తి లేచి వచ్చాను.
నీ వందించిన ఈ ఇలాతలంలో
ఇన్నాళ్ళనుండి ఎదిగిన—
ఈ శిశువు—ఈ పసికందు.
ఈ పవిత్ర ప్రతిమాబంధువు
ప్రజా ప్రగతి బిందువు-
నీ పసిడి గోపురంకేసి చూసింది
హృదయం విప్పి నీకై వేచింది.
మరో మాటలో చెప్పాలంటే
నాటినుండి మతి భ్రమణంలో
వెదుకుతున్నాను నిన్ను
చీకటి కవ్వలి వలయంలో
వెలుగుల మూలంలోని మర్మంలో
ఎచట నీవున్నావో—
నన్ను నీ కంకితం చేయాలనుకున్నాను.

నిన్ను గాలిస్తూ-గాలిస్తూ, చివరికి
ముదిమిలో ప్రవేశించాను,
ఏది నీ జాడ-ఏదీ నీ నీడ?
నేనా నాడు మాతృగర్భజనిత
నవీన దివ్యమూర్తిని
నేడు నీ దర్శన కాంక్షిత ఆర్త మూర్తిని.
నా ఆశవు నీవే-నా ధ్యానవు నీవే
నా జిజ్ఞాసవు నీవే-నన్ను శ్వేతపత్రంలా
స్వచ్ఛందరూపంగా-నీ బొమ్మను చిత్రించుకోవే
ధృవపత్రంలా భద్రపరచాలని తలచాను
కాని ఈ ప్రకృతి చేతన్నుడు
యధేచ్ఛగా ఏదో గీకి-
తన వ్రేళ్ళకు అంటిన ఏ రసిరా పూస్తూ
నల్లకలాన్ని దులుపుతూ
నలిపివేస్తున్నాడు
మొదట నా నుదుట నీ వేమేమో
గీతలు గీశావనుకున్నాను
కాని కాదు—
ఈ ప్రకృతి వేసిన చిత్రాలు మలిపి
మరల ఆ శ్వేతపత్రంగా పరిణమించాలని
తపించాను.
మనోవాక్కులు రెంట
మాధుర్యం పించాలని, అందుకు
బిడ్డలా మారాలని ఆరాటం తప్ప
మిగులలేదు నాలో వేరే గొప్ప
ప్రభూ—
నా హస్తాంచలాలలో-నన్ను
స్వచ్ఛమైన శ్వేత పత్రంలా మార్చి
అందించాలనుంది.

పచ్చగన్నేరు చెట్టు

శ్రీమతి ఉమాశశి

హరి పట్టభద్రుడు అయినా అతనికి తగ్గ ఉద్యోగం దొరకలేదు. నాకు హరికి దూరపు చుట్టరికం ఉంది. వరసకి అక్కయ్యనవుతాను. తమ్ముడు రాజుతోపాటు హరికూడా నన్ను అక్కా అనేవాడు. అతని స్వంత అక్కయ్య సుమతికన్న నేనంటేనే గౌరవం. ప్రతిదానికి నన్నే సలహా అడిగేవాడు "ఆవిడంటేనే వాడికి గౌరవం. ఆమె మాటంటే గురి. ఇంక ఎవరిమాటా వినడు" అని వాళ్ళ ఇంట్లోకి కించిత్ కోపంతో కూడిన అభిమానం.

ఇంతకీ, క్లీనర్ ఉద్యోగంలో చేరిపోయాడు హరి ఓరోజున. ఇంతబతుకూ బతికి క్లీనరుపనిచేయడం ఏమిటని వాళ్ళవాళ్ళకిబాధ. గుంజుకని, నెత్తీనోరూ మొత్తుకున్నారు వాళ్ళ పెద్దవాళ్ళు.

క్లీనర్ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టడంలోకూడా నాసలహా అడిగి తీసుకున్నాడు హరి. ఉద్యోగం రావడం, వెంటనే చేరిపోవడంకూడా జరిగిపోయింది. వాళ్ళింటిల్లిపాదికీ నామీద బ్రహ్మాండమయినకోపంవచ్చింది. మావాళ్ళూ నన్ను తిట్టారు అధికప్రసంగం చేశానని. చేసివుండవచ్చు కానీ హరి "ఏ ఉద్యోగం దొరికినా చేయాలనివుంది నీ ఉద్దేశంచెప్పు" అని అడిగినప్పుడు అతని అభిప్రాయాన్ని బలపరచడమే నేనుచేసిన తప్పయితే అది తప్పేమరి.

ఉద్యోగంలో చేరినప్పటినుంచీ హరి మాంచి హుషారుగా వున్నాడు. తెలివివుంది, చదువుంది, ఇన్నివున్న అతను కాకి బట్టలేసుకుని మురికి ఓడుతూ అధికంగా శ్రమపడుతుంటే చూడడానికి నాకే కొంచెం కష్టంగా వుండేది. ఇంక పాపం, వాళ్ళవాళ్ళకి ఎలా వుంటుందో!

రోజూ పని ముగించుకుని స్నానపానాదులుచేసి మా ఇంటికి వచ్చేసేవాడు. మా తమ్ముడు, అతను క్లాస్‌మేట్స్. రాజా చదువాపకుండా చదువుకుంటున్నాడు. హరి పొట్టకోసం ఉద్యోగంలో చేరాడు. అతనంటే నా కందుకే అభిమానం. "చదువుకో నేను డబ్బుసాయం చేస్తాను" అన్నా అతను ఒప్పుకోలేదు. రాత్రి పదింటిదాకా నేను, అతను, తమ్ముడు పిలుచుకుంటి అన్నయ్యలు, అమ్మా నాన్న అందరం అతనిచుట్టూచేరి కబుర్లు చెప్పుకుంటాం. అతను కబుర్లుచెప్పి అయస్కాంతంలా ఆకర్షిస్తాడు అందర్నీ. అతనిలోవున్న గొప్పతనం అదే. అనర్గళంగా ఏ విషయాన్ని గురించైనా చెప్పినది మళ్ళీ చెప్పకుండా ఉపన్యాసం ఇచ్చేస్తాడు. బోర్ కొట్టదు. వినాలనిపిస్తుంది. కానీ నిద్రకుమాత్రం తట్టుకోలేదు. మాఇంటి గోడ గడియారం తొమ్మిది కొట్టడం ప్రారంభించగానే వెళ్ళిపోయేవాడు ఎంతమంచి విషయం చెప్తున్నారే ...

ఆర్నెల్లు గడిచేసరికి మా హరినిగురించి చిత్రవిచిత్రమైన వార్తలు నా చెవినిబడడం మొదలుపెట్టాయి. వయసులోవున్న కుర్రవాడు. ఆ వయసులో ఆ ముచ్చట కాస్త జరిపిస్తే బావుంటుందని వాళ్ళవాళ్ళనుకున్నా అది సాగనివ్వలేదతను. మంచి ఉద్యోగంలో స్థిరపడేదాకా చేసుకోనన్నాడు.

మరి...ఈ వేధవేషాలేమిటి? చిరాకేసిందినాకు. వెకిలితనం వెకిలి బుద్ధులు అని తిట్టుకున్నాను. ఒకసారి పిలిచి నాలుగు చివాట్లేద్దామా అని కూడా అనుకున్నాను. కానీ అతని స్వంతవిషయాల్లో పూర్తిగా అటువంటి విషయాల్లో జోక్యం కలుగచేసికోబుద్ధికాలేదు. అతనికామాత్రం బాధ్యత తెలీదా అనుకున్నాను. గౌరవం అనేది ఇచ్చిపుచ్చుకునే వ్యవహారం కదా!

"మాణిక్యంలాంటి పిల్లాడు మట్టికొట్టుకుపోతున్నాడు ఆ వుద్యోగంలోచేరి" అంటూ వాళ్ళ పెద్దవాళ్ళు ... 'అలగా బుద్ధులు వస్తున్నాయి' అంటూ సుమతి గోలగోలగా చెప్పేసుకుంటున్నారు.

సుమతి నన్ను ఓ గంట కూర్చోబెట్టి ఉపన్యాసమిచ్చి "నువ్వు ఈ క్షణంలో మానెయ్యమంటే మానేస్తాడు. ఉద్యోగం మానెయ్యమందూ లలితా ఆ ఉద్యోగం. మరీ అలగాగా ఆ గుడిసెల్లోకంతా రాత్రిళ్ళు దూరుతుంటే చూడలేకపోతున్నాం. వాడికీ పాడు బుద్ధులేమిటో" అంటూ దోమ సంగీతం నా చెవుల్లో అది.

ఉద్యోగానికి, పాడు బుద్ధులకీ సంబంధమేమిటో నాకు తెలీలేదు. అయినా నేనేమీ మాట్లాడలేదు.

ఒకసారిమాటం మాటల సందర్భంలో అన్నాను హరితో.

"ఈ ఉద్యోగం మరీ కష్టంగావుంటే మానెయ్యకూడదూ హరీ" అని.

"నీ రాసలీలలు వినలేక చెవులు చిల్లులు పడుతున్నాయి" అని కుండ బద్దలుకొట్టడానికి నా చదువు, సంస్కారం అడ్డొచ్చాయి.

"మానేస్తానులే. మంచి ఉద్యోగం మరోటి దొరకాలి కదా! అయినా 'బెగ్గర్స్ కెనాట్ బి ఛూసర్స్' కదక్కా" అన్నాడు.

నా మనసు చివుక్కుమంది. అతను బెగ్గరా? హరి ఫ్రస్ట్రేటడ్‌గా అయిపోతున్నాడు. హరిలాంటి కుర్రాళ్ళెంతమంది ఇలా నిస్పృహ చెందుతున్నారో. బి. ఎయి., ఎం. ఎయి పాసయి ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ కూచోటం ఎంత భయంకర పర్యవసానాలకు దారి తీస్తుందో సింహాసనాలమీదఉన్న పెద్దలకి తెలుస్తే బాగుండును.

హరి అల్లాగన్నాక నేనుమాత్రం ఏమంటాను? అతని నడవడి గురించి ఏం మాట్లాడాలో తోచలేదు. కానీ నన్ను నోరుమూసుకో నియ్యకుండా చేసిందో విషయం.

మా పేటకి ఫర్లాంగు దూరంలోనే ఓ కార్ఖానా. అందుకే మా ఇంటి చుట్టుపక్కలంతా కూడా ఎక్కువగా కార్మికజనం. ఆ కార్ఖానాలో పనిచేసేవారే అంతా. మా యింటి ఎదురుగా రెండు పూరిళ్ళు. వాటిమధ్యన ఓ పచ్చగన్నేరు చెట్టు. విశ్రాంతిగా ఆ చెట్టు కింద చేరుతుంటారు జనం. ఓ పూరింట్లో సీత ఉంటుంది. సీతకి రెండు కాళ్ళూ లేవు. అవిటిపిల్ల. వాళ్ళ నాన్న ఫేక్టరీలో కూలి. వాళ్ళమ్మ అక్కడక్కడా పాచి పని చేసుకుంటుంది. ఆమె చాలా తెలివైంది. సీతకన్న చిన్నపిల్లలిద్దరూ కూలికిపోతారు. సీతే కదలలేనిది. అందుకే సీతచేత ఓ చిన్న చిల్లర దుకాణం పెట్టించింది వాళ్ళమ్మ. కదలక్కరలేకుండా సంపాదించుకోవచ్చు.

సీతకూడా నెమ్మదైన పిల్ల. సీతంటే ఆ పేటవారందరికీ ఇష్టమే. అదేకాదు. ఆ కుటుంబమంతా ఒకరి జోలికివచ్చి పోట్లాటకీ, పోరుకీ వచ్చేవాళ్ళు కాదు. సీత అంతే. ఆ దుకాణం దగ్గరే కూర్చుని నెమ్మదిగా సరుకులమ్ముకుంటుంది. పచ్చగన్నేరు చెట్టునీడలో సీత దుకాణం. అందరూవచ్చి సరుకులు కొనుక్కుని పోతుండేవారు.

అందునా, ఆఖరికి పోకిరీ లబ్బాయిలుకూడా మర్యాదగా కావల్సిన వస్తువులు కొనుక్కెళ్ళేవారు. ఏవైనా చిల్లర వస్తువులు కావల్సినప్పుడు మేము కూడా సీతకొట్టుకెళ్ళి కొనుక్కు తెచ్చుకోడం అలవాటు చేసుకున్నాం. దేక్కుంటూ పనులు చేసుకునిపోయే సీతంటే జాలి, ఆ నేర్పుచూసి నాకు ముచ్చట.

ఓ రోజు సుడిగాలిలా వచ్చింది సుమతి.

"ఈ తేభ్యం" అంటూ ప్రారంభించింది రాగానే. అంతే హరన్నమాట. ఈమధ్య అతనికి అలాంటి ముద్దు పేరే తగిలించింది సుమతి. నామీద అనవసరంగా ఎగురుతుంది. నేనే అతన్ని పాడు చేశానట. హరి తిరిగే వెధవ తిరుగుళ్ళకు నేనే బాధ్యురాలినట. ఇంక ఒకటేమిటి. ఆఖరికి చెప్పిన మాటలివి.

"దానో్తనూ, దీనో్తనూ పోతున్నాడు; సరే ఖర్మ అని సరిపెట్టుకుంటే వాడు ఈ అవిటిదాని బ్రతుకు ఎట్టేట ముంచేటట్లున్నాడు" అంది.

గతుక్కుమన్నాను.

అప్పుడప్పుడు సిగరెట్లకోసమని ఆదుకాణానికొచ్చి సీతతో కబుర్లేసుకోడం నేను గమనించకపోలేదు. కానీ అతనొక్కడేనా అవతలి వీధి కుర్రాడు. ఇవతలవీధి చాకలి పిల్లాడూ అందరూ అక్కడే బీడిలకోసమని, సిగరెట్లకోసమని ఆగుతూనే వున్నారు కబురు చెబుతూనే వున్నారు. సీతకూడా లక్ష్యపెట్టదు నవ్వుతునే సరదాగా వుంటోంది. మరి హరి నొక్కడ్నే అనడమేం?

"ఛ...హరి అటువంటివాడు కాడు" అప్రయత్నంగా అన్నాను!

" చూస్తూండు అదేజరుగుతుంది" సుమతికి కసి ఎందుకో అది బాధా?

"అలా తిట్టకపోతే వాడ్ని కాస అదుపులో పెట్టలేవూ ?" అన్నాను.

"నేనా ? నాతోమాట్లాడ్డు వాడు. మేగీ అని పిలిచా డు. అస్తమానూ నేగ్ చేస్తానట" అంది ఉడుకుమోత్తనంగా. నిజమే! సుమతికా నేగింగ్ గుణముంది. విసుగెత్తించేస్తుంది ఎదుటివాళ్ళను సణుగుడుతో.

ఆ సాయంత్రం హరి వచ్చినప్పుడు అతన్ని తీసుకుని డాబామీదకెళ్ళా. నేనడగదల్చుకున్నది ఎవరూలేకుండా అడగటానికి అనువైన ప్రదేశం.

మాటలమధ్యలో గంభీరంగా అయిపోయి "హరీ. నువ్వెవరితో తిరిగినా నాకు బాధలేదుగానీ ఆ అవిటిదాని బ్రతుకులోమాత్రం ఆడుకోకు" అన్నాను.

తుళ్ళిపడి క్షణంసేపు మాటాడలేదు.

"అంత నీచుడ్నికాను" అన్నాడు

నేనూ నొచ్చుకున్నాను అనవసరంగా అతన్ని అనుమానించానేమోనని. అతను చాలా బాధపడ్డాడు నా మాటలకు. మంచం మీంచి చటుక్కున లేచి వెళ్ళిపోయాడు.

మరో రెండు రోజులకి అతనికి మద్రాసులో సినిమా కంపెనీలో ఏదో ఉద్యోగం దొరికిందంటూ చెప్పి ఆవూరు వదిలేశాడు హరి.

సీత సంపాదన బాగా పెరిగింది. దానితో సీత తండ్రి చక్కగా చేతిలో డబ్బులుపడేసరికి తాగి తందనాలు, వీధినిపడి పోట్లాడు కోవడాలు ఇవన్నీ తయారయాయి.

హరివెళ్ళిన నెల్లాళ్ళకి ఓ వార్త ఆవీధంతా గుప్పుమంది. సీత నెలతప్పిందన్నవార్త, వెల్లబోయాను. సుమతి సాధింపు, ఈవార్త రెండూ నన్నుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సుమతి అనుమానంలో అర్థంలేదనిపించింది. 'వీడేనేమో' అని దానిభయం. భయంకాదు. అనుమానం. అందరూ గుసగుసలాడుకుంటున్నారుట.

"అందుకే ఈ ఊరినుంచి అంత తొందరగా పారిపోయాడు కాబోలు" అంటుందది బెంగగా.

నాకి సస్పెన్స్‌తో తలతిరిగిపోతోంది. సీతనే స్వయంగా అడి గేస్తేగాని ఈ బాధ తీరదునాకు. అందుకే మర్నాడు ఎవరూలేని సమయంకోసం చూస్తున్నాను. ఎప్పుడూ ఎవరో ముగ్గురు నలుగురు సీతచుట్టూ వుంటూనే ఉన్నారు. ఎలా ? ఎలా ? సరే, మర్నాడు తప్పకుండా వీలుచూసుకోవాలనుకున్నాను.

మర్నాడు సీత ఇంటిముందుగోల. తెల్లారేసరికి ఏమిటయింది బాబూ అనుకుంటూ వీధిలోకి వెళ్ళాను. నాగుండె జారిపోయింది. సీత రాత్రే గన్నేరుకాయలుతిని ఆత్మహత్య చేసుకుంది. ఆ సంఘటన హృదయ విదారకం. సమ్మెటపోటులాంటివార్త నన్ను నిలవనీయటం లేదు. ఆవిటిపిల్ల ఆత్మహత్య చేసుకుందంటె ఎంత దారుణమైన సంగతి!

అందరూ హరినే తిట్టుకుంటున్నారట. మ్రా పనిమనిషి అందించినవార్త.

నా మనసు కలతబారింది. అతనిక్కడలేడుకదా అని అతనిమీద వేసేస్తున్నారు నెపం అని నా ఉద్దేశం.

సుమతిగోల నన్ను మరింత బాధించింది. "ఏం ఉద్యోగం దొరికిందని వీడిట్లా కొంపమునిగినట్లు పారిపోయాడు. వీడేనా సీత ఆత్మహత్యకు కారణం ? ఏమంటావు లలితా ?" అంటూ గొడవ.

వెళ్ళి నెలయినా హరి ఏ సంగతీ వ్రాయకపోవడం, ఎడ్రసు ఇవ్వకపోవడం నాలోనూ చిన్న అనుమానానికి దారితీసింది. దరిమిలా నాకూ హరిమీద కోపం వచ్చింది.

'క్లీనర్ పని చెయ్యనా వద్దా' అని సలహాకి వచ్చిన హరి ఆ సినిమా కంపెనీకి దరఖాస్తు పెట్టనా వద్దా అని ఎందుకడగలేదు? ప్రశ్నలు, ప్రశ్నలు...లోలోపలే అగ్నిపర్వతంలా ప్రజ్వలిస్తోంది అనుమానం.

మరో పదిరోజులకి హరి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

అక్కా!

కోపంగా ఉందికదూ! ఉత్తరం వ్రాయలేదని. ఏం చెయ్యను నువ్వుకూడా ఆ నాడా ప్రశ్న అడిగి నీచుడిగా జమకట్టావ్. ఆరోజెంతో బాధపడ్డాను. నేను మడికట్టుకు కూర్చున్నానని చెప్పలేను కానీ ఆ సీతతోమాత్రం సంబంధం పెట్టుకోలేదు. ప్రమాణ పూర్తిగా చెప్తున్నాను. ఇది నిజం.

నా ప్రవర్తనవల్ల మీ అందరికీబాధ కలిగించడం విందుకనే ఉద్దేశంతో ఈ ఊరొచ్చాను. అప్పుడు ఉద్యోగం దొరకలేదు. కానీ మొన్ననే ఒక మందుల దుకాణంలో పద్దులురాసే పని కుదిరింది. అడ్రసు ఇస్తున్నాను ఇంతవరకు నీకు ఉత్తరం వ్రాయనందుకు నన్ను క్షమిస్తావుకదూ!

సమస్కారాలతో
నీ తమ్ముడు హరి.

ఆ ఉత్తరం చూశాక నా మనసు తెరిపినబడింది. పాపం. నిజంగా హరి తప్పేమీలేదేమో! సీత మరెవరితోనన్నా కాలుజారి ఉంటుంది. అనవసరంగా హరిని అనుమానించాం అనుకున్నాను. అయినా సీత ఆత్మహత్య చేసుకోకుండా ఉండిఉంటే బావుండేది. నిజానిజాలు తెలిసేవి. అప్పుడీ చిత్రవధ ఉండేదికాదు. ఉత్తరం వ్రాసినంత మాత్రాన హరి తప్పులేదని అనుకోడం ఎలాగ? సీత సర్దుకుపోస్తే హరి ఇందుకు కారణమేమోననిపిస్తోంది. ఇదో చిక్కు ప్రశ్నగా నిలిచిపోయింది.

ఈప్రశ్నవిడటం కష్టం. విడువులేని పొడువుకథఇది. దానికి జవాబు భగవంతుడికి తప్ప మరెవరికీ తెలీదు. సీతలేదు నిజం చెప్ప డానికి. పచ్చగన్నేరుచెట్టుఉన్నా అది నిజం చెప్పలేదు.

తప్పెతెలుసుననుకుని విర్రవీగే మనుషులకి ఇంతేశాస్తి అను కుంటూ పచ్చగన్నేరుచెట్టు మవునంగా ఉండిపోయింది.

చలం

శ్రీ వి. మోహన్‌ప్రసాద్

చెలం

తెలుగు నేలమీద నీ నెత్తురు

రమణాశ్రమం కొండెక్కి దీపమై వెలుగుతోంది
చంద్రుని నుదుటన చిక్కిన నీలి నక్షత్రంలా నీవు
జీవన జ్వరాల భయాల నిర్మోహ మోహాలమీద
నీలి వెన్నెల కురిపిస్తోన్నావు ఊరికేనే.

విశ్వాన్ని నువుకాదా దీవించింది
భగవద్గీత బొక్కి పుచ్చుకొని !

ఈ జన జంతువుల అనంత శరీర భారాన్ని
ఎంత యాంత్రో పామార్టికల్‌గా వర్ణించావు
పక్షవాతం కమ్మిన శిశువుని రెండుగా కోసి
దయగా కండరాల్ని నరాల్ని ముడివేసేవు.

పిచ్చెక్కి ప్రవచించి
లారెన్స్‌లా మావ్‌లా హాతర్న్‌లా
మానవత్వాన్ని మన్నించి ప్రేమించి క్షమించేవు.

విన్ను లాక్కెళ్లిపోయిన రయిళ్లమీద కోపం
అక్కడ్నించి వొచ్చే మెయిళ్లకోసం కాపలా
వేకువ తెలుగు వాకిటి నిలిచే చీపురు పెట్టి
ఊడుస్తుంటె

నీ పాదాల భావముద్రల లెంతకీ చెరగవు
ఉండికూడ లేకుండ ఉండటం నువ్వ

లేకుండీ ఉన్నట్టు ఉండటం నువ్వు.

ఉన్నట్టు ఉండీ
ఉండనట్టు ఉండటమూ నువ్వేనేర్పావేమో

ఆయనెవరో ఆ రమణ మహర్షికి
ఒకానొక మధ్యాహ్న సమయాన తన గదిలో

జీవిస్తూనే మరణానుభూతిని పొందిన
ఆ మరణ మహర్షికి
చెలం ప్రేమికుడికి భక్తుడికి శిష్యుడికి !

నీ నుంచి విని
నీతో ఒక్కమాటైనా మాటాడక
ఏమీ చెప్పక ఏదీ చెయ్యక

ఏ ఒక్క కీర్తనా పాడక
ఏ కీర్తినీ నీకు అప్పగించక

నిలూనా అంతర్హితమవుతూ
గాలిలో ఈథర్‌లా జ్వలిస్తూ

నీలో నిలుస్తూ
నిను కళ్లు మూసుకోమని

తాను వేళ్లసందుల్లోనుంచి దొంగ కృష్ణుడ్లా
కన్రెప్పల నవ్వుతో చూస్తూ
ఇట్టే మాయమైపోయాడా

ఉష్ కాకి అన్నాడా రాచకురుపుతో !
ఉమ్మిలోను కళ్లలోను ఉన్నాడులే వాడు
అన్నాడు స్టాన్ పార్కర్ ముసలాడు

కొడుకుగుండె తుపాకి మంటకికాలి
ఆలి క్షణికావేశంలో తూలి
దిక్కులేని దొంగమనవడ్ని ఒళ్లోకి తీసుకొని.

నువ్వు చేసింది డివాస్టేషన్ అంటారు]
తెలిక భయవేసి జంకి.

నువ్వు గొంసులు విప్పి వాస్టేట్ చేసి
ఇరుకు తెలుగులో విశ్వరూపాన్ని బిగించేవా
ఆపటాన్ని గోడకి తగిలించేప్పుడే
ఆ శ్రమం నేలమీదపడి ముక్కలయింది.

ఆ చంకల బన్నీను
మంచుధారల గడ్డ
ఇంకా నవ్వుతూనే
వజీర్ రహ్మాన్ కీర్తిస్తూనే

ఆ నీ నవుతోన్నకళ్లు గాలంతానిండి
విట్మన్ మొరటు ఫొటోగ్రాఫ్‌లా

నీవాక
ప్రశ్నార్థకంగా నిల్చేవు.

కూడిక ఏసివేత కలిసిపోయి
హెచ్చవేత భాగారం ఒకటె అయి

చెలం
'విశ్వానికి డిక్టేట్ చేసిన :
'చెలం'

లక్షాక్షరానా నీ నగ్నరక్తం
ఊజయి డిసిల్ అయి కన్నీళులయి
వాగులయి చివరికెవరికీ పట్టని ఎడారుల
ఇంకిపోయింది ఎర్రగా దయగా .

చెలం
నిను బెంచీమీద నుంచోమంటే
ఒంటేలు కెళ్లొస్తానన్నవాడివి |
మౌంటెన్ మీదే ఉండిపోయేవు
పండిపోయేవు.

ఆంధ్రుల అభిమాన దిన పత్రిక

ఆంధ్రపత్రిక

ఇప్పుడు ఎన్నో సరికొత్త శీర్షికలతో వెలువడుతోంది.

విడి ప్రతి వెల 25 పైసలు .

.... చందా వివరాలు ....

సంవత్సరమునకు	ఏజెంటు ద్వారా	రు 88-00	పోస్టుద్వారా	రు 95-20
ఆరు మాసములకు	,,	రు. 44-00	,,	రు 47-40
3 మాసములకు	,,	రు. 22-50	,,	రు. 24-30
1 మాసమునకు	,,	రు. 7-50	,,	రు 8-10

'కామాయని' కావ్యసౌందర్యం

శ్రీ గాదంశెట్టి

శ్రీ జయశంకర్ ప్రసాద్ రచనలన్నిటిలో 'కామాయని' మకుటాయమానం. ఈ భావగర్భితమైన బృహత్కావ్యం హిందీలోనేగాక విశ్వసాహిత్యానికే గౌరవగ్రంథంగా భావింపబడుతోంది. ఇది ధర్మ సమ్మతమైన కామాన్ని రసవంతంగా వివరించే కమనీయ కళాఖండం.

'కామాయని' పేరులో మనకు ప్రత్యేకత కనుపించకపోయినా మానవ మనస్సుకు ఏదో సన్నిహితత్వం ఉన్నట్లనిపిస్తుంది. అందులో ఇమిడియున్న 'కామ'ము రాత్రిం బగళ్లు మనకెంతో సన్నిహితమైనది.

ప్రాచీన కావ్యాల్లో అక్కడక్కడా ఈ కామాయని సంబంధమైన ప్రస్తావనలు అగుపిస్తున్నాయి. ఈ కావ్యము 'వైవస్వతమను' చరిత్ర ఆధారంగా వ్రాయబడింది.

కామాయని పేరు వినగానే, ఇది పురుష పౌరుష ప్రధానమైన కావ్యంకాదనీ, ఇందులో ప్రకృతి స్వరూపిణియైన నారీ భావనకే ప్రముఖస్థానం కల్పించబడి ఉండవచ్చుననీ ఊహించడం సహజం. వాస్తవంలో కూడా ఇందులో ఏ ఒక్క వ్యక్తి పరమైన కథ వర్ణింపబడలేదు. దేశకాలాలకు, జాతి ధర్మాలకు అతీతమై విశుద్ధమైన 'మానవుని' మనోవ్యాకులత ఇందులో సుస్పష్టంగా, సుందరంగా చూపించబడింది.

కామాయని కథా వస్తువు విశాల వటవృక్షపు సూక్ష్మబీజము వలె అతి చిన్నది. ఇందులో మనువు, శ్రద్ధ, ఇడ ముఖ్యపాత్రలు. అసుర పురోహితుడు, మనువుపుత్రుడు మానవుడు గౌణపాత్రలు. సారస్వత దేశపు ప్రజల అలజడిని, అంతరిక్షంలోని దేవతల కోలాహలాన్ని పాఠకులు తెరచాటునుండి వింటారు. జలప్రళయము, హిమాలయ శిఖరాలు, సారస్వతదేశ దృశ్యాలు ప్రధానంగా ఉన్నాయి.

కథావస్తువు విషయంలో రచయితచేసిన శ్రమ ప్రశంసనీయమైంది. వారి కల్పనాశక్తి అద్భుతము. కావ్యానికి ఆధారశిల హిమాలయ పర్వతము, అందులోని కైలాసము, మానస సరోవరము భారతీయులకు పవిత్ర పరిశుద్ధ స్మరణీయములు. నాయికా నాయకుల కలయిక ఆ పవిత్రతీరాన్నే జరిగింది. మనువు పుత్రుడైన మానవుడు ఆ హిమాలయాల్లోనే పుట్టాడు. యజ్ఞకర్మ ప్రారంభం కూడా అక్కడే జరిగింది.

ఈ కావ్యంలో పదిహేను సర్గలున్నాయి. 'ఆవేదన' (మొదటి సర్గ)నుండి 'ఆనందం' (చివరిసర్గ) వరకు మానవుని విభిన్న మనోదశలను వర్ణిస్తూ ఆవేదనలో అణిగిపోతున్న మనిషి అన్ని అలజడులకు తట్టుకొని ఆనందాన్ని ఎలా పొందగలడు అన్నదే ఈ కావ్యంలో చెప్పబడింది.

సృష్టి ఆరంభాన ఉత్తర భారతాన ఒక దేవజాతి ఉండేది. వారు సౌష్ఠవమయిన ఆకారం కలిగి పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేవారు. యజ్ఞాలుచేసేవారు. పశువులను బలిఇచ్చేవారు. అపారమైన వైభవం కలిగి విలాస పురుషులుగా తయారయ్యారు వారి విలాసాలు మితిమీరాయి. ప్రకృతి ప్రకోపించింది. ఒక ఖండ ప్రళయం వచ్చింది. వారి వైభవమంతా నష్టపడిపోయింది. నలువైపులా జలమయమైపోయాయి. ఈ జలప్రళయంలో 'మనువు' అనబడే ఒక దేవతకు ఏదో విధంగా ఒక నౌక సహాయం దొరికింది ఒక జలచరము దానిపైన బలమైన దెబ్బకొట్టింది. దాంతో మనువు ఎగిరిపోయి హిమాలయాల కొండ చరియలపైన పడ్డాడు. ఈ విధంగా ఆ దేవజాతి బీజము నష్టపడకుండా బతికి బయటపడినప్పటికీ తన కళ్లఎదుట జరిగిన ప్రకృతి వినాశనాన్ని తల్చుకొని మనువు 'ఆవేదన' పొందుతాడు. క్రమంగా ప్రళయ ప్రకోపం తగ్గి ప్రకృతి శాంతిస్తుంది. మనువు మనస్సులో మళ్లీ జీవితంమీద 'ఆసక్తి' ఏర్పడుతుంది. కొంతకాలానికి తనతోపాటి శ్రద్ధ అనే గంధర్వకన్యకూడ జీవించి వున్నట్లు తెలుస్తుంది. ఈ శ్రద్ధ ఎవరోకాదు, ఈ కావ్యనాయిక కామాయనియే. ఆమెతో పరిచయం అతనికి 'ఆహ్లాదం' కలుగజేస్తుంది. ఆ పరిచయం మెల్లగా 'అనురాగం'గా మారుతుంది. వలపులతో పులకరించిన రెండు హృదయాల మధ్య గాఢమైన 'అనుబంధం' ఏర్పడుతుంది. కాని దీనికి స్త్రీ సహజమైన బిడియం 'అవరోధం' కల్పిస్తుంది. చివరకు కామాయని కాంతుని కౌగిటిలో కరగిపోతుంది. అసుర పురోహితుల సాయంలో యజ్ఞంచేసి ఇరువురు 'ఆచరణ' బంధాన్ని అంగీకరిస్తారు. శ్రద్ధ గర్భవతి అవుతుంది. అప్పుడు ఆమె మమకారం భావి సంతానంపైపు మళ్లి తన ఎడల విముఖత ప్రదర్శించడం మనువు సహించడు అతని కామార్తి శాంతించదు. 'అసంతృప్తి'తో అతడు అధికసుఖానికై 'అన్వేషణ' సాగిస్తాడు సారస్వత నగరంలో ఇడ రాణితో అతనికి పరిచయం

కలుగుతుంది. ఆమె కోరిక ప్రకారం తన బుద్ధిబలంతో అతడు నగర శాసనాన్ని చక్కబెడతాడు. కాని అతనిలో అణగివున్న కామవాసన ఇడనుకూడ స్వాధీనం చేసుకోవాలని చూస్తుంది. ఇడ పెడ ముఖం పెడుతుంది. ప్రజలు తిరగబడతారు. ఈ కల్లోలమంతా శ్రద్ధకు పీడకలగాకనిపిస్తుంది. 'ఆందోళన'తో ఆమె తన కన్నకొడుకును వెంట బెట్టుకొని పతినన్వేషిస్తూ వెళుతుంది. తుదకు సారస్వత నగరంలో ఇడ కనిపిస్తుంది. మైమరచిన 'ఆవేశం'లో ప్రజలతో పోరాడి గాయపడియున్న మనువునుచూచి ఆమె తన కల నిజమైందని వాపోతుంది. మనువును 'ఆప్యాయం'తో ఓదారుస్తుంది. మనువు పరితపించి శ్రద్ధకు తన పాపపంకిల ముఖం చూపలేక అర్ధరాత్రివేళ పారిపోతాడు. శ్రద్ధ తన కొడుకును ఇడకు అప్పగించి మళ్లీ భర్తను వెతుక్కుంటూ బయలుదేరుతుంది. చివరకు ఒక కొండగుహలో అతడు కనిపిస్తాడు. ఈసారి శ్రద్ధ అతనికి అతిలోక సాధ్విగా గోచరిస్తుంది. ఆమె ముఖమండలంలో అతనికి నాట్యలోలుని దివ్యతేజస్సు—తేజస్సున కతీతమైన 'ఆ లోకం' భాసిస్తుంది. అప్పుడు వారిరువురు విశిష్టమైన మనోదశలో త్రిపుర సౌందర్యంచూస్తారు. ఇచ్ఛా జ్ఞాన కర్మ జగత్తుల ఆంతర్యం శ్రద్ధ వివరిస్తుంది. శ్రద్ధా సమేతుడైన మనువు మానస సరోవరాన్ని తన చిర నివాసం చేసుకుంటాడు. ఈలోగా సారస్వతనగర వాసులను కూడగట్టుకొని ఇడ కూడ మానవ(మనుతనయుడు) సమేతంగా మానసయాత్రచేస్తుంది. అక్కడ సాంద్ర చైతన్య తరంగిణిలో ఓలలాడుతున్న మనువు అందరికి 'ఆనందం' పంచి పెడతాడు. అది జగదేకసుందరమైన ఏకాంతం. ఇది 'కామాయని'లోని కథ.

'ఆవేదన'నుండి 'ఆనందం' వరకు క్రమపరిణామం పొందిన శ్రద్ధామయ మానవుని వివిధ మనోదశలు, భావ భూమికలు ప్రతిబింబించే పదిహేను సర్గల రసవత్కావ్యం ఇది. ఇందులో శ్రద్ధ హృదయాహ్లాదిని. ఇడ చిద్విలాసిని. రెండింటి సమన్వయం ఆనందం సంధాయకం అవుతుంది.

ఈ ప్రబంధకావ్యానికి మహాకావ్యానికి ఉండవలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. ఇందలి ప్రధానరసం శృంగారం. వాత్సల్యం, రౌద్ర, వీర, కరుణ రసాలు సహాయకంగా ఉన్నాయి. ఇందలి ప్రకృతి వర్ణన చాలా అందంగా అధికంగా కూడా కనిపిస్తుంది. ఉదాహరణకు:—

హిందీ:— ఉషాసునహలే తీర్ బర్ సాతీ
జయలక్ష్మీసీ ఉదిత హుయీ
ఉధర్ పరాజిత కాలరాత్రి భీ
జలమేఁ అంతర్నిహిత హుయీ.

తెలుగు:— పసిడి పసిడి బాణములను కురియుచు
విజయలక్ష్మివలె ఉదయించిన దుష
ఇపుడె పరాజిత కాళరాత్రియును
నీట మునిగి అంతర్హితమయ్యె

హిందీ :—యహ్ వివర్ణముఖ త్రస్త ప్రకృతికా
ఆజ్ లగాహనసే ఫిర్‌సే
వర్షా బీతీ, హు ఆ సృష్టియేఁ
శరద వికాస్ నయేసిర్ సే.

తెలుగు: భయ వివర్ణముఖ ప్రకృతి మరల నే
డాశా ముదిత సుహాసిని అయ్యెను
ముగిసిపోయినవి ముసురు దినములిక
మొదలయినవి శారద సవర్త్రాతులు.

ఈ కావ్యలక్ష్యమైన సమరసతాజన్య ఆనందప్రాప్తి కూడా ప్రకృతి ప్రాంగణంలోనే జరుగుతుంది.

ఇందు మానసిక భావసంఘర్షణ అధికంగానూ భౌతికతత్త్వము స్వల్పంగానూ ఉన్నాయి. ఇతివృత్తాత్మకత పరిమితంగానూ భావచిత్రీకరణ అపరిమితంగానూ ఉన్నాయి.

మనువు ఆత్మానందంతో లీనంకావడంతో గ్రంథం పరిసమాప్తమవుతుంది.

లేదు జడచేతన విభేదము
సమరసము సురుచిరము సకలము
సాంద్ర సతతానందమయ చై
తన్య మది జగదేక కాంతము.

ఇందలి భావ పక్ష కళా పక్షాలు రెండునూ పరిపుష్టంగా ఉన్నాయి. శ్రద్ధ సౌదర్యవర్ణనలో ఒకపద్యం ఇలా వుంది:
హిందీ :—

ఘిర్ రహేథే ఘుంఘురాలే బాల్
అస అవలంబిత ముఖకేపాస్
నీలఘన శావకసే సుకుమార్
సుధా భర్‌నేకో విధుకేపాస్.

తెలుగు :—

అంసద్వయ మవలంబనముగ నెలి
కొన్న వదనమును కురులు ముసిరినని
నీలమేఘ శావకములు మురియుచు
సుధను నింపుకొన శశిని చేరినటు.

ఈ కావ్యమందలి భాష అత్యంత లాక్షణికమయినది. ఇందలి లాక్షణిక ప్రయోగాలు స్వాభావికంగానూ, బోధగమ్యంగానూ ఉన్నాయి. అలంకారాలు భాషకొరకుగాక భావోత్కర్ష కొరకు చేయబడ్డాయి.

వాటంక, రూపమాల, పాదాకులల్, రోలా మొదలగు ఛందస్సు వాడబడింది.

ఈ కావ్యంలో ఐతిహాసికతతోబాటు రూపక తత్వముకూడా సమన్వితమై ఉంది. ఇందుకే దీన్ని మానవీయ మనోభావనల రూపక కావ్యమంటారు. ఇందలి పాత్రలు ఐతిహాసికమైనవే కాకుండా మానవ స్వభావానికి ప్రతీకములని కావ్యకర్త భూమికయందు నమోదుచేసియే ఉన్నాడు. తదను గుణంగా ఈ కావ్యమందు కావ్యార్థముతోబాటు సాంకేతిక లర్థము కూడా అభివ్యక్తమవుతూంది.

ఇందలి ప్రధాన పాత్రలయిన మనువు 'మనస్సు' నకు, శ్రద్ధ 'శ్రద్ధ' కు, ఇడ 'బుద్ధి' కి ప్రతీకములు. కైవల్యము కేవలము బుద్ధిద్వారా ప్రాప్తించదు. ఇందుకొరకు శ్రద్ధ సహకారము అనివార్యము. ఈ విధంగా మనువు శ్రద్ధల సహకారంతో మానవసృష్టి వికాస క్రమ కథావస్తువే ఇందు వర్ణింపబడింది.

భావగర్భితమైన ఈ బృహత్కావ్యాన్ని 'కవిరత్న' డా. ఇలపావులూరి పాండురంగరావుగారు తెలుగులోనికి ముక్తక ఛందస్సులో అనువదించారు. వారి తెలుగు అనువాదం సరళంగానూ రమ్యంగానూ సాగింది. ఈ వ్యాసమునందలి తెలుగు పద్యాలు వారి అనువాద కావ్యం నుండియే గ్రహింప బడ్డాయి.

" 'కామాయని' లాంటి కావ్యాన్ని విడదీసి జతపరచడం తాజ్ మహల్‌లాంటి భవనాన్ని పడగొట్టి నిర్మించడం లాంటిదని సుకుమార కవి సుమి తానందనుడన్నాడు. నిజానికి తులసీరామాయణం తర్వాత చెప్పుకొనదగిన హిందీకావ్యం కామాయని. ఈ రెండూ మిగిలితేచాలు, హిందీ సాహిత్యం నిలుస్తుందని విమర్శకులంటారు. అదినిజం. ఆ నిజం తెలుగువారికి తెలుపవలెననే కుతూహలం నన్నీ అనువాదానికి ప్రేరేపించింది. ఈ సంధానంలో 'అనల్ప తపః పరిపాక' మయిన తెలుగు పలుకుబడి నాకు అమోఘంగా సహకరించింది. ఈ అనువాదం జయ శంకరుని వాగ్విభూతిని అవలేశమైనా రసజ్ఞులకు అందించగలిగితే, దానికి కారణం తెలుగుభాషలోని విసర్గసామర్థ్యమే గాని నా పురుషార్థం కాదని మనవి." అంటారు అనువాదకర్త డా. పాండురంగరావుగారు. వారి పద్యరచనా పటిమకు ఉదాహరణంగా కావ్యారంభంనుండీ రెండు మూడు పద్యాలు చూడండి :

ఉత్తరమున ఉత్తుంగ హిమాచల
శిఖర శిలాతల శీతల సీమల
కనులు చెమ్మగిల కాంచుచుండెనొక
పురుషు డెవడో ప్రళయాంబు పూరమును.

క్రింద జలము పై పైని తుషారము
తరళమొకటి సఘనము మరియొక్కటి
తత్వమొకటె రెండింటికి మూలము
అదియె జడముచే తనమును కానగు.

విస్తరించినది దిగ్దిగంతముల
స్తంభించిన హిమ మతనియెదవలె
సద్దులేక ప్రసర చిరణములకు
తరిలి మరలు మరి మరి పవమానము.

చెట్లగొంతుల్లో...

"సాంధ్యశ్రీ

నీలిమలోని !
చైత్ర శశాంకుడి చూచుకాగ్గాన్ని
నొక్కితే
కారిన గుక్కెడు వసంతాన్ని త్రాగి
పచ్చలు మిసిన తోటల్లో-పడి
పరవశించి
శాటిన్ చిగురుపాట పాడుతోంది
కోకిల...!
తారల్ని
సిగలో తురుముకొన్న !
వాసక సజ్జిక చెట్లు
ఈ విపిన ద్వారంలో
వయారంగా నిలబడ్డాయి...

తోట
సెలయేటి పాయ వెండి వడ్డాణాన్ని
మెలికలు త్రిప్పుకుంటూ
విరహాన్ని
వేపిత స్వరంతో
స్వగతంలో గానం చేసుకుంటోంది...!

మంచుతెర
పల్చగా జారుతున్నట్టు
చెట్లగొంతులు అవ్యక్త గానాలతో
ఈ వన పవనాలను అల్లుతున్న
నీలి దీవుల ప్రాచీ రేఖమీద
కవిగా
ఈ లోకాని కరుదెంచిన శిశువును... !

గిరుల్లో-ఝరుల్లో
తరుల్లో-పూలసరుల్లో
కవితాసారం పిండుకుంటాను... !
సూర్యుడి కెదురుగా నిలబడ
ధీవిగా
గొంతెత్తి పాడాలనే నా కోరిక
ఆకుగా మారి

చెట్లచివళ్లకు అతుక్కుపోయింది
కిరణాలకు
మెరుస్తూ—
సరళంగా—తరళంగా!

నా నిలబడ్డ తీరంనుండి
ఈ చెట్ల గొంతుకలు కలిసిపోయిన
శిఖరాల చివళ్ల పైకి
లోయల లోతుల్లోకి
తరతరాల తరంగాల
ఉద్వేగ స్వరాల్లోకి
స్వరాన్నై-సాగిపోతా...!

ఇక్కడ
ఈ చెట్లగుంపు గుసగుసల్లో
నేను
ఒక ఆదర్శాన్నై ఆగిపోతా... !

రాత్రి
మబ్బు గుడ్డల్ని విప్పేసి
నగ్నంగా కన్నకలలు
పగలు
సీతాకోక చిలుకలై
విగురుతుంటె...

కవి శిశువునేకాదు
కాంతి నినువును కూడా !

నీవు రావు

శ్రీ కాసల నాగభూషణం

నిన్నుగురించి నిజంగా
నేనెంత అందంగా ఊహించాను!
నీమీద గీతం
ఎంత రసవత్తరంగా రచించాను!
నీవూ నేనూ కలిసిన ఆ సరుచిర స్వప్నాన్ని
ఎంత పదిలంగా దాచుకున్నాను!

నాడు
నా చీకటి కుటి కంతల్లోంచి
జారిపడిన వెన్నెల మల్లెపూల నేరి
మాలగా కూర్చిపెట్టాను
నీ నీలి కబరీ భరంలో
నేనే స్వయంగా తురుముదామని.

నేడు
నీవు రాని నిరుత్సాహంలో
నీరసించిన ఆ పువ్వులతోనే
నిరాశా స్వగతాలను చెప్పుకుంటున్నాను.
ఆలోచనా పరంపరలలో
అల్లుకున్న చిక్కుముళ్లను
నింపాదిగా విప్పుకుంటున్నాను.
నేనున్న నేలమాళిగనుంచి
నీవున్న ఆకాశసౌధం వేపు
నిర్నిమేషంగా ఎదురుచూస్తున్నాను-ఇప్పటికీ.

ఈ ఎదురు తెన్నులలో
ఎన్ని వెన్నెల రాత్రులు వృథాగా కరిగిపోయాయో!
ఈ నా బెదరు కన్నులలో
ఎన్ని సాయందీపాలు-నక్షత్రాలు మలిగిపోయాయో!
అయినా
పగిలిన పానపాత్రలో
అట్టడుగున మిగిలిన ఒకే ఒక్క మధుబిందువులా
నాలో ఏమూలో వెలిగే ఆశ-
నీవు వస్తావని,
నిరుపమానంద సుధాకలశాన్ని నీతో తెస్తావని!

కాని నీవు రావు
నన్ను నీలో చేర్చుకోవు
మూగవోయిన రాగవీణను
ముగ్ధమోహనంగా మ్రోగనివ్వవు!

రాక రాక

"నిశాపతి"

"కువలయాల కువలయాల
ఆలింగన మాలిం గన
నీయదాయె; నీయదాయె

తారకమ్ము;—తార కమ్మ
నాటినాడు, నాటి నాడు

హరహరతను డహరహ తను
ఎట్లోర్వెత? ఎట్లోర్వెత

అంతమబ్బు ?— అంత మబ్బు
చూచి, తార, "చూచి తా?

మా బంధుడు, మా బంధుడు
నేలబారు నేల బారు ?

కలువ వనన్ కలువవనన్
కాపాడుము. కాపాడుము'

"ఓ లలనా! ఓలల నా
డు పం పొందు డుపతి, పొందు

మాశ్వాసము;"—ఆ శ్వాసము
లోనె సాగి, లోనె సాగి

చందమామ చందమా, మ
హోఘనమ్ము నా ఘనమ్ము

ఆక్రమించె నా క్రమించె
అంతమాయె వంత మాయె!

తారాశశి, తారాశశి
చిక్కని రతి, చిక్క నిరతి

లోకమ్ములు లోకమ్ములు
సంతసించె సంతసించె

న డు

కేవస్వీ

(అప్పుడప్పుడు)
అబ్‌స్ట్రాక్ట్‌గా నవ్వుతూ
అబ్సర్డ్‌గా బతికే ఈ బతుకులో
ఆనందం అనే పదార్థం
ఎంత వెదికినా కనిపించదు

(అప్పుడల్లా—)
కుంచెకందని సాయంత్రాలెన్నిటినో
కుదించుకున్న ఈ హృదయంలో

ఉన్నదంతా నిర్లిప్తత—
'వ్యాసుడు చూసిన ఆకాశమే!...'' అని

(కాని –)
వ్యాసుణ్ని చూసిన ఆకాశం
నా వీపున ఏదో అదృశ్యహస్తంతో స్పృశిస్తు (?)
"మనిషివి నువ్వు నిటారుగా లేచి నిలబడు
నడు—''

జనం సరిత్తు

"సలంద్ర''

ఈ జనం సరిత్తు
ఎన్నెన్నో నిమ్నోన్నతాల నధిగమించి
విషాద గీతాలాపనల
రుధిర జలధిలో
తల మునకలై సైతం
ఉదయంకోసం

కత్తెరలా చీల్చుకుపోతుంది
సూదిగా పొడుచుకు పోతుంది
యిది ఊరేగింపు
అనంతం మినహా
అంతం లేదు

చెరగని చిహ్నాలు

శ్రీ బండి రాధాకృష్ణ

ఇరవయ్యో శతాబ్దపు అంతంలో
దిగంతాలకు ఆశగా చూస్తున్న
ఇరవయ్యేళ్ళ సామాన్యుడా!
ఈనాటి రాజకీయ వార్తల్లో
నీ ప్రస్తావన ఎక్కడ?
"జనావళిక్షేమం మా లక్ష్యం"
అన్నది నాటివాళ్ళయితే
"జనసామ్యం మా గమ్యం"
అన్నది నేటి వాళ్ళు
పదాల 'ద్వారబంధాల్లో' చిక్కినా,
పొలాల్లో దిష్టిబొమ్మగా [1] మిగిలినా
హలమో, ఫైళ్ళలో చిక్కిన కలమో
నీ పాలబడినా
బిలంలో చిక్కని చీకటిలో
కాంతిరేఖగా సాగిపోతున్న నువ్వు
దేశమంటే మట్టి [2] అన్నా,
దేశమంటే మనుషులన్నా పట్టించుకోవు.
నీకు తెలియదు పాపం!
ఆశతో, కనపడని రేఖలకై
అఖండ మారణహోమం సాగించే
సముద్రాల్లో సైతం తమ ముద్రకై
'ఇటుకపెట్టె సందులో'
ఇంధనాల స్థావరాలు [3] కట్టగలిగే వాళ్ళున్నారని
హిట్లర్‌లాంటి వాళ్ళు
ఈ లోకాన్నంతా,
'కాన్‌సెంట్రేషన్ క్యాంపు' [4] చేస్తారని
బంగ్లాదేశ్‌లోనేకాదు
నరహంతలకు ప్రపంచంలో
చోటింకా ఉందని,
పీసా మారితేనేం,
కాచిన సారామాత్రం అదేనని,
నినాదం ఏదయితేనేం,
ఉన్మాదుల ప్రపంచానికి
ప్రతి హిరోషిమా
'చెరగని చిహ్నాలుగా' నిలుస్తాయని.

[హిరోషిమాలో మరణించిన అభాగ్యులకు ఏర్పాటు చేసిన జ్ఞాపక చిహ్నపు ఉత్తేజమే ఈ కవిత.]

1) Democratic manifesto, Human.

2) గనికార్మికుడు

3) Diego carcia లాంటి ద్వీపాలు

4) రాజకీయ ఖైదీలను ఘోరహింసలద్వారా బాధ పెట్టె స్థలాలు.

ఆత్మసాక్షి

డా. చందు సుబ్బారావు

హాస్యమైనా ద్వేష్యమైనా
ఉద్యమించిన పురుషసింహం
ఎండమావిని కండ చెక్కెర
కలిపి త్రాగేడు!

బండ మొద్దు ప్రపంచ శంఠోల
అండయేదో దొరుకుతుందని
భ్రమలభారం నెత్తిమీదట
ఎత్తి మోసేడు!

పగటి కలలో శీత ప్రగతికి
ఉన్ని దుప్పటి తన్నిపెట్టాడు
వృథారాగం వ్యథాలాపం
కలల్లోనే కళల వెర్రికి
జోల పాడాడు!

కాలిపోయిన హృదయపల్లవి
కేసి చూడక తరలిపోయే
జీవవాయువు వీచి ఝట్టిన
తాళుకోలేదు!
చచ్చిపోయిన మనసు రూపం
మెచ్చిచూడగ తరలివచ్చే
కరుణ కావ్యం వరుణ దేవుని
భావి తుషారం!
గర్జ మర్దళ పక్షవాద్యం
పర్జన్య మూదేనా ?
కొండకే తలయేసికొట్టే
పొట్టేలు చైతన్యం!
నింగి నేలల సంగమంలో
కొంగ ధ్యానాలు!
విందుకొచ్చిన మాటలిపుడు
విదల వ్యాపారం
సకల భౌతిక సూత్రతత్వం
నేటికైనా హృదయవాటిక
విప్పి చూసేవా?

కొన్ని నాణాలు

డా. ఎం. అబ్దుల్ వలీ

1886 లో సర్ వాల్టర్ ఇలియట్ అనే పరిశోధకుడు తన పుస్తకం "కాయిన్స్ ఆఫ్ సౌత్ ఇండియా"లో కాకతీయుల నాణాలనుగూర్చి మొదటి సారిగా ప్రస్తావించినారు. ఈ కాలపుదిగా భావించబడిన ఒక రాగినాణెంపై "శ్రీమత్ కాకతి ప్రతాపరాయ" అని ఒక వైపున, "కటకశక" అని మాత్రమే మరో వైపున చెక్కబడి కనిపిస్తుంది. ఈ నాణెం ఏకారణంచేతనో కనిపించకుండా పోవటంవల్ల ఫోటో తీయబడలేదు. అందువల్ల ఈ నాణెం పూర్తిగా అదృశ్యమే అయిపోయింది.

ఇటువంటి నాణెం ఒకదాన్ని గురించి ఐ. మహాదేవన్ గారు 28–6–1959 'హిందూ'పత్రికలో వ్రాశారు. ఈ నాణేవు ఫోటోలో కాకతీయ ప్రతాపరుద్రుని కాలపుదైనట్లు నాగరిలిపిలో వ్రాయబడింది.

అదే సంవత్సరం "న్యూమిస్మాటిక్ సొసయిటీ ఆఫ్ ఇండియా" సంచికలో ఐ. దినకర్‌రావు నాలుగు రాగి నాణాలను గురించి వ్రాశారు. కాని ఈ నాణాలు రాష్ట్రకూటరాజు రెండవకరకనకు చెందినవని పొరపాటు పడినారు శ్రీ దినకర్‌రావు. ప్రచురించిన వివరణను బొమ్మలను చూచి శ్రీ డి. సి. సర్కార్ ఈ నాణాలు కాకతీయ ప్రతాపరుద్రునకు చెందినవిగా సక్రమ నిర్ణయం చేశారు. అదే సంచికలో శ్రీ ఎస్. రమణయ్య ఒక రాగి నాణెపు బొమ్మను ప్రచురిస్తూ "శ్రీమద్ విక్రమ కాకతీయ ప్రతాప రు" అని ఒకవైపున, "ద్ర దేవ విజయ కటక 12 శక" అని ఇంకోవైపున చెక్కబడి వున్నట్లు వివరించారు.

నాకు 1966 లో ఇటువంటి రాగినాణాలు వరంగల్లులోనే అదృష్టవశాన లభ్యపడ్డాయి. వీటి బొమ్మలను, వివరణలనూ "జర్నల్ ఆఫ్ న్యూమిస్మాటిక్ సొసయిటీ ఆఫ్ ఇండియా"(వారణాసి)లో ప్రచురించినాను. వాటిపై ఈ విధంగా నాగరి వ్రాతలో ఉన్నట్లు వ్రాశాను.

(1) ముందువైపు

××××
రకాకతి×
ప్రతాప×

(2) వెనుకవైపు

(ద్ర) దేవవి
జయ కటక
22 అంక

అయితే "శక" అని చదవటానికి బదులు "అంక" అని చదవాలని, "అంక" అంటే పరిపాలనా సంవత్సరం అని, అది 22వ సంవత్సరం అని నేను సూచించాను. వాస్తవానికి నాలుగు అంకెలలో శకం సంఖ్య రాయడానికి అసలు స్థలమేలేదు. కాబట్టే నా పాఠాన్ని సొసైటీవారు అంగీకరించి, ఈ నాణెం కాకతీయుల్లో చివరి రాజైన ప్రతాపరుద్ర దేవుడిదని నిర్ణయించారు. అప్పటి కాలంలోఉన్న జీవుల సంకేతాలేవీ లేకపోవడానికి కారణం కూడా కాకతీయరాజులను తమ గుప్పిటిలో ఉంచుకున్న ఢిల్లీసుల్తాన్ ప్రభువుల ప్రభావం వల్లనే అని శ్రీ ఎస్. రమణయ్య గారే సూచించినారు.

ఈ నాణెంతోపాటు మరో కాకతీయుల నాణెంకూడా ప్రచురించబడింది. ఈ నాణెం గణపతిదేవ చక్రవర్తిదని డా. మారేమండ రామారావుగారు అభిప్రాయ పడ్డారు. కాని ఆ అభిప్రాయానికి ఆధారం నాకేమీ కనిపించలేదు.

తరువాత నా సేకరణలో ఇటువంటి మరో 10-15 రాగి నాణాలు లభ్యపడ్డాయి. వీటినుండి మూడు నాణాలపైగల చెక్కబడి ఉన్న లేఖనాల్ని 1967 లో జ. ఆ. న్యూ. సొ. లో ప్రచురించినాను.



(1) ముందువైపు (2) వెనుకవైపు

ముందువైపు	వెనుకవైపు
శ్రీ మ ధు క	–ద్ర దే వ వి
–ర కా క తీ య	–జ య క ట క
ప్ర తా ప రు	22 అంక

కొన్ని నాణాలమీద 23 అంక అనీ, "విజయ కటక" అని రెండో వైపు ఉండటానికి బదులు "విజయ ఉల్కల" అనీ, మొదటి వైపున "మధుకర" అని విస్పష్టంగా ఉన్నాయి. ఇటీవలి వరకు ఈ మధుకర అనే అక్షరాలను "శ్రీ మద్విక్రమ"అని పరిశోధకులచే పేర్కొనబడినవి. న్యూమిస్మాటిక్ సొసయిటీ వారు నా వివరణను అంగీకరించి తమ సంచికలో ప్రచురించినారు. అదివరలో గులాం యాజ్దానీ సంపాదకత్వంలో వెలువడిన "ఎర్లీ హిస్టరీ ఆఫ్ ది డెక్కన్" అన్న గ్రంథంలో కాకతీయుల చరిత్రపై తమ వ్యాఖ్యానం ఆధారంగానే 1970 లో శ్రీ వేలటూరి వెంకట రమణయ్యగారు ఈనాణాలు కాకతీయులకు చెందినవిగాగల ఆధారా లేమిటని సవాలు చేశారు. ఈ నాణాలు 15వ శతాబ్దంలో వీరి భూభాగాన్ని ఆక్రమించుకొన్న ఒరిస్సా గజపతి ప్రతాపరుద్రదేవుడికి చెందినవే అని అభిప్రాయపడుతూ ఈ క్రింది విధంగా వాదించారు:

1. "శ్రీమధుక" అన్న పదం ప్రాచీన కళింగ నగరంలోవి ప్రఖ్యాత ముఖలింగం మధుకేశ్వర దేవుడికి వర్తిస్తుంది.

2. గజపతి ప్రతాపరుద్రుడు "కాకతీయ" బిరుదును వహించినాడు.

3. నాణాలు వెలువరించినచోటు విజయకటక; ఇది గజపతి ప్రతాపరుద్ర ముఖ్యపట్టణమైన కటక్‌కు వర్తిస్తుంది.

4. నాణాలపై తేదీని సూచించే "అంక" అన్నపదం కేవలం తూర్పు గంగరాజులకు, ఒరిస్సాకు చెందిన సూర్యవంశీయులైన గజపతులు ఉపయోగించినది మాత్రమే.

కాకతీయ నాణాలు గజపతులకు చెందిన వనటాన్ని గూర్చి నా వాదాన్ని ఆ తర్వాతి (జర్నల్) పత్రికలో నేను ప్రకటించాను. అవి :

1. ప్రచురించబడిన నాణాల్లో చాలా నాణాలు వరంగల్లు, వరంగల్లు పరిసరాల్లో మాత్రమే లభ్యపడినవి. డా. వేలటూరి వెంకట రమణయ్యగారు ఊహించినట్లు గజపతి ప్రతాపరుద్రుని రాజధానీ నగరమైన కటక్ పట్టణంనుండి విడుదల అయినవే అయితే ఒక్క నాణెం కూడా ఆ పరిసరాల్లో ఇంకా దొరకలేదు. ప్రచురితం కాలేదు. ఒకవేళ వరంగల్లునుండే ఆ నాణాలు విడుదలైవుంటే కనీసం కొన్ని నాణాలయినా ఒరిస్సా ప్రాంతంలో కనుగొనబడవలసిఉంది. కాని నాకు తెలిసినంతవరకు అక్కడ ఒక్కటి కూడా బయటపడలేదు.

2. ఇక నాణెంపై వ్రాసి ఉన్నది "శ్రీమధుక" కాదు "శ్రీమధుకర", 'ర' అక్షరం రెండవ పంక్తిలో కూడా స్పష్టమవు తుంది. ఇది బహుశా ఏ దేవుడి పేరునూ తెలుపదు. దీని అర్థం శుభకరమైన మధుకఫలం–దీన్నుండి మద్యం తీస్తారు. కాగా గజపతి ప్రతాపరుద్రుడే కనుక మధుకేశ్వర భక్తుడే అయితే, తన బిరుదును

– చందా వివరాలు –

విడి ప్రతి వెల ... 0-60 పైసలు

	మ్యాన్ ఏజంటుద్వారా	పోస్టుద్వారా
	రు. పై.	రు. పై.
సంవత్సర చందా	31-20	33-80
అర్ధ సంవత్సరం	15-60	16-90
మూడు మాసములకు	7-80	8-45

మేనేజరు
ఆంధ్రపత్రిక

అలా చాటుకొనే వాడుకాదు. వినయపూర్వకంగా "శ్రీ మధుకేశ్వర–పాద–పద్మ–వర్తి" అని చెప్పుకొనేవాడు.

3. ఈ గజపతిరాజు కాకతీయ బిరుదును ధరించినాడన టానికి నిదర్శనమేదీ ఇవ్వబడలేదు. వారు తమ అభిప్రాయానికి మద్దత్తుగా వెంకాయలపాడు, గుడిమళ్లలలో ఉన్న "ప్రశస్తి"నుండి కొన్ని వాక్యాలు ఉల్లేఖించినారు.

"వీరశ్రీ గజపతి గౌడేశ్వర......కాకేతరుద్ర వెంకటరాయశ్రీ ప్రతాపరుద్రదేవ"

కాని పై శాసనాలలో ఈ బిరుదు "కాకేత" లేదా "కాకతి" లేదా ఇతర విన్నో వాణాలపై ఉన్నట్లుగా "కాకతీయ" అని స్పష్ట మవుతున్నది. కాకతీయ రాజుల తర్వాత రెండువందల సంవత్సరాలకు వచ్చిన గజపతి రాజులకు అసలు వారిని ఓడించి, బిరుదును లాక్కొనే అవకాశమే లభించలేదు. అంతేకాక 14వ శతాబ్దంలో పూర్వ ఒరిస్సా రాజు ఎప్పుడూ వరంగల్లు కాకతీయులతో విరోధుడుగానే ఉన్నట్లు ఢిల్లీలోని తురక ఆఫ్ఘన్ రాజుల పక్షాన్నే వహించినట్లు చరిత్ర చెప్పుతున్నది.

4. కటక్ ఎప్పుడు కూడా "విజయకటక్" అని పిలువబడ లేదు. కాగా ఏ హిందూరాజు కూడా తన రాజధానిపేరు తన నాణాలపై ముద్రింపించుకొన్నట్లు కనిపించదు. నా వివరణ ఏమిటంటే, "విజయకటక్" అన్నది కాకతీయ గణపతి ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు ఒరిస్సా సరిహద్దుపై దాడిచేసి కాకతీయులు సాధించిన విజయాన్ని సూచిస్తుంది.

5. "అంక" (పరిపాలనా సంవత్సరం) అన్న పదం గజపతులు, ఒరిస్సా రాజులుకూడా ఉపయోగించినారు. అయితే ఇది చాలాకాలం తర్వాత పూర్వపు కాకతీయ రాజులనుండి చూచి వ్రాసుకొన్నదే.

అదే పత్రికలో నాగరి లిపిలో వ్రాయబడిన గజపతి ప్రతాపరుద్రుని రాగినాణాన్ని ఒకదాన్ని చిత్రంతోసహా చూయించాను.

(1) ముందువైపు
శ్రీను ××
(గ)జపతి పతా
–పరుద్ర××

(2) వెనుకవైపు
××××
× రాయన
నాయక

ఫిగర్–3

ఈనాణెం గజపతి ప్రతాపరుద్రునిదై ఉండాలి 'రాయన'అనగా రాజు, 'నాయక' అన్నది ఆ రాజుకున్న బిరుదు. గజపతి అన్న బిరుదు కూడా విదితమైనదే. గజపతిరాజులు "కాకతీయ" అన్న బిరుదు నెందుకు తీసుకొన్నారో అర్థంకాదు. దీన్ని నమ్మకపోవటానికి సరియైన దృష్టాంతాలు లేనంతవరకూ, ఈ నాణాలు కాకతీయ రాజులవి మాత్రమే అని నా దృఢ అభిప్రాయం. అయితే ఈ నాణాలు ఇంత అరుదుగా ఎందుకు ఉన్నవి? వెండి, బంగారు నాణాలు ఎందుకు అసలే లేవు? అన్న విషయాలు ఇంకా పరిశోధించి వివరించబడాల్సి ఉన్నాయి.

నేనే ప్రమాణం!

శ్రీ చెళ్ళపిళ్ళ సూర్యనారాయణమూర్తి

ఎన్ని సుఖాలు కలిస్తే ఒకరెక్క అవుతుందో
నా మనస్సు కెప్పుడు రెండు రెక్కలూ వస్తాయో
ఆ క్షణందాకా దుఃఖాల్తో హోరాహోరీ పోరాటం!
ఆ క్షణం కొరకే వాకలానికి నిరంతరారాటం !!

ఒక క్షణం శిశిరాన్ని మోసుకొచ్చి నాపైకి విసిరేసినా
మరోక్షణం కాఠడాపట్టి వసంతాన్నినాకు చూపెట్టగలదు.

లేకపోతే
'అసలు జీవితం' లోకి అడుగుపెట్టినప్పుడే
నా ఆత్మ అంతమయ్యుండేది;
చేష్టల్ని పరిస్థితులెంతగా చెరిచినా
ఉత్కృష్టమైన మనస్సును మాత్రం చెరచలేవు
కావాలంటే ఆ మబ్బుల్ని అడిగిచూడు—
సూర్యచంద్రుల కాంతిచేష్టల్ని అడ్డగించినా
వాళ్ళ స్వభావాల్ని మార్చగలుగు తున్నాయేమో ?

పోనీ, ఆ చెట్లని అడిగిచూడు—
శిశిరం వాటి ఆకుల్ని రాల్చి వేసినా
వాటి చిగిర్చే స్వభావాన్ని మార్చగలుగుతోందేమో ?
చూడూ ! అక్షరాల్లో ఆశని బంధించే ప్రతిమనిషికీ
దీర్ఘకాలిక అంతర్మథన ఉంటుంది !
స్వర్గం కొరకైన తపన ఉంటుంది !!
అందుకే, ప్రతి జీవికీ ఆశల వసంతం ఆరోప్రాణం
అందుకు నేనే ప్రమాణం !

(నా దిగంత రేఖ కవితాసంకలనంనుండి)

కాకతీయ గణపతిదేవుడు - కళింగ దండయాత్ర

డా. వై. గోపాలరెడ్డి

శాతవాహనుల పతనానంతరము, సువిశాలమైన ఆంధ్రదేశము నేలిన వారిలో ప్రసిద్ధులు కాకతీయులు. కాకతీయ సామ్రాజ్య చరిత్ర మాంధ్రుల చరిత్రమునకేగాక భారతదేశ చరిత్రమునకు గూడ మిగుల ముఖ్యమైనది. వీరి పరిపాలనా కాలమునం దాంధ్రులకీర్తి ప్రతాపము లెల్లెడలను వ్యాపించినవి. కాకతీయ రాజులలో ప్రసిద్ధి కెక్కినవాడు గణపతిదేవ మహరాజు. ఇతడు మహాదేవుని పుత్రుడు. గణపతిదేవుడు క్రీ. శ. 1198 మొదలు క్రీ. శ. 1261-62 వరకు, అనగా షుమారు అరువదిరెండు సంవత్సరములు కాకతీయ సామ్రాజ్యము నేలెను. కాకతీయ సింహాసనము నధిష్ఠించిన వెంటనే గణపతిదేవుడు, వెలనాడును పాలించుచున్న వెలనాటి చోళులపై దండయాత్ర చేసెను. గణపతిదేవుని పూర్వీకులైన రెండవ ప్రోలరాజు, రుద్రదేవుడు వెలనాటి నాక్రమించుటకు విశ్వప్రయత్నములు చేసిరి. కాని వారిరువురు యుద్ధములో ఓడిపోయిరి. రెండవ ప్రోలరాజు రణరంగములో అసువుల కైతము కోల్పోయెను.[1] కాకతీయుల అధికారము, గణపతిదేవుని కాలములో, వెలనాటిపై వ్యాపించినట్లు శాసనాధారములున్నవి. గణపేశ్వరము శాసనము ప్రకారము (క్రీ. శ. 1231), గణపతిదేవుడు వెలనాటి చోళులపై విజయమును సాధించుటయేగాక, వెలనాటినుండి అందమైన యువతులను, అశ్వములను, మాతంగములను మరియు అపారమైన ధనమును దోచుకొని వచ్చినట్లు తెలియుచున్నది.[2] వెలనాటి చోళరాజైన పృథ్వీశ్వరుడు యుద్ధములో అపజయమును పొందుటయేగాక వీరస్వర్గమలంకరించెను. పృథ్వీశ్వరుడు క్రీ. శ. 1210 వరకు జీవించియున్నట్లు శాసనాధారములున్నందున, కాకతీయ గణపతిదేవుడు వెలనాటిని క్రీ. శ. 1210 లోనో లేక తరువాతనో జయించియుండవచ్చును.[3] వెలనాటిని ఆక్రమించిన పిమ్మట, గణపతిదేవుడు, తన దృష్టిని కళింగముపైకి మరల్చెను.

కాకతీయ శాసనములు, శైవగ్రంథమైన 'శివయోగసారము', గణపతిదేవుని కళింగ దండయాత్రను గూర్చిన సమాచారము నందజేయుచున్నవి. క్రీ. శ. 1236 నాటిదగు ఉప్పరపల్లి శాసనమునందు ఈ క్రింది ప్రశంస గలదు :[4]

> ....బొక్కెరలోని వీ
> రభటావళి వధించి గోధామఠాతి తలదెంచి
> ఉదయగిరి సాధించి పడిరాయనిం దోలి ద్రాక్షా
> రామభీమేశ్వర దేవర కక్షను దీపంబులు ని
> లిపి ధర్మన్ సమేతుండైన రాజనాయ్యకునికి......

పై నుదహరించిన ఉప్పరపల్లి శాసనము ప్రకారము రాజినాయకుడు బొక్కెరయొద్ద వీరభటావళి వధించినట్లు, గోధానుఠాతి తలదెంచినట్లు, ఉదయగిరి ఆక్రమించినట్లు, పడిరాయని పారద్రోలినట్లు విశదమగుచున్నది. రాజినాయకుడు పత్నీసమేతుడై ద్రాక్షారామభీమేశ్వరుని సన్నిధిని అఖండ దీపములు కూడ నిల్పినట్లు పై శాసనములోనే చెప్పబడియున్నది. బహుశః రాజనాయకుడు కళింగ దండయాత్రలో విజయలక్ష్మిని చేపట్టి తిరుగు పయనమై వచ్చు సమయమున ద్రాక్షారామమును సందర్శించి యుండవచ్చును. ఈ రాజినాయకుడు ప్రఖ్యాతిగాంచిన రేచర్ల రుద్రుని సేనాని. రేచర్ల రుద్రుడు కాకతి గణపతిదేవు సేనాని. గణపేశ్వరము,[5] మోటుపల్లి[6], ఏకామ్రనాథ[7] మరియు పాఖాల[8] శాసనములందు కూడ గణపతిదేవుని కళింగదండయాత్రను గురించి ప్రశంస కలదు.

కొలనియాది గణపతి విరచితము, వీరశైవ గ్రంథమునైన 'శివయోగసారము'నందు గణపతిదేవుని కళింగ దండయాత్రనుగురించి ఈ క్రింది ప్రశంసకలదు :[9]

> చ. ఇల బహుసైన్యముల్ గొలువ నేకశిలాపురి తూర్పుదిక్కునం
> గల రిపు భూములెల్లగొని గర్వముమై (నెడి) కాడి మండలీ
> కుల నవలీల గోలి (నురి) గోగులనాడును గొల్లపీడునా
> వెలసిన దుర్గముల్ గొనుచు వేగమె గౌతమిదాటి యుమ్మలన్
> క. మాడియు రెండు (౦) గొనియూ, డాడెడి పన్నెండు మన్నియ
> ములు నొడిచి తా
> నాడె కళింగయు సీమకు; గూడిన భువిగొనియె సోమకుల ముఖ్యు
> డొగిన్॥

ఆ. రీల గొలని మండలీకుల వెసదోలి, గొలని వీడుడానుగొనుటజేసి
కాకతీశుడైన గణపతి యం (డ)ను కొలని సోముడనగ వెలసెజగతి॥

కాకతి గణపతిదేవుని కళింగ దండయాత్రను తెల్పు పెక్కు శాసన, సారస్వత ఆధారములున్నను, ఏటువంటి పరిస్థితులలో దండయాత్ర జరిగినది స్పష్టముగా తెలియకున్నది. ఈ సందర్భమున తూర్పుగాంగరాజుల చరిత్ర పరిశీలన ఏంతెని యవసరము.

రాజరాజు III (క్రీ. శ. 1198-1211), అనంగ భీమదేవుడు III (క్రీ. శ. 1211-1238), నరసింహదేవుడు I (క్రీ. శ. 1238-1264), కాకతి గణపతిదేవునికి సమకాలికులైన తూర్పు గాంగరాజులు. రాజరాజు (III) మరియు అనంగ భీమదేవుని (III) పరిపాలనా కాలములో మహమ్మదీయులు కళింగముపై దండెత్తిరి.

హెచ్. మెహతాబ్ మహమ్మదీయ కళింగ దండయాత్రను గూర్చి ఈ క్రింది విధముగా జెప్పిరి :[10]

"It was a time when the political situa ion in the Northern India was undergoing great changes. The map of India was changing very fast. In the second battle of tarraiw, Raja prithviraja the king of Delhi and Ajmere was defeated by Muhammad Ghori in A. D. 1192. In A. D. 1194 Jayachanbra Kanyakubja fell on the battle-field. In A. D 1198 Iglayaruddiw Muhammad Ghori sacked the famous university of Nalanda. In the white heat of proselytizing zeal the Muhammadan marauders carried fire and sword to every religious centre of Upper India and dismantled the pillars of temples, stupas and monasteries and erected mosques in those temples."

మహమ్మదీయ దండయాత్రల పెను తుఫాను కళింగముపై కూడ వీచినట్లున్నది. ఏందులకన అనంగభీమదేవుడు (III) క్రీ. శ. 1212 లేక క్రీ. శ. 1220 సంవత్సరములమధ్య మహమ్మదీయులపై విజయమును సాధించినట్లాధారములున్నవి. కటక్ జిల్లాలోని కృష్ణపూరను గ్రామములోనున్న చాటేశ్వర దేవాలయములో దొరికిన శాసనముపైన పేర్కొన్న అనంగ భీమదేవుని (III) విజయమును గురించి తెల్పుచున్నది.[11] అనంగభీమదేవుని (III) కాలమున కళింగముపై కాలమూర్యులుకూడ దాడి సలిపినట్లు చాటేశ్వర శాసనము చాటుచున్నది. కాని అనంగ భీమదేవుని సేనానియైన విష్ణువు కాలమూర్యులను ఓడించి కళింగమును రక్షించెను[12] మహమ్మదీయ, కాలమూర్య దండయాత్రల మూలమున కళింగములో శాంతి కరువైపోయియుండవచ్చును. అదను కొఱకు వేచియున్న కాకతి గణపతిదేవుడు వెంటనే కళింగముపై దండయాత్ర చేయ రాజినాయకునికి ఆజ్ఞ ఇచ్చియుండవచ్చును. గణపతిదేవుని ఆజ్ఞానుసారము రాజినాయకుడు పెద్ద సైన్యములో కళింగము ప్రవేశించి గోధూమతాలిని జంపి, పడిరాయనిం పారద్రోలి, బొక్కెర, ఉదయగిరుల నాక్రమించెను. బొక్కెర యనునది ప్రస్తుతము గంజాము జిల్లాలో, అస్కతాలూకాలోనున్న గ్రామమై యుండవచ్చును.[13] ఉదయగిరి ప్రస్తుతము పెదకిమిడీ ఏజన్సీ ప్రాంతములోనున్న కుగ్రామము. గోధూమతాలి, పడిరాయలెవరయినదికానీ, వారి పూర్వచరిత్రనుకానీ తెలిసికొనుటకుపయుక్తమగు సరియైన ఆధారము లింతవరకు దొరకనందున వారినిగూర్చి ఏక్కువగా ఏమిచెప్పజాలము. బహుశః వారిరువు తూర్పు గాంగరాజైన అనంగబీమదేవుని (III) సామంతులైనను, సేనాధిపతులైనను కావచ్చును.

జాయపసేనాని, గణపేశ్వరము శాసనము ప్రకారము, "వైరి గోధూమఘరట్ట" అను బిరుదున్నట్లు తెలియుచున్నది. ఈ జాయపసేనాని, అయ్యవంశమునకు చెందిన పినచోడి కుమారుడు, నరాంబ పేరాంబల సోదరుడో, కాకతి గణపతిదేవుని గజసాహిణి.[14] క్రీ. శ. 1258వ సంవత్సరమునాటిదగు త్రిపురాంతక శాసనమునందు "వైరి గోధూమఘట్టన ఘరట్ట" అను బిరుదు వహించిన చాళుక్య నారాయణ భీమరాజ సిద్ధయదేవ ప్రశంసగలదు.[15] ఇతడు గణపతిదేవునికి సామంతుడు. పైన పేర్కొన్న రెండు శాసనముల వలన జాయపసేనాని, భీమరాజ సిద్ధయదేవుడు గోధూమతాలిని యుద్ధములో వధించి "వైరిగోధూమ ఘరట్ట", "వైరి గోధూమఘట్టన ఘరట్ట" అను బిరుదులను పొందినట్లు తెలియుచున్నది. ఉప్పరపల్లి శాసనమువలన గోధూమతాలి అనువ్యక్తి కళింగములోని బొక్కెర ఉదయగిరి పరిసర ప్రాంతముల తూర్పుగాంగచక్రవర్తులకు సామంతుడుగా పరిపాలించు చుండెనని యూహింపవచ్చును. దీనినిబట్టి రాజనాయకుడు, జాయపసేనాని, భీమరాజు సిద్ధయదేవుడు కాకతీయ సైన్యమును కళింగముపై నడుపుటయేగాక, దక్షిణ కళింగా ప్రాంతములోని కొన్ని ప్రదేశముల నాక్రమించినట్లు తెలియుచున్నది. బహుశః ఈ దండయాత్ర క్రీ. శ. 1212 లో జరిగియుండవచ్చును.[16]

క్రీ. శ. 1230-33 సంవత్సరములమధ్య తూర్పుగాంగరాజైన అనంగ భీమదేవుడు (III) త్రికళింగమును సముద్ధరణ చేసినట్లు ద్రాక్షారామములో దొరికిన శాసనమువలన తెలియుచున్నది. (త్రైవసుందరసముద్ధరణ).[17] చాటేశ్వర శాసనమునందు అనంగ భీమదేవునికి 'త్రికళింగనాథ' అను బిరుదున్నట్లు ప్రశంసగలదు.[18]

అదియుగాక అనంగ భీమదేవుని సేనాని, ఖడ సింహుని పుత్రుడైన, జైత్రపాజు వేంగిదేశమును జయించెనని ద్రాక్షారామములో దొరకిన యొక శాసనమువలన తెలియుచున్నది – "(జ) త్రజకేవ త్రుతజిత విలపద్వేంగి భూమణ్డలేన"[19]

ఆర్. సుబ్బారావుగారు అనంగ భీమదేవుని (III) గురించి ఇట్లు వ్రాసిరి: [20]

"His reign is very important because from his time onwards the Ganga history becomes clearer and more detailed. His empire spread from river Ganges in the north to the river Codavari in the South. His inscriptions are found both in Utkal and Andhra pradesh, and the former show how, when the Muslims tried to attack Orissa with a view to conquer it, he and his ministers defeated them".

అనంగ భీమదేవుని (III) కాలములో, పై చర్చననుసరించి, తూర్పుగాంగులు కాకతీయసేనాపతులాక్రమించిన ప్రాంతముపై వారి అధికారమును పునఃప్రతిష్ఠ చేసినట్లు తెల్లమగుచున్నది. బహుశః ఈమార్పునకు ఎక్కువగా సహకరించిన విషయము కాకతిగణపతిదేవుని దృష్టి కమ్మనాడుపై మరలియుండుటయే.

మధ్యయుగ ఆంధ్రదేశచరిత్రలో కమ్మనాడును కోణిదేణ తెలుగు చోళులు పరిపాలించుచుండిరి. కమ్మనాడనునది ప్రస్తుత గుంటూరుజిల్లా ప్రాంతము. గణపతిదేవుడు కళింగదండయాత్రలో నిమగ్నుడైయున్నకాలములో, కోణిదేణ తెలుగు చోళులు స్వతంత్రులగుటకు ప్రయత్నించి యుండవచ్చును. మొదటి కళింగ దండయాత్ర పూర్తియైన పిదప గణపతిదేవుడు కోణిదేణ చోళుల నణచుటకై తన సామంతుడైన ఓ ఫిలిసిద్ధిని పంపెను. ఇతడు పొత్తపి తెలుగు చోళ వంశజుడు. ఓ ఫిలిసిద్ధి, క్రీ.శ. 1224 వ సంవత్సరము నాటి దగు కోణిదేణ శాసనము ప్రకారము, కోణిదేణ చోళుల జయించినట్లు తెలియుచున్నది.[21] గణపతిదేవుడు ఓ ఫిలిసిద్ధి సాధించిన విజయమునకు మురిసి అతనిని 'ఆరువేల నాటికి' తన రాజప్రతినిధిగా నియమించెను. ఓ ఫిలిసిద్ధి చేతిలో పరాజితుడైన కోణిదేణ చోళప్రభువు బల్లిచోడుడై యుండవచ్చును. ఇతడు క్రీ.శ. 1211 మొదలు క్రీ. శ. 1222 వరకు రాజ్యమును పాలించెను. బల్లిచోడుని అనంతరము కోణిదేణచోళరాజ్యము కాకతీయసామ్రాజ్యములో నంతర్భాగమైపోయెను. క్రీ. శ. 1222 నుండి క్రీ. శ. 1249 వరకు కోణిదేణ తెలుగు చోళుల శాసనములు కానరానందున పైన వెలిబుచ్చిన యభిప్రాయమునకు మరికొంత బలము చేకూరుచున్నది.[22] గణపతిదేవుడు కమ్మనాటిపై తన యధికారము స్థాపించిన వెంటనే మరల కళింగముపై యుద్ధము ప్రకటించినట్లున్నది.

కొలనియాది గణపతి విరచితమైన 'శివయోగసారము', కాకతి గణపతిదేవుని ద్వితీయ కళింగదండయాత్రను గురించి కొన్ని యమూల్యాంశముల నందజేయుచున్నది. ఈ దండయాత్రను జరిపిన సేనాని ఇందులూరి పెదమల్ల విభుని కుమారుడైన సోమమంత్రి. ఇతడు గణపతిదేవుని సేనానులలో ప్రసిద్ధుడు. సోమదండనాయకుడు ఓరుగంటికి తూర్పుభాగమున నుండెడి దేశములను, కళింగములోని భూములను జయించినట్లు పూర్వోదాహృతమైన 'శివయోగసార' మందు గలదు. సోముడు కళింగమును జయించుటయేగాక కృష్ణాగోదావరీ నదుల నడిమి దేశమును, కొలను మాండలికులను జయించి గోగులనాడు కొలనువీడులను ఆక్రమించినట్లు పై గ్రంథములనుబట్టి తెలియుచున్నది.[23] కాని సోముడాక్రమించిన "రెండుమాడియలు" మరియు ఓడించిన 'పన్నెండు మన్నీయుల'ను గురించి తెలిసికొనుట కాధారములు సరియైనవి కానరావు. బహుశః రెండుమాడియలు కళింగములోనున్న ప్రాంతములై యుండవచ్చును. పన్నెండు మన్నీయులు వేంగి మండలమున కానుకొని కళింగములోనున్న 'ఏజన్సీ' ప్రాంత పరిపాలకులై యుండవచ్చును. కొలను మాండలీకుల జయించి కొలనువీడు, గోగులనాడులను సోముడాక్రమించి నందువల్ల ఆ ప్రదేశములు రెండును ఒకదాని కొకటి దగ్గరగా నుండవచ్చును. కొలనువీడు ప్రస్తుతపు ఏలూరు ప్రాంతమునకు సరిపోవును. సోముడీ విజయముల సాధించినందున గణపతిదేవుడతనికి 'కొలనిసోము'డని బిరుదు నొసంగినట్లు 'శివయోగసారము' వలన దెలియుచున్నది. ఈ కళింగ జైత్రయాత్రలో కొలని సోముడేగాక మరికొందరు కాకతీయ సామంతులు పాల్గొన్నట్లు శాసనాధారములున్నవి. జగతాపి గంగయ్య తాళ్ళప్రొద్దుటూరు శాసనము ప్రకారము ఏఱువ తెలుగు చోళవంశజుడైన భీమరాజు, వేంగి, ఒరిస్సా, బస్తరు ప్రాంతముల జయించినట్లున్నది.[24] విక్రమసింహపురి తెలుగు చోళరాజైన మొదటి తిక్కరాజు (క్రీ. శ. 1209 – క్రీ. శ. 1248), అతని తనయుడైన మనుమసిద్ధి, గణపతిదేవుని కళింగ దిగ్విజయయాత్రలో పాల్గొన్నట్లు ఆధారములున్నవి.[25] గణపతిదేవుని సేనానాయకులలో ఒకనికి 'గోదావరీతీర సమర గాండీవ' అను బిరుదున్నట్లు శకసంవత్సరము 1183 నాటి దగు త్రిపురాంతకము శాసనమునందు ప్రశంసగలదు.[26] దీనినిబట్టి ఇందులూరి సోమదండనాయకుడు, ఏఱువ భీమరాజు, మొదటి తిక్కరాజు, మనుమసిద్ధి కాకతీయుల పక్షమున కళింగ యుద్ధములో పాల్గొని గణపతిదేవుని కీర్తి నినుమడింపజేసిరి.

అనంగ భీమదేవుని (III) తరువాత గాంగసింహాసనము నధిష్ఠించిన రాజు మొదటి నరసింహదేవుడు. తూర్పుగాంగరాజులలో కెల్ల ప్రఖ్యాతి వహించినవాడు, గాంగరాజ్యము సువిస్తృతము చేసినవాడు,

మహమ్మదీయులకు కాలరు దుడె నటువంటివాడు మొదటి నరసింహ దేవుడు. ఇతనిని గురించి ఆర్. సుబ్బారావు ఈ క్రిందివిధముగా వ్రాసిరి.[27]

"The Ganga Empire may be said to have reached its Zenith during his time. The Mohammadans were defeated in the North and the province of Midnapur, Hourah and Hughly (Radha and Varndra) were added to the Ganga Empire. In the West, the Chattisgarh and Bilaspur districts of C. P. were comprised in the Ganga Empire, the Haihayas of Tummana and the Chedis of Kosala having been subdued and made friendly by marriage ties. In the South, the Reddis and the Kakatiyas were kept in check and their invasions were warded off."

'వల్లభాభ్యుదయ' మను స్థలపురాణము మొదటి నరసింహ దేవుని జైత్ర యాత్రలనుగురించి కొంత సమాచారమందజేయు చున్నది. దండనాయక అనంతపాలుడు, మొదటి నరసింహదేవుని యాదేశానుసారముగ, కాంచిపై దాడి వెడలెను. కళింగమునుండి బయలుదేరిన అనంతపాలుడు శ్రీకాకుళమునకాగి, అచ్చట ఆంధ్ర విష్ణువునకు దేవాలయమును కట్టించి తదుపరి కాంచిపైకి పోయెనట. కాంచిలో శత్రువులనోడించి, వారియొద్ద కప్పము వసూలుచేసి, విజయసూచిక జయస్తంభము నచట స్థాపించి, కళింగమునకు వచ్చెను.[28] 'వల్లభాభ్యుద'య మందజేయు సమాచారము సమర్ధించు శాసనాధారములు లేకున్నందున అనంతపాల దండనాయకుని కాంచి జైత్రయాత్రలోనున్న సత్యమరయుట క్లిష్టము.

కాకతి గణపతిదేవునికి తూర్పుగాంగ మొదటి నరసింహ దేవునికి మధ్య యుద్ధము జరిగినట్లు తెల్పు శాసనమొకటి భువనేశ్వరము నందున్న లింగరాజస్వామి యాలయములో దొరికినది. కాకతీయుల చరిత్ర రచించిన చరిత్రకారులందరు ఈ శాసన ప్రాముఖ్యమును గమనించలేదు. ఈ శాసనమునందు రాజరాజ (III) మనుమడు, 'వీరనరకేసరి' బిరుదాంకితుడైన తూర్పుగాంగ చక్రవర్తి గణపతి దేవుని సేనాపతులను, కాల్బలమును, అశ్వికదళమును, గజబలమును నాశ మొనరించినట్లున్నది. శ్రీ సూర్యనారాయణదాసు,[30] శ్రీ ఎస్. కె. సాహుగారలు[31] పై శాసనమునందు ప్రశంసించబడిన గణపతి దేవుడు కాకతీయ గణపతిదేవుడనియు, రాజరాజ 'తనూజాత్మజుడు', 'వీరనరకేసరి' బిరుదాంకితుడు మొదటి నరసింహదేవుడేననియు నిరూపించిరి. అదియుగాక కొన్ని శాసనములలో మొదటి 'నరసింహదేవుని' 'వీరనరసింహదేవు' డనియు, 'వీరశ్రీ నరసింహదేవుడ'నియు ప్రస్తావింపబడియున్నది[32] నరసింహదేవుని శాసన మొకటి విశాఖపట్టణములో దొరికినది.[33] పైన పేర్కొన్న శాసనములవలన, తూర్పుగాంగరాజైన సేనాపతి చేతిలో పరాజితుడై యుండవచ్చును. మొదటి నరసింహదేవుడు కాకతి గణపతిదేవుని ఓడించెనని తెలియుచున్నది.

కాకతి గణపతిదేవుని ప్రధానియైన మల్లల హేమాద్రిరెడ్డి, గజసాహిణి జాయపనాయకుని శాసనములు, క్రీ. శ. 1234 మరియు క్రీ. శ. 1253 వ సంవత్సరములనాటివి ద్రాక్షారామములో దొరికినవి.[34] బహుశః హేమాద్రిరెడ్డి, జాయపసేనాని, మొదటి నరసింహ దేవుని చేతులలో పరాజితులై ఓరుగల్లు వచ్చు సమయములో పై శాసనములను ద్రాక్షారామములో వేయించి యుండవచ్చును. నరసింహదేవుడు రాజ్యమునకు వచ్చినది క్రీ. శ. 1238. అందువలన తాను కాకతీయులపై సాధించిన విజయము క్రీ. శ. 1238 — క్రీ. శ. 1253 సంవత్సరములమధ్యకాలమునందుండవచ్చును.

ఈమధ్య కొంతమంది చరిత్రకారులు కాకతి గణపతిదేవుని కళింగ దండయాత్ర గురించి ఈ క్రిందివిధముగా వ్రాసిరి:[35]

"The Kalinga Gajapti Narasimha I, it may be remembered, had suffered a defeat in or before A.D. 1157—58 at the hands of Ganapati in a battle fought on the banks of Godavari and had had to retreat into his own country, abandoning his conquests on the bank of the river."

ఈ అభిప్రాయము సత్యదూరము. తూర్పుగాంగ చక్రవర్తియైన మొదటి నరసింహదేవుడు రాజ్యమునకు వచ్చినది క్రీ. శ. 1238. దీని ననుసరించి, క్రీ. శ. 1157-58లో కాకతి గణపతి దేవుడు కళింగ చక్రవర్తిపై విజయమును సాధించెననుట హాస్యాస్పదముగనున్నది.

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు కాకతి గణపతిదేవుని కళింగయాత్రను ప్రస్తావించు సందర్భమున, చాళుక్య వంశజుడైనటువంటివాడు, సకల సేనాధిపతియైనటువంటివాడు (శాసనములో నితనిపేరు చెరిగిపోయినది) గణపతిదేవుని కళింగ జైత్రయాత్రలో పాల్గొని కళింగ చక్రవర్తియైన మొదటి నరసింహదేవుని, అతని సామంతుడైన గొంటూరు నాగదేవుని ఓడించినట్లు చెప్పియున్నారు.[36] కాని లింగరాజస్వామి ఆలయములో దొరికిన శాసనము ప్రకారము మొదటి నరసింహదేవుడు గణపతిదేవు నోడించినట్లున్నది. కాబట్టి గణపతిదేవుని సకలసేనాని చేతిలో పరాజితుడై యసువులు కోల్పోయిన గొంటూరు నాగదేవుడు తూర్పు గాంగచక్రవర్తికి సామంతుడు కానేరడు. బహుశః గొంటూరి నాగదేవుడు వేంగిమండలములో నొక భాగమును పరిపాలించు నొక మాండలికుడై, గణపతిదేవుని కళింగ జైత్రయాత్రా సమయమున కాకతీయుల కడ్డంకిగా నిలచి యుండవచ్చును. అందులకై గణపతి

కాన పై చర్చవలన తెలియునదేమన కాకతీయులు గణపతి దేవుని కాలమునందు కళింగమును జయించ విశ్వప్రయత్నములుచేసిరి. వారి జయము తాత్కాలికమాయెను. మొదటి నరసింహదేవుని కాలములో కాకతీయుల యధికారము కళింగముపై నంతమాయెను. ఇందువలన, చరిత్రకారు లింతవరకు యూహించిన గణపతిదేవుని కళింగముపై విజయము సత్యదూరము

అధోజ్ఞాపికలు

1. జి. యజ్దాని, ది అర్లీహిస్టరీఆఫ్ దక్కను,లండను, 1960,భాగములు VII-XI పేజీలు 585, వై. గోపాలరెడ్డి, ది కాకతీయ రుద్రదేవ నెనాండు చోళులు, జర్నల్‌ఆఫ్ ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్, సంపుట XX, భాగము IV పేజీలు 450.
2. ఏ. పి. ఇండిక, III పేజి 91, శ్లో 35.
3. జర్నల్ ఆఫ్ ఆంధ్రా హిస్టారికల్ రిసర్చి సొసైటీ (జ. ఆ. హి. రి. సొ), XVIII పేజీలు 104.
4. హైదరాబాదు ఆర్కియాలజికల్ సీరీస్ (హై.ఆ.సి) నం. 19, వరంగల్లు 19, నం. 3, పేజి 16.
5. ఏ. పి. ఇండిక, III పేజి 91, శ్లో. 31.
6. అదే చూడుము, XII పేజి 188.
7. ఇండియన్ ఆంటిక్వరి XXI పేజి 199.
8. హై. ఆ. సీ. నం. 4, పేజి 10, శ్లో 22.
9. శివయోగసారము, సుభాషి, అక్టోబరు 1927, పేజి 27.
10. హెచ్. మెహతాబ్, హిస్టరీ ఆఫ్ ఒరిస్సా సంపుటి I పేజి 217, ఆర్. డి. బెనర్జీ, హిస్టరీ ఆఫ్ ఒరిస్సా, పేజీలు 255.
11. ఏ. పి. ఇండిక, XXIX పేజీలు 127, హెచ్. మెహతాబ్ I, పేజి 220.
12. అదే చూడుము.
13. జి. యజ్దాని, VII XI పేజి 606, యం. రామారావు ది కాకతీయాస్ ఆఫ్ వరంగల్లు, హైదరాబాద్, 1952, పేజి 64.
14. ఏ. పి. ఇండిక III పేజి 88, శ్లో. 41, జి. యజ్దాని,VII-XI పేజి 616.
15. దక్షిణహిందూదేశ శాసనములు (ద.హిం.శా) X నం. 355.
16. జి. యజ్దాని, VII-XI పేజీలు 607,
17. ద. హిం. శా. VI నం. 1329,
18. ఏ. పి. ఇండిక XXIX పేజీలు 127.
19. ద. హిం. శా IV నం. 1252.
20. ఆర్. సుబ్బారావు, ది ఈస్టర్న్ గంగాస్, పేజి 103.
21. ద. హిం. శా VI నం.628, జ. ఆ. హి. రి. సొ XXIII పేజి 66
22. జ. ఆ. హి. రి. సొ. XXIII పేజి 60.
23. కొలనువాండలికులు సరసీపురము లేక కమలాకరపురమును (ఆధునిక ఏలూరు) ముఖ్య పట్టణముగ కొలనుమండలమును పరిపాలించుచుండిరి. కొలనువాండలికులలో ప్రఖ్యాతి వహించిన వ్యక్తి కేశవదేవుడు. ఇతడు క్రీ.శ. 1196 నుండి క్రీ.శ. 1231 వరకు పరిపాలించెను. ఇతని శాసనములు జుత్తిగి, పట్టిసీమేశ్వరము, పాలకొల్లు ప్రాంతములందు దొరకెను. కేశవదేవుడు అటు కాకతీయులకుగాని ఇటు చోళులకుగాని సామంతుడుగాలేడు. ఇతడు గతించిన తరువాతనే కొలను మండలము కాకతీయుల వశమైనట్లున్నది. ఈ యభిప్రాయమును దృఢపరచు గణపతిదేవుని శాసన మొకటి క్రీ.శ. 1231 నాటిది, ఇగ్గలము లోని పాలేశ్వర దేవాలయములో లభించెను. కేశవదేవుడు గతించిన తరువాత, మంగెయదేవరాజు రాజ్యమునకు రాక ముందున్న సంధికాలము, అనగా క్రీ.శ. 1231 నుండి క్రీ.శ. 1243 వరకు కొలనువాండలికుల శాసనములు కానరావు. బహుశః ఈ కాలములో కాకతీయులు కొలను మండలము నాక్రమించి యుండవచ్చును.(ద. హిం. శా. V నంబర్లు 181, 188, 187, 176, X నం 262, జి. యజ్దాని VII-XI పేజి 608, జ. ఆ. హి. రి. సొ. XX పేజి 149)
24. భారతి, సంపుటి VI భాగము I పేజీలు 143.
25. జ. ఆ. హి. రి.సొ. XXIII పేజి 96, ఏ. ఆర్. 1908, భాగము II పేజి 11.
26. ద. హిం. శా. X నం. 398.
27. ఆర్. సుబ్బారావు, పేజి 170.
28. ఆంధ్ర గ్రంథమాల (మద్రాసు విశ్వవిద్యాలయ ప్రచురణ) నం. 8 పేజీలు 63, 65, 83, 84.
29. ఇండియన్ కల్చరు III పేజీలు 121. ది ఒరిస్సాహిస్టారికల్ రిసర్చి జర్నల్ (ఒ. హి. రి. జ) I పేజీలు 302.
30. ఒ. హి. రి. జ I పేజి 303.
31. అదే చూడుము III పేజి 136.
32. ద. హిం. శా V నం. 1265, ఏ. ఆర్. 98-1909, 303-బి, 1896, ఆర్. సుబ్బారావు, పేజి 171.
33. ఏ. ఆర్. 98, 1909.
34. ద. హిం. శా IV నంబర్లు 1045, 1339, కాకతీయ సంచిక, రాజమహేంద్రవరము 1935, పేజి 143.
35. జి. యజ్దాని, పేజి 618,
36. అదే చూడుము.

కలగూరగంప

గోదలు శాసనము

స్వస్తి శ్రీమతు చా
ళుక్య విక్రమ వ
ర్షములు 7 ప్రజోత్పత్తి
సంవత్సర మాఘ × మాస వ
ర × × సూర్య గ్రహణ
నిమిత్తమున మాద(ం) యనా
యకుండు సంకదేవ
(విదేకు) సూరపోజు కుంట
లోన జొన్న చేను ఖరువుచేను
× నాగులకుంట వెనుక వరి
చేను పందుము పట్టు ౧౦ పె
ద్ద చెఱువు వెనుక ఇ(చ్చిన పస్స)
సజలము మడ్ల పందులు
పట్టు ౧౦ స్వదత్తం పరదత్తం
నా యోహరేతి వసుంధర ష
ష్ఠిర్వర్ష సహస్రాణి వి
ష్టాయాం జాయతే క్రిమి.

ఈ శాసనము గోదలు గ్రామమునకు వెలుపల దారి ప్రక్కనున్న చెఱువుగట్టు పైగల శిధిలాలయము ప్రక్కన నొక శిలపై చెక్కబడి యున్నది. శాసన శిల ప్రత్యేకముగా చదును జేయలేదు. అది నైస ర్గికముగనే చదునుగా నుండుటవలన గండాచార్యుడటులే దానిపై శాసనము చెక్కినాడు. రాతిలో అచటచట ముడులుండుటవలన అచటి యక్షరములు సరిగా లెలియలేదు. అందువలన పాఠమున అట్టివానికి హంసపాదులు ఊహించగలిగి వానికి కుండలీకరణము లుంచితిని.

గోదలు మిక్కిలి ప్రాచీన గ్రామము. దానికి ప్రాచీనమున "గ్రుద్దళ్ళ" యనిపేరు. అచటగల ఈ ఆలయమున మూడు దశల నిర్మాణము స్పష్టముగా గనిపించును.

శాసనమున చాళుక్య విక్రమ శకము పేర్కొనబడుటచే శాసన కర్త వారి సామంతుడుగావలెను. చాళుక్య విక్రమ శకమును స్థాపించిన వాడు పశ్చిమ చాళుక్య ప్రభువు త్రిభువన మల్లుడు. అతడు దానిని 997 రాక్షస సం॥ ఫాల్గుణ శుద్ధ ౫ నాడు ఆరంభించెనని చెప్పదురు. పై శాసన సంవత్సరమున ఆషాడశుద్ధ ౧౧, ఆశ్వీజ బహుళ ౧౧, పుష్య శుద్ధ ౧౩ తిథులందు వెలసిన మూడు శాసనములు గంగాపుర మున నున్నవి.

వానిలో చివరిదాని పిమ్మట ఇది నెల పదిహేను దినములకే వెలసినదిగాని యిందలి శక సంఖ్య సంవత్సరమునకు సహకరించుట లేదు.

ఈ శాసనకర్తయగు మాదయ నాయకుడు శంఖలాంఛనుడు. త్రిభువనమల్లుని సామంతుడైనా ఉప్పంపేట ప్రాంతమును పాలించె నని తోచును. నేడమరాబాద సమీపమున "మాదానేని పల్లె" యను గ్రామమున్నది. అచట మాదనివా రున్నారు. ఈపేరుగల ప్రభువులు రాచకొండ వెలమలందున్నారుగాని ఈ కాలమువరకు వారు పాల కులుగా నున్నట్లాధారములు లేవుగనుక ఈ మాదయనాయకుడు చరిత్రకు క్రొత్తవాడని నాయభిప్రాయము. అందువలన చరిత్ర కారులకిది యుపకరించునని తలతును.

— *శ్రీ కపిలవాయి లింగమూర్తి.*

ఒక సందేహము

నన్నయగారు, "గరుడోపాఖ్యానమున" అరుణుండుదయించు సందర్భమున, ఇటుల నొక కందమును రచించిరి:

కం. దాన"నపరార్ధ" కాయ వి
హీనుఁడు పూర్వార్ధతను సహితుఁడగం
గా నుదయించె సుతుండు మ
హా నీతి యుతుండు తల్లి కప్రియ మెసగన్."
(భా ర. ఆది. 2.6.)

ఇచట సందేహాస్పదమైనది, "అపరార్ధ" అనునది.

"పూర్వాపర ప్రథమ ... (2–1–58) సూత్రమున, "అపర" శబ్దమునకు పూర్వనిపాతము సిద్ధించుచుండ, "అపర స్యార్ధే పశ్చభావో వక్తవ్యః" అను వార్తికము, "అపర" శబ్ద మునకు "పశ్చ" ఆదేశమును, నిబంధించుచున్నది. అందుపై భట్టోజీ, "అపరశ్చాసావర్ధశ్చ పశ్చార్ధః" అని విగ్రహముచే వివరీక రించెను. ఇంతేకాక, "పశ్చాత్" (5–3–32) అను సూత్రము చేతనే, "అవరస్య పశ్చభావ ఆతిశ్చ ప్రత్యయోఽస్తాతేర్విషయే"

అనుట, "పర" కు, "పశ్చ" భావము కలదనుట "అర్ధోత్తర పదే వినాపి పూర్వపదేనాపరస్య పశ్చభావో వక్తవ్య" అనినది, అపరస్యార్ధే పశ్చభావో వక్తవ్యః" అనుదానిపై తత్త్వబోధిని. "ఏతచ్చ, 'పశ్చాత్' ఇది సూత్రే భాష్యే స్థితమ్." అనుటచేతను, "పశ్చ" భావము స్థిరీకృతమైనట్లే.

ఇంకను, కాళిదాసు, శాకుంతలములో, "గ్రీవాభంగాభిరామం", అను శ్లోకములో, "పశ్చార్ధేన ప్రవిష్టశ్శరపతన భియా భూయసా పూర్వకాయమ్", అనుచోట, "అపరసా నమున" "పశ్చ" తోడి "పశ్చార్ధ" అనియే ప్రయోగించెను. (అపర: అర్ధ: ఇతిపశ్చార్ధ:)

ఇప్పట్టున, "పశ్చార్ధ" అని యుండవలసిన పట్టున, నన్నయ గారు, "అవరార్ధ" అని ప్రయోగించుటలో. వ్యాకరణ విషయిక గ్రంథి యేదైన కలదేమో, మహావైయాకరణులు. ఇందుమూలముగా గ్రంథిభేదనము జేయ గోరబడుచున్నారు.

— శ్రీ మాదిరాజు శ్రీరామమూర్తి

నైషధము - చింతామణి మంత్ర స్వరూపము

నైషధమునందు చింతామణి మంత్రస్వరూపము వర్ణింప బడినది సంస్కృత నైషధమున —

"అవామా వామర్ధే సకల ముభయా కార ఘటనాత్
ద్విధాభూతం రూపం భగవద భిధేయం భవతియత్
తేల దర్మం తం మే స్మర హర మయం సేందు మమలం
నిరాకారం శశ్వజ్జప నరపతే సిధ్యతు సతే" 14-88.

అను శ్లోకమున చింతామణి మంత్రము 'స్మరహరమయం' — అని శ్రీహర్షుడును;

"సకలంబై హిమరుక్కళా భరణమై సర్వాపసర్వార్థయు
గ్మక రూపం బగు శైవమై గత కళంకంబై శివంబై యుపా
సక చింతామణియై ప్రసిద్ధ భగవచ్ఛబ్దాభిధే యార్థమై
యొక మంత్రంబు మదీయమొప్పు; నది నీకుర్వీశ, యేనిచ్చితిన్."
6-18.

అని ఆంధ్రనైషధమున "శైవమై" — అని శ్రీనాధుడును చెప్పుటచే కొందరు భ్రాంతిపడి చింతామణి మంత్రమునకు "శివుడే అరము"ని నిశ్చయించిరి. కాని, చింతామణి మంత్రస్వరూపము సరస్వతియేయని అస్మదాదుల అభిప్రాయము.

సరస్వతీదేవి — నలమహారాజునకు చింతామణి మంత్రమును స్వయముగ నుపదేశించుచు, పై పద్యమునందేగాక యింకను ఐదారు పద్యములందు ఈ మంత్రమును "అస్మదీయము, మదీయము" — అని వాచ్యముగా చెప్పుచుండగా శివుడే యర్థమనుట ఎట్లో తెలియకున్నది.

పరిశీలింపుడు :— ఆంధ్రనైషధమున.

సరస్వతి నలునికి చింతామణి మంత్రము నుపదేశించుట

వ. అనంతరంబ నిషధ మహికాంతునిం గనుంగొని సరస్వతీదేవి యిట్లనియె ... ఆంధ్రనైషధము 6-16.

ఉ. నేమముతోడ విశ్వధరణీ భువనాధిప, సంతతంబు జిం
తామణి మంత్రరాజము ప్రధానము మంత్ర కదంబ కంబులో;
"నామ క మమ్మహామనువు" మానిత భంగి భజింపుమీవు చిం
తామణి కామధేను విబుధ ద్రుమ సన్నిభ మా శితావళికిన్.
ఆం. నై 6-17.

[ఆ మహా మనువు మామకము=నాది. అనగా ధ్యాన దేవతను నేను సరస్వతిని.]

మ. సకలంబై హిమరుక్కళాభరణమై సర్వాపసర్వార్థయు
గ్మక రూపంబగు శైవమై గత కళంకంబై శివంబై యుపా
సక చింతామణియై ప్రసిద్ధ భగవచ్ఛబ్దాభిధే యార్థమై
యొక మంత్రంబు మదీయమొప్పు; నది నీకుర్వీశ, యేనిచ్చితిన్.
6-18.

మదీయము=నా యది. అనగానే నే దేవతగా గల యట్టిది.

వ. ఇది చింతామణి మంత్రంబు.

వ్యాఖ్యలో :-

"......ఏషచిన్తామణి ర్నామ మన్త్రః సర్వార్థ సాధకః
జగన్మాతుః సరస్వత్యాః రహస్యం పరమంమతమ్"
— అని పారమేశ్వరము

శా. సర్వాంగేణ రసామృత స్తిమిత వాచావీచి వాచస్పతుల్
గర్వోన్నద్ధ విరోధి రాదురుధి వాగ్గాంభీర్య కుంభోద్భవుల్

స్వర్గా మాతదృశాంగనా జన మనస్సంచాల సంచాస్త్ర్మలం
తత్వాఖిల్ నృప, "యస్మదీయమగు" చింతారత్న విద్యాధరుల్.
ఆం నై. 6 21.

[అస్మదీయమగు=నాదైన [సరస్వతిదైన] యీ చింతామణి మంత్రము.]

కం. వైదర్భిరోలెం గవితా
వైదర్భి నరేంద్రదీకు వశ మయ్యెడు సూ
ర్యోదయ వేళ జపింపు క్ర
తాదరమున నస్మదీయమగు మంత్రంబున్. 6-24.

అని యిట్లు సూక్ష్మముగా చెప్పుటయేగాక, ఆ దివ్య మంత్ర స్వరూపము ఏరీతిగా సరస్వతి యగునో యది యంతయు ఆంధ్ర నైషధమునందలి, 6 వ అశ్వాసమునందలి 22 వ సీసపద్యమున సంపూర్ణముగా శ్రీనాథుడు వర్ణించినాడు.

సీ. కబరికా భరముపైఁ గన్నె గేదంగి పూ
రేకుతోఁగూడ రేరేఁ జెరివి,
లలితకస్తూరికాతిలక మధ్యంబున
సొబగొందు ముత్యాల చుక్కనిలిపి,
కుదురునిండిన మించు గుబ్బచన్నులమీద
జిలుగు దువ్వలు వగంచెలయుఁ దొడిగి,
యచ్చ వెన్నెలచాయ నవఘలిఁ పంగెజాలు
నిద్దంపు వలిపట్టు నెఱికగట్టి,

తే. యంచ కొదమలఁ బూన్చిన యరదమెక్కి
యుపనిషద్వీథి విహరించుచున్న నన్నుఁ
మహిద చింతామణి దివ్య మంత్రమూర్తిఁ
దలపి సారస్వతం బయత్నమునఁగలుగు. 6-22.

[సరస్వతి ఉపనిషదర్థ స్వరూపురాలు.]

ఇందు, చింతామణిమంత్ర స్వరూపము తానేయని స్పష్టముగా చెప్పియుండ, ఇది సారస్వత మంత్రముగాక శైవ మంత్రమనుట ఉచితముగా కనబడదు.

ఈ చింతామణీ మంత్రమునకు శివుడు ఋషిగాయుండిన యుండవచ్చును. కావున ఈ మంత్రము శైవమని కవి చెప్పియుండవచ్చును. మూలననదియే - 'స్మరహరమయం' - అని చెప్పబడి నట్లున్నది.

పై కారణములచే చింతామణి మంత్ర స్వరూపము సరస్వతి యేయని నైషధమువలన తెలియుచున్నది.

— శ్రీ అకొండి విశ్వనాథం.

ఆరుద్ర 'రనండి' రహస్యం

1974 మార్చి భారతిలో శ్రీ టి. జి. కృష్ణారావుగారు 'మణి ప్రవాళమూ- ఆరుద్రా' అనే వ్యాసం (5వ పుట)లో ఆరుద్ర 'త్వమేవాహం'లోని ఆధునికమణి ప్రవాళ భాషగురించి వ్రాస్తూ "రనండి నాపంథా...రనండి మీరంతా"లో ఆరుద్ర 'రనండి'లో Run అనే ఇంగ్లీషు పదాన్ని తెలుగులో కలిపి వ్రాశారని వ్రాశారు.

దానిమీద ఏప్రిల్ 1974 భారతి (కలగూరగంప)లో 'రనండి...పొనండి' అనే శీర్షికలో తమ అభిప్రాయం వ్రాస్తూ శ్రీ బండి నాగరాజుగారు, నెల్లూరు జిల్లాలో రనండి; పోనండి అనే పదాలు వ్యవహారంలో ఉన్నవే, Run నుండి సృష్టించిందికాదంటూ Run అండి; win అండి-అనే అర్థాల్లోనే నేనూ రాశాను అని ఆరుద్ర అంటే నా కాక్షేపణలేదుగాని "Run అండి కాని - రనండి (రండి) ఒకటే మాత్రైపు వాడుకలో వున్నదను మాత్రమే నేచెప్ప వచ్చింది" అని కూడా విశదం చేశారు.

దీనిమీద 1974 మే భారతి (కలగూరగంప)లో శ్రీ పాకాల వెంకటకృష్ణయ్యగారు "రనండి, తెలుగుపదమే- నెల్లూరు మాండలికమే. ఆరుద్ర నెల్లూరివాడు కాకపోయినా, కవిగా ఆరుద్రపై నెల్లూరి అతి నవ్యకవి పఠాభి ప్రభావం చాలఉందనటం నిర్వివాదం... కాబట్టి 'రనండి' అనే మాటను వారి నోటివెంట విని, తనకావ్యంలో ప్రయోగించి ఉంటాడని నా అనుమానం. ఆరుద్రగారే తమ ఉద్దేశాన్ని వెల్లడించితే ఏ చిక్కూలేదు .." అన్నారు.

దానిపై 1974 జూలై భారతి (కలగూరగంప)లో మళ్ళీ శ్రీ టి జి. కృష్ణారావుగారు "ఆరుద్ర ప్రయోగించిన 'రనండి' ఆంగ్లపదమే అంటూ... కాని, పఠాభి, రామిరెడ్డి ఇత్యాదుల కవిత్వంలో లేని 'రనండి, పొనండి' మాండలికాలు, వారి ప్రభావంతో ఆరుద్ర కవిత్వంలో ప్రవేశించాయనడం కేవలం అసంగతం. ఆరుద్ర కవిత్వంలో ఇతర తా కూడా నెల్లూరు మాండలికాలు కనబడవు" అని ఖండించారు.

దీనిమీద 1974 ఆగస్టు భారతి (కలగూరగంప)లో శ్రీ గంటి శ్రీరామమూర్తిగారు: రనండి; పొనండి వంటి రూపాలు

విశాఖ శ్రీకాకుళం జిల్లాల్లో ఒకప్పుడు వాడుకలో ఉండేవని తెలుస్తోందంటూ కొన్ని ఉదాహరణలు ఇచ్చి "ఇంతకూ ఆరుద్ర వాడినది ఆంగ్లపదంపై తెలుగు ప్రత్యయం చేర్చిన కృతక రూపమే కాని, దేశ్యపదం కాదని నా అభిప్రాయం" అన్నారు.

ఈవిధంగా నాలుగు నెలలు చర్చజరిగినా ఆరుద్ర కిమన్నాస్తి!

ఇటీవల, నా రిసెర్చి పనిలో ఆనందవాణి పాత పత్రికలు తిరగవేస్తున్నాను అనుకోకుండా, ఆరుద్రగారి 'రనండి' రహస్యం బైటపడింది.

ఆరుద్రగారి 'త్వమేవాహమ్' పుస్తక రూపంగా రావడానికి ముందు తెలుగు స్వతంత్ర వార పత్రికలో అచ్చయింది. ఆ అచ్చు కావడానికిముందే, 17-9-1944 తేదీ ఆనందవాణి వారపత్రికలో 'పఠాభి'–'మలబారున కాహ్వానము' అనే గీతం ప్రచురింపబడింది. "రనండి రనండి మలబారు" అంటూ ప్రారంభమైంది పఠాభిగీతం. ఆ సంచికకి ముందూ వెనకా సంచికల్లో ఆరుద్ర, శ్రీ శ్రీల రచనలెన్నో ఉన్నాయి; అప్పట్లో ఆరుద్రకాని, శ్రీ శ్రీ కాని ఆనందవాణి నేపథ్య సంపాదకులు (Play back Editors) గా ఉండేవారనుకుంటాను. పఠాభిగారి ఆ గీతంలో "రనండి రనండి మలబారు" చూడగానే, ఆరుద్ర "రనండి"పై భారతి సంచికల్లో జరిగిన చర్చ గుర్తొచ్చింది.

'మలబారున కాహ్వానము' అనే గీతంలో 'పఠాభి' నెల్లూరు మాండలిక పదాన్నే ప్రయోగించారో, ఇంగ్లీషు భాషా రూపాన్నే చమత్కారానికి వాడారో వారే చెప్పాలి! అయితే, 'రనండి' అనేపదం పఠాభి కవితలో ఎక్కడా లేదని టి. జి. కృష్ణారావుగారు వ్రాయడం ఎంత సత్యదూరమో, పఠాభిని చూచి ఆరుద్ర వ్రాయలేదనడం కూడా అంతే అసత్యమూ, అసంగతమూను.

'రనండి' నెల్లూరి మాండలిక రూపంగా ఉన్నా చమత్కారప్రియుడైన పఠాభి, ఇంగ్లీషు పదాన్నించే సృష్టించి 'రనండి' అని ప్రయోగించి ఉండవచ్చు; చమత్కారం అంటే చెవి కోసుకునే ఆరుద్ర కూడా చాపల్యంతో పఠాభిగీతం చూచే 'రనండి' పదాన్ని 'త్వమేవాహమ్'లో ప్రయోగించాడని నిస్సంశయంగా చెప్పవచ్చు.

— 'కనక్‌ప్రవాసి'

భట్టనారాయణుడు – నారాయణభట్టు

వేణీ సంహార కర్తయగు భట్టనారాయణుడు, నన్నయ మిత్రమైన నారాయణభట్టునూ ఒకడే యనుటకు దగిన యాధారములు దొరికినయెడల ఆంధ్ర సాహిత్య విమర్శకులకు జాల ఉపకారము జరిగినట్లగును. దాని యాధారముల గవేషింప వలసిన అవశ్యకత గలదన్న– శ్రీ బులుసు వేంకటేశ్వర్లుగారి వాక్యములను స్వీకరించి 1976 మార్చి భారతిలో శ్రీ అవ్వారి వాసుదేవశాస్త్రిగారు 'దీధితి' వాఖ్యలో దీనికి నాధారము గలదని చెప్పిరి. అట –

'నతు కేవలయా శాస్త్రస్థితి సంపాద కచ్ఛయా' అను కారికా భాగమునకు సంబంధించిన –

'యథా–వేణీసంహారే విలాసాఖ్యస్య ప్రతిముఖ సంధ్యంగస్య ప్రకృత రస నిబంధానానుగుణమపి ద్వితీయేంకే భరతమతాను సరణ మాత్రేచ్ఛయాఘటనమ్' అనువృత్తికి 'నారాయణభట్టేన ప్రకృత వీర రసానుగుణ మనవే–క్ష్యైవ భానుమతీ దుర్యోధన యోర్యోగే–' ఇత్యాది వ్యాఖ్యయందు దీధితి కారునిచే 'నారాయణభట్టేన' అన్న ప్రయోగము కల్పింపబడుటచే భట్టనారాయణుడు నారాయణ భట్టున కంటె నభిన్నుడేమో! అని తెల్పిరి.

దీనికి నుపోద్బలముగా వేణీ సంహారపు నాందీ శ్లోకమును గూడ చర్చించి యందు నాతని నివాసాది వివరములు లేకపోవుటచే నారాయణభట్టున కభిన్నత్వము సంఘటింప జేయు నవకాశములు గన్పించుచున్నవి యనియును వక్కాణించిరి.

పైన చెప్పిన విధముగా భట్ట నారాయణుడు నన్నపార్యుని మిత్రమునైన నారాయభట్టు ఒకడేనని వారి యభిప్రాయము.

సరిగా పరిశీలించిన భట్టనారాయణుడు నారాయణభట్టుకంటె భిన్నుడేయనుట ఉచితము. వారికాలము లందెంతయో భేదముకలదు. నారాయణభట్టు నన్నయ మిత్రము కావున అతని కాలము 11 వ శతాబ్దమనియే తెలియుచున్నది.

ఆనంద వర్ధనునిచే ధ్వన్యాలోకమునందు పేర్కొనబడిన వేణీ సంహారకర్త భట్టనారాయణుడు అతని కన్ననూ పూర్వపువాడని తెలియుచున్నది.

'చంచద్భుజ భ్రమిత......'

'యోయశ్శస్త్రం బిభర్తి... ...' అను రెండు శ్లోకములు ఓజో గుణమునకు నుదాహరణములుగ వేణీ సంహార మందుండి యానంద వర్ధనునిచే స్వీకరింపబడినవి. అట ఈ రెండునూ, ఎందుండి గ్రహింపబడినవో వాటి కర్త యెవరో పేర్కొనబడలేదు. తృతీయోద్యోతమునందు బూర్వోక్త ప్రస్తావనలో 'యథా – వేణీ

సంహారే' లని నాటక నామము నిర్దేశింపబడినది. కావున వేణీ సంహారము ఆనందవర్ధనుని కంటె పూర్వపు నాటకము.

క్షేమేం దుని గురువును, మమ్మభటునకంటె పూర్వికుడు నైన యభినవగుప్తుడు ధ్వన్యాలోకమునకు 'లోచన' వ్యాఖ్యానము గావించినాడని సర్వజనవిదితము. ఆతని సమయము 10వ శతాబ్దము. కావున ఆనందవర్ధనుని సమయము 9వ శతాబ్దమని చెప్పవచ్చును. ఈ విషయమునే—

ముక్తాకణ. శివస్వామీ కవిరానంద వర్ధన
ప్రథాం రత్నాకరశ్చాగాత్ సామ్రాజ్యేఽవన్తివర్మణః

అను శ్లోకము నొక్కి వక్కాణించుచున్నది. అవన్తివర్మయొక్క సమయము 9వ శతాబ్దము (855 టు 883) అని చరిత్ర కూడా నిర్ణయించుచున్నది. ఆతని యాస్థానమందున్న ఆనందవర్ధనుని సమయము 9వ శతాబ్దమేనని వేఱుగా చెప్పనవసరములేదుగదా! తత్పూర్వికుడే వేణీసంహారకర్త భట్టనారాయణుడునూ.

అంతేగాక 'భట్టవామనుడు' స్వకీయ కావ్యాలంకార సూత్ర వృత్తి యందు— 'ఏతిరం వేత్స్యతి క్షితే' అను భట్టనారాయణుని శ్లోకమును విమర్శించినాడు. ఈ వామనుడు తృతీయ గోవిందుని యాస్థానమందుండెను. తృతీయ గోవిందుని సమయము (794 టు 813) 8వ శతాబ్దముగా చారిత్రికులు నిర్ణయించినదే. కావున వామనుని కాలము 8వ శతాబ్దము. వేణీ సంహారకర్త తత్పూర్వికుడే యని దీనిద్వారా తెలియుచున్నది.

కాన భట్టనారాయణుని సమయము 8వ శతాబ్దము తరువాత యని చెప్పుటకు వీలుకాదు. 11వ శతాబ్దమునకు సంబంధించి నారాయణభట్టునకు సుమారు 300 సంవత్సరములు ముందువాడైన భట్టనారాయణుడు అతనికంటె నభిన్నుడనుట హాస్యాస్పదము.

కావున 'దీక్షిత'కారుని 'నారాయణభట్టేన' అన్న ప్రయోగము ప్రామాదికమే. దాని ననుసరించి వారి కభేదమును గల్పించుటకు యత్నించు— శ్రీ అవ్వారి వాసుదేవశాస్త్రివారి వాదనయు యుక్తి సహముకాదు.

మరియు నిశితముగ పరిశీలించిన భట్టవామనుడు, భట్టోద్భటుడు, భట్టనారాయణుడు అను వారలకు నామమునకుముందు భట్ట శబ్దము రాజిల్లుచున్నది. మహిమభట్టు, మమ్మటభట్టు, నారాయణభట్టు అనువారలకు భట్టశబ్దము నామమునకు తరువాత నున్నది. కావున భట్టనారాయణుడు భట్టోద్భట భట్టవామనులకు సమీపమందు నున్నవాడు. అదేవిధముగ నారాయణభట్టు, మహిమభట్టు, మమ్మటభట్టుల సమీపపు వాడన్న విషయ మెరుకపడుచున్నది.

ఎన్నోవందల సంవత్సరములంతరముగల వీరిద్దరకు నభేదము కల్పించుట సమంజసమా? ఈ విధమగు విపర్యాలనుచేయుట చరిత్ర పుటలపై సిరాగుమ్మరించుట వంటిది యగును.

కావున వేణీ సంహార కర్తయగు భట్టనారాయణుడు నన్నపార్యుని మిత్రమైన నారాయణభట్టునూ ఒకరు కాదని సహృదయ హృదయములకు నవగతమగు చున్నదని మనవి చేసికొనుచుంటిని.

— "సత్యప్రభ"

డబ్బా-దస్కం

దస్కం అనేమాట దశకం అనే మాటనుంచి కూడా వచ్చి ఉండవచ్చు.

తెలంగాణాలో తీసివేత లెక్కలు చేసేటప్పుడు పక్క సంఖ్యనుండి అప్పుతీసుకోవడాన్ని దస్కం తీసుకోవడం అని వాడుతారు.

ఇంతకీ ఇటువంటి జంటపదాలలో రెండోమాటకు అర్థం ఉండడం తప్పనిసరి కాదనుకుంటా.

—శ్రీ బి. రామచంద్రరావు

లేఖ

"కోరుకొండ" లోని పరాశరగిరికి వెనుకనున్న "కాపవరం" కేవ్సుగా చరిత్రలో రికార్డు కాబడియున్న పాండవుల మెట్టగా పిలువబడెడి పర్వతములోని గుహలు — బౌద్ధగుహలా? గిరిదుర్గమా? ప్రాచీనకాలమున—ఆంధ్రదేశమున — బౌద్ధ భిక్షువుల నివాసమునకును సభాసమావేశములకును—కొండల దొల్చి గుహలు — గుహావిహారములు "శంఖవరము-కోరుకొండ-ఎఱ్ఱంపాలెం" మున్నగుచోట్ల నిర్మింపబడి వట్లు చరిత్రకారులు నుడువుచున్నారు.

కాని కోరుకొండకు ప్రక్కగానున్న కాపవరం గుహాలో ఎట్టి బౌద్ధ చిహ్నములు కన్పటవు — పర్వతమునకు మధ్యగా పర్వతము దొలువబడి వరుసగా తొమ్మిది గదులును — గదులకు కిటికీలును, ముందు చిన్న వసారాయు గలవు — గదులలో స్నానాదులు లేవు.

పర్వతము పైన నేలమట్టమునయి కొన్ని రాతి పునాదులు ఇటుక

పునాదులు కన్పటు నున వి - బౌద్ధ విహారమునకు సంబంధించినవని చెప్పుటకు మాయెట్టి చిహ్నములు కన్పట్టవు.

కోరుకొండ గిరిదుర్గముగా 8 వ శతాబ్దమునుండి మిలటరీ క్యాంపులున్నట్లుగా చరిత్రలు చెప్పుచున్నవి. ఈ ప్రాంతమున- ఇంత విశాలమైన పెద్ద పర్వతము మరియొకటి లేదు.

ఇదియే గిరి దుర మనియు - ఇపుడు శిథిలమయి కన్పట్టు పునాదులు కోటలోని బురుజులు మున్నగువాని శిథిలముల యని యను మానము కలుగుచున్నది.

ముమ్మడి నాయకుని శాసనము :

శ్లో॥ పానార-కోన-కురవాటక వెంగరాసీన్
గోదావరీ ముభయతోయము పాంతదేశాన్
జిత్వావనాచల జలస ల దుర రమ్యా
వేకః ప్రశాస్తి చిరమ ప్రతి శాసనంనః॥

అని చెప్పుచున్నది.

పా ర-కోన-కురవాట-వెంగసీమలను.

వన-అచల-జల. స్థల దుర్గములుగా పాలించినట్లు క్రమా న్వయము వచ్చుచున్నది -

కోరుకొండలోని - ప్రతాపరు దుని శాసనముతో - గోదావరి తూర్పున-కోనమాడలు అని ప్రయోగించినాడు. ఈ శాసనమువలన ఈ ప్రాంతమునకు "కోన" యను నామమున్నట్లు వెల్లడియగు చున్నది. ముమ్మడి నాయకుని శాసనములో కోనప్రాంతమును అచల (గిరి) దుర్గముగా వర్ణించు చున్నది. దీనికి ప్రమాణముగా నిప్పటికిని ఈ గిరిని చేర్చియే మటి కోటగలదు. పై ఆధారములను బట్టి పాండవుల మెట్టపైగల గుహలు బౌద్ధ గుహలుగాక, గూఢచారులు నివసించుచు శత్రు చర్యలను కనిపెట్టు స్థావరములుగా భావింపవచ్చును.

పర్వతమున గుహలుగల ప్రాంతమునకు చేరుకొన్నగాని-గుహలు కన్పట్టవు. కాని కోరుకొండనుండి రాజమహేంద్రవరమునకు మధ్య గల ప్రాంతమునంతయు పరిశీలించుట కవకాశము గలదు. క్రింద నుండి గుహలుగల ప్రాంతమునకు సైనిక విషయమున ఎట్టి పతి ఘటన చేయలేరుగాని పైనుండి క్రిందకు సూటిగా ఎట్టి ఆయు ధములు ప్రయోగించుటకైనను అవకాశము గలదు.

పై విషయములన్నియు పరిశీలించిన ఇవి గిరిదుర మునకు సంబంధించిన గుహలేగాని బౌద్ధ గుహలు కావని సుస్పష్టమగుము.

చరి తకారులు విమర్శకులు పై విషయములను పరిశీలించి చారిత్రకాధారములను తెలియజేసి మా చరిత్ర పరిశోధనకృషిలో తోడ్పడవలసినదిగా ప్రార్థించుచున్నాము.

- శ్రీ గుండు విష్ణుశ్వర శాస్త్రి

* * *

మా గృహనామము అవంచను గురించి యువ పరిశోధకులు వర్య శ్రీ కె. కిశోరబాబు, కె. అశోకబాబులు రచించిన లఘువ్యాస మును చదివి ఎంతో ఆనందించాను. సైజులో చిన్నదే అయినా, గుణంలో మిన్నగా ఉన్నది. మాకుల స్వాములు నైజాము రాజోద్యోగు లుగా అవంచనుంచి ఈ ప్రాంతమునకు 1750 ప్రాంతంలో వచ్చి వెట్లున్నా, యిక్కడ రాజోద్యోగులుగా, మిరాసీదారులుగా, ఈనాం దారులుగా జీవితములు గడుపుతూ వచ్చినట్లున్నా మావంశచరి తలు తెల్పుతున్నవి. మా పితామహుల వరకును తమ యింటిపేరును "అవంచ" గానే - చకారముపై ద్వితీయశబ్దవాచితోసహా వ్రాస్తూ ఉండేవారు. కాని మా తండ్రిగారు ఎందువల్లనో 'చ' గా పలుకు బడిరోకి రావడం యిష్టంలేకనేమో "అవంత్స" గా మార్చి దాని కాంగ్లాక్షరమాను AVANTSA గా వారు ఆంధ్రాంగ్లములలో సంతకములు చేస్తూ వచ్చారు. ఈ ఇంటి పేరు కలవారు ఒకటి మా గోల్కొండ వ్యాపారుల (విశిష్టాద్వైత నియోగుల) లోను, మాధ్వులలోనూ, స్మార్తులైన తెలగాణ్య వైదికులలోనూ మాత్రమే- ఉండినట్లు నేరెరిగినంతవరకూ తెలుస్తోంది. ఈ యువ పరిశోధకులు అవంచ గురించి మరింత సావధానముగా సమగ్రపరిశోధనచేసి అస్మ దాదుల నానందింప చేతురుగాక !

- శ్రీ అవంత్స సోమసుందర్.

* * *

"భారతి" మార్చి సంచికలో పురుషసూక్తమునకు సంబం ధించిన శ్రీ తిరుమల రామచంద్రగారి వివరణము చూచితిని. 'అంగుల' పదమునకు వారు ఆంగ్లపద ప్రాతిపదికపై 'దిశ'యని అర్థము చెప్పుట విచిత్రముగా నున్నది. 'అంగుల'మునకు సమానార్థక మని వారు భావించిన ఆంగ్లపదము 'Angle' నకు ఆంగ్లములోనే దిశయని అర్థమువచ్చు ప్రయోగము లేనందున వారి వాదమంతయు ఊహాగమ్యమగుచున్నది.

శ్రీ రామచంద్రగారు ఊహించిన ప్రకారము 'దశాంగులమ్'

దశదిశలకు సూచకమని అంగీకరించినను పురుషసూక్త శ్లోకములో ఈ అర్థము పునరుక్తి యగుచున్నది. 'స భూమిం విశ్వతో వృత్వా' అతడు భూమినంతటను, విశ్వతః- సర్వతః అన్నివైపులనుండి ఆవరించి యున్నాడనిచెప్పి, వెంటనే 'అత్యతిష్ఠత దశాంగులమ్'—దశదిశలను అతిక్రమించి యున్నాడని చెప్పుట ప్రకరణశుద్ధికాదు. పరమ పురుషునికి 'సహస్ర శీర్షములు' 'సహస్రాక్షులు' 'సహస్ర పాదములు' అన్న మూడు విశేషణములు ఉపలక్షణములుగా సంకేతసూత్రములయి నప్పుడు, నాలుగనదియైన 'దశాంగులము నతిక్రమించి యుండుట' యన్నది మాత్రము ఉపలక్షణము కాక ప్రతిపదార్థము లక్షణార్థమే యనుట భావ్యముకాదు. విశ్వమంతయు పెరిగి విశ్వమునకు పైన పది యంగుళముల దూరము వ్యాపించియున్నాడనుటలో 'విశ్వము' అను ఒక పరిమిత రూపమును గ్రహించుటలోనున్న దోషము తొలగి ఊహాతీత వ్యక్తి కలుగుచున్నది. కనుక సాయణుల భాష్యము నంగీకరించుటయే ఉచితము.

అట్లుకాక, పై శ్లోకము సూక్ష్మస్థూలరూపముల యభివ్యక్తమని చెప్పుటకు కూడ నవకాశమున్నది. సహస్ర శీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాత్' వరకు స్థూలరూపమైనచో సమానాంతరముగా 'సభూమిం విశ్వత్ వృత్వా అత్యతిష్ఠత దశాంగులమ్' అన్నది సూక్ష్మరూపము. శక్త్యుపాసనా క్రమమున 'భూమి' మూలాధారాది చక్రములకు సంకేతమైనచో, సహస్రార పర్యంతమున్న శక్తిస్థానము నతిక్రమించి హృదయదేశమున (అనాహతముకాదు) దశాంగుల పర్యంతము వసించియున్నవాడని చెప్పుకొనవచ్చును. ఈ సందర్భమున శ్రీ రామచంద్రగారుదహరించిన దయానందస్వామి వ్యాఖ్య 'జీవస్యహృదయం దశాంగుల పరిమిత మభిగృహ్యతే' సరిపోవుచున్నది 'దశాంగులమ్' భౌతికమయిన పరిమాణము కాక సమాధ్యవస్థలో యోగి సందర్శించు తేజస్సుంపుటయొక్క ప్రతీక (approximation) అనవలెను.[1]

'దశాంగులమ్'-దశాంగుల దూరమని ఏకవచనముగా ప్రయుక్తమైనందువలన కూడ, శ్రీరామచంద్రగారి దశదిశలన్న యర్థము సరిపోవుటలేదు.

—శ్రీ సి చంద్రశేఖర్

---

1. తత్సంబంధమయిన దృశ్యముల ప్రత్యక్షానుభూతి వివరణకై శ్రీ ముక్తానందస్వామి విరచితమైన "చిత్శక్తివిలాసం" శ్రీ గురుదేవ్ ఆశ్రమ్, గణేశ్‌పురి, బొంబాయి చూడుడు.



గ్రంథ విమర్శలు

శబ్దమై ప్రాణమై

[గ్రంథకర్త – డా. మాదిరాజు రంగారావు. ప్రచురణ – సాహితీ బంధుబృందం, హనుమకొండ. డెమ్మీ 8+46 పే. వెల 2 రూ. ప్రతులకు – సాహితీబంధు బృందం, 2-4-30, పోలీసు క్వార్టర్స్ వెనుక, హనుమకొండ, వరంగల్లు. ఆంధ్రసారస్వత పరిషత్ – బొగ్గులకుంట, హైదరాబాదు. బాలాజీబుక్ సెల్లర్స్, వరంగల్లు.]

యుగ సంకేతం. మేల్కొన్న ఆకాశం మొదలైన డజను కవితా సంపుటాలను వెలువరించిన లబ్ధ ప్రతిష్ఠులు శ్రీ మాదిరాజు రంగారావుగారు. ఇది పదమూడవ సంపుటి. ఆలోచన, అనుభూతి, అనుభవం ప్రతిపదంలోనూ రంగరించి తత్వాన్నీ, మనస్తత్వశాస్త్రాన్నీ మానవజీవితంతో సమన్వయించడంలో వీరు సిద్ధహస్తులు.

ఆదిమానవుడు జడ ప్రవృత్తితో సంచరించినా, కాలక్రమేణా చైతన్యవంతుడై తన బండబ్రతుకును నిండుగా పుష్పింపజేసుకున్నాడు నేటి మానవుడు. అటుమానసికంగానూ, ఇటు భౌతికంగానూ పురోభివృద్ధిని సాధించి తమోలోకానికి స్వస్తిచెప్పి, వెలుగుబాటపై నడచి సంస్కృత సంపన్నుడయాడు. ప్రకృతిని హస్తగతం చేసుకొని అనుభవంతో వాస్తవమైన ప్రపంచాన్ని సృజించుకొని ఇప్పటి మానవుడు ఆదర్శజీవితాన్ని అలవరచుకున్నాడు. ఇదే విషయాన్ని కవి ఐదు భాగాలలో వివరించినాడు. ఒక్కొక్క భాగమూ మరల ఐదు విభాగాలుగా పునర్విభజింపబడింది.

మొదటిభాగం 'శబ్దమై ప్రాణమై'. దీనినిబట్టే ఈ సంపుటాని కీపేరు పెట్టబడింది.

మానవుడు సంఘజీవి కొందరు వ్యక్తుల కలయికచేత ఏర్పడిందే సంఘం. కాబట్టే వ్యక్తి ప్రభావం సంఘంపైనా, సంఘం ప్రభావం వ్యక్తిపైనా తప్పకఉంటుంది. ఒక వ్యక్తి తన రాబోయే తరాలవారికి మార్గదర్శకుడు. అలాగే ఒక సంఘం భవిష్యత్తరాల జీవన విధానానికి ప్రాతిపదిక. అంటే మున్ముందు జరగబోయే ప్రతి విషయానికీ వ్యక్తి, సంఘం–ఇద్దరూ బాధ్యులేనన్నమాట. కాబట్టి సామాజికాభివృద్ధికి వ్యక్తీ, వ్యక్తిగతాభివృద్ధికి సంఘమూ పరస్పరం సహకరించుకోవాలి. అప్పుడే దేశం, తద్వారా ప్రపంచం అభివృద్ధి చెందుతాయి.

'నాలో ధ్వనిస్తూంది
ప్రపంచం శబ్దమై
నాలో స్పందిస్తూంది
ప్రపంచం ప్రాణమై'

అని కావ్యారంభంలోనే వ్యక్తికీ, ప్రపంచానికీగల అవినాభావ సంబంధాన్ని కవి వ్యంజింప చేశాడు.

పైనున్న ఆకాశం ఆత్మకూ, క్రిందనున్నభూమి బ్రతుకుకూ సంకేతాలు. ఒకటి శబ్దం, మరొకటి ప్రాణం. బీజభూతంగా ఉద్భవించిన జగత్తు నిండయినవృక్షరూపమే జీవితం. ఇది అనుభవానికీ, ఆత్మకూగల సన్నిహితత్వాన్ని బోధించేవిషయం.

మానవుని మనసులో మూడు అరలున్నాయి. అవి వ్యక్తం (conscious), వ్యక్తావ్యక్తం (sub-conscious), అవ్యక్తం (un-conscious). ఈ మూడింటిని గూర్చి పరిశోధించి ఫ్రాయిడ్ మనో విశ్లేషణ సిద్ధాంతం ప్రకటించాడు.

మొదటిదానిలో నిజజీవితాన్నీ, రెండోదానిలో ఆదర్శజీవితాన్నీ అనుభవించి ఆరెండింటినీ సమన్వయించుకొని ముందుకుసాగుతాడు మానవుడు. అందుకే ఆతని మనస్సు సంస్కృతికి గతి బిందువు, అతని ప్రవర్తన ఆకృతికి రేఖాంతరం. మనస్సు ఆలోచనకూ, ప్రవర్తన ఆచరణకూ మూలస్థానాలు.

మనచుట్టూఉన్న ప్రకృతిలో జడత్వమూ, చైతన్యమూ – రెండూఉన్నాయి. చల్లారిన నిప్పులో, ఎండిపోయిన మొక్కలో జడత్వమైన నిశబ్దంఉంది. అయితే దానివెంటే చైతన్యవంతమైన శబ్దం ఆవరించిఉంది. అందుకే మనస్సులో నిశబ్దంఉన్నా, ముఖంలో శబ్దం తాండవిస్తుంది.

శబ్దమూ, నిశబ్దమూ పరస్పరాశ్రయాలు. చెట్టుతొర్రల్లో, కొండ గుహల్లో నివసించిన ఆదిమ వాసుడు అజ్ఞానాంధకారంనుంచి బయటపడటమే విజ్ఞానానికి నాందిపలకడం. అదే నిశబ్దంనుంచి శబ్దంలోకి సాగించిన పయనం. మనసులోకల్గిన కోరిక ఆకలితీర్చుకోవడమనే క్రియతో పూర్తవుతుంది. ఇదే బ్రతుకు తెరువుకు ప్రారంభం. ఫ్రాయిడ్ చెప్పిందికూడా ఇదే. ఈ అసాధారణ విషయాలు మనస్సుకు హత్తుకునేటట్లు చెప్పడంలో మాదిరాజువారు కృత కృత్యులయారు.

'అసామాన్య కవితావేశాన్ని అసామాన్య క్రమంలో కల్పించడ'మే గదా కవిత్వానికి కాలిరిడ్జ్ మహాశయుడు చెప్పిన నిర్వచనం. **(A more than usual state of emotion with more than usual order.)**

మనిషి తన కుక్షింభరత్వంకోసం స్వార్థంతో తోటివాళ్ళ పొట్టకొడుతున్నాడు ఇచ్చిన స్వేచ్ఛను ఇతరులపై అధికారాన్ని చెలాయించడానికి వినియోగించుకుంటూ, మానవత్వాన్ని మరచి దానవుడవుతున్నాడు. అందుకే ఇంకా మనచుట్టూ ...

'మిగిలే ఉన్నాయి శిలలు
పేదగా అంబేదగా
తరాల దుఃఖ శకలాలుగా'

అంటూ మానవతా వాదాన్ని చాటాడు కవి.
ఇక్కడ శిలా నిద్రాణంగా పడిఉన్న మానవునకొక ప్రతీక.

ఈ విధంగా మొదటి భాగంలో మనిషి సమగ్ర స్వరూపం వివరించి, ఇంకనూ పరిమితంగాఉన్న సామాజిక వ్యవస్థను విమర్శించారు రంగారావుగారు.

రెండోది 'నేనుమొదట మనిషి ని' అనే భాగం. మానవుడు మొట్టమొదట ఒకేచోట స్థిరంగా నివసిస్తూ జీవనోపాధిని కల్పించుకున్నాడు. క్రమక్రమంగా పరిస్థితులనుబట్టి చుట్టుప్రక్కలకు కూడా వలసపోయి మనిషి ఆహారాన్వేషణ సాగించవలసి వచ్చింది. నాగరికత, ఉత్తమ సంస్కార సంస్కృతి అప్పుడే అలవరచుకున్నాడు మానవుడు. ఈ భాగంలో ఆదిమానవుని చరిత్ర వివరించబడింది.

ఆకాశంలో మబ్బు గాలి వాలునుబట్టి నడిచినట్లే భూమ్మీద మనిషి భుక్తికోసం అన్వేషిస్తూ ముందుకు పోతాడు. పరిస్థితుల ప్రభావానికి మబ్బూ, మనిషీ కూడా తలవంచవలసిందే!

'అనేక వర్ణ సామరస్యంతో
అనంతమైన కాలపటంపై
వేసిన చిత్రం నా రూపం
నిఖిల చరిత్రకూ ప్రతిబింబం'

అనడంలో కవి ప్రపంచానికీ మనిషికీగల సంబంధాన్ని వివరించాడు

మనిషి మనసు ప్రకృతినంతా తన గుప్పిట్లో పెట్టుకుందుకు ఉవ్విళ్లూరుతుంది. అందుకే మానవుడు ఆకాశజీవిగా మారాడు. ఎన్ని కష్టాలు వచ్చినా భవిష్యత్తులో ఏదో శుభం, సుఖం కలగవచ్చనే భ్రమలో మనిషి తన జీవిత రథచక్రాలను ముందుకు దొర్లిస్తాడు. చీకటిలో వెలుగును వెతుకుతూ, వెన్నెల్లు వచ్చినా పుట్టినరోజు పండుగ చేసుకుంటాడు. బతుకుతెరువులో ఎదురైన సమస్యలను పరిష్కరించడమే జీవితం. ప్రకృతికూడా మనిషికి అన్నివిధాలా సహకరిస్తూనే ఉంటుంది. అందుకే తెలిసో, తెలియకో ప్రతివాడూ తన జీవితాన్ని తీర్చి దిద్దుకోవడంలో విశ్వసంస్కృతీ చిత్రానికి వన్నెచిన్నెలు కూరుస్తూనే ఉంటాడు.

కాబట్టే...ఉన్న కాస్త 'సమయమూ
పోనీ స్వేచ్ఛగా ఉదారంగా
ఉన్న కాంతి బిందువుతో
రానీ మనోజ్ఞమైన ఆకారం' అని కవి మానవుడిని ఉద్బోధిస్తాడు.

ప్రతి మనిషికీ ఆలోచనాశక్తి ఉంది. అది సక్రమంగా ఉంటే జగత్తును రక్షిస్తుంది. లేకపోతే భక్షిస్తుంది. 'మబ్బును కదిలించి జీవనం తెచ్చే గాలి, నిప్పును రగిలించి శ్మశానమూ చేస్తుంది.' అందుకే మనిషి ఆలోచన 'కత్తి అంచు' కాకూడదంటాడు కవి.

భూమితోబాటు సముద్రం ఉన్నట్లు జీవించి ఉన్నంతవరకూ సమస్య ఉంటుంది. ఇది ప్రకృతిసిద్ధం. అయితే సమస్యను నేర్పుగా, ఓర్పుతో పరిష్కరించుకోవడమే మానవధర్మం. నీళ్లకోసం రాళ్లను తవ్వడంలోనే ఉంది గొప్పతనం. మానవతలోని నవతను పండించడమే మనిషి కర్తవ్యం.

అందుకే శుష్కభావాలూ, నీరసవాదాలూ త్యజించమంటూ మాదిరాజువారు ...

'నిష్క్రమణం పలుకు
మనస్సును శుష్కీభవించే ఋతువుకు
ఆహ్వానం చెప్పు
మనస్సును ఆర్ద్రీకరించే ఋతువుకు' అని మనిషిని ఉద్బోధిస్తారు.

ప్రతివాడికీ ఒకవిధమైన నాగరికత, సంస్కృతి ఉంటాయి ఇవి తరతరాలనుంచీ వచ్చే ఆస్తులు. సంప్రదాయసిద్ధమైన జీవితానికి స్వస్తి చెప్పడానికి ఎవరి మనస్సూ సులువుగా అంగీకరించదు, ప్రతికూల పరిస్థితులేర్పడితే తప్ప, ఒకచెట్టు చనిపోయేదాకా ఆ జాతిఫలాన్నే ఇస్తుంది.అది దాని సహజగుణం. అలాగే మానవుడు తరతరాలుగావచ్చే తన పూర్వ సంప్రదాయాలనూ, సంస్కృతినీ విడిచిపెట్టక, వాటిని సమన్వయించుకొని ఆలోచనలో, ఆచరణలో ప్రకటిస్తాడు ఇవే విష

యాలు సంప్రదాయసిద్ధమైన సంఘం నిర్మాణానికి కారణాలుగా జంగ్ వంటి మనస్తత్వ శాస్త్రజ్ఞులు చెప్పారు.

'లోకంనుండి నిష్క్రమణంతో
ఒకతరం పరిసమాప్తి
మరో తరానికి వదలేస్తూ
మంచి చెడూ సమస్తమూ' అనే భావచిత్రంలో కవి
పై విషయాన్నే స్పష్టం చేశాడు.

చెట్టు సంప్రదాయానికీ, మేఘం సృజనశక్తికీ ప్రతీకలు మొదటిది సౌందర్యానికి, రెండోది జీవనానికి కాలం ఒక ప్రవాహం. ఇంగితాన్ని పాతిపెట్టి వర మానాన్ని హసింపజేస్తుంది. కోరినా, కోరకపోయినా మనిషికివ్వ దలచిన ఫలితం కాలం అందిస్తుంది. అది దాని నైజం. అందుకే నిశబ్దంగా నిదాణంగాపడివున్న శిలలో ఒక్కొక్క సారి సంగీతం వినిపిస్తుంది. ఆనందం నర్తిస్తుంది. అంటే మానవుడు సర్వతోముఖాభివృద్ధి నొందుతాడన్నమాట.

'ఈ శిలలు నిశబ్ద శిఖరాలు' అనే మూడోభాగంలో జడత్వం నుంచి మానవుడు చైతన్యవంతుడయిన విధానంగూర్చి వివరించబడింది.

కిటికీలూ తలుపులూ మూసుకున్నా వచ్చే వెలుగు ఆగదు. కలిగే ఊహ ఎదలో కదులుతూనే ఉంటుంది. రెక్కాడినా డొక్కాడక పోతే, శ్రమకు తగిన ఫలం లభించకపోతే మనిషి తిరుగుబాటుచేస్తాడు. 'శిశిరంలో చేతులెత్తి చెట్లు, రాత్రికళ్ళుమూసిన ఆకాశం, బ్రతుకులో జ్వాలయిన ఆశ' నిరంతరం ఆక్రోశిస్తూనే ఉంటాయి. శైశవం నుంచి మరణించేవరకు మబ్బు కమ్మకపోవడానికీ, వెలుగురాకపోడానికి కారణాలను అన్వేషిస్తూ, ఎడారిజీవితంనుంచి భవిష్యత్ మైదానం లోక 'ఆశామయ కవచంలో ముందడుగు వేస్తాడు మానవుడు.' కన్నెకు బిగించిన తీగెపై' సంగీతం వినిపిస్తాడు. శిశిరంలో వసంతం కురిపిస్తాడు. ఇది నిరంతరం అనంతంగాసాగే మానవప్రయత్నం. బ్రతుకు తెరువులో పొందే అనుభవం.

జీవితకాలగమనం ఒక రైలు ప్రయాణంవంటిది. రైల్వే ప్లాట్‌ఫారం చిగురించే ఆశకు ఒక ప్రతీక. ఎక్కవలసిన రైలుకోసం నిరీక్షించడం ఒక అనుభవం, అనుభూతి. అనుకున్న రైలుబండి అందుకోడంకూడా నిజంగా అదృష్టమే! రైలుకదలడం మనస్సుకొక ఉపశాంతి, ఉజ్వలభవిష్యత్తుకునాంది. అందుకే రైలు కదిలే సరికి ప్రయాణీకుని ముఖంలో ఆనందం వెల్లివిరుస్తుంది.

ఇదే విషయాన్ని రంగారావుగారు ...

'కదలిందిరాత్రి, రైలు
విడుతోంది స్టేషన్
ప్లాట్‌ఫారంపై లైట్ల వెలుగుల్లో
మెరుస్తున్నాయి ప్రయాణికుల ముఖాలు
బ్రిడ్జి కింద పారేనదిలో
దీపాల ప్రతిబింబాలవలె!'

అనే వర్ణ చిత్రంలో వ్యంజింప చేశారు.

రైలెక్కినా సక్రమంగా అది మరో స్టేషనుచేరేవరకూ గుండెదడదడలాడుతూనే ఉంటుంది. రైలు ఇంజనులా నిట్టూర్పులు నిగుడుస్తూనేఉంటుంది. 'మనస్సులోదాగిన అనుభవ చిత్రాలు' కళ్ళముందు కదలాడతాయి. అప్పుడే ప్రతిక్షణమూ 'ఆలోచనా తరంగ శ్రేణిలో విశ్రాంతి నెరుగని సముద్రతీరం'లా ఉంటుంది. ఈ 'సంఘర్షణ' బ్రతుకులో మామూలు. 'అనుభవంనుండి ఆలోచన — ఆలోచననుండి అనుభూతి.' మనుగడలో ఆకుల్లా క్షణాలురాలినకొద్దీ అనుభవం అంతరంగాన్ని గట్టిపరుస్తుంది.

కవికికూడా అనుభవం ముఖ్యం. అందుకే 'కవితకు అనుభూతి ఆలోచన రెండు కళ్లం' టారు డా|| అరిపిరాల.

ఇక నాల్గవ భాగం 'మానవులై ఈ శిలలు' అనేది.

మనదేశానికి స్వాతంత్ర్యంవచ్చిందికాని కొందరు స్వార్థపరులు దేశాన్ని కుదువబెట్టి లాభాలు గడిస్తున్నారు. మరికొందరు అమాయకులను రెచ్చగొట్టి దేశాభ్యుదయాన్ని నాశనంచేస్తున్నారు. స్వప్రయోజనాలకోసం సామాన్యప్రజానీకానికి అన్యాయంచేస్తున్నారు. కొన్ని అదృశ్య కబంధహస్తాలు వెలిగే దివ్వెల నార్పేశాయి. కొన్ని ఎండలు 'పడియల' నింకించాయి. అందుకే 'ఎక్కడవేసిన గొంగళి అక్కడవే ఉంది'. 'మంచుపొరల ముసుగులో ముడుచుకొంది దేశం.'

దీనికి పరిష్కారమార్గం ఏమిటి? హింసయే ఆయుధమంటున్నారు కొందరు. అశాంతిని సృష్టించే విప్లవ మొక్కటే మార్గమంటున్నారు మరికొందరు.

కాని దానివల్ల ప్రయోజనం సున్న. సమస్యతీరకపోగా దేశం శ్మశాన భూమవుతుంది. అందుకే మాదిరాజువారు ఏ సమస్యకయినా విప్లవం అనుసరణీయమార్గం కాదంటూ ...

'కెలుకుతూ బూడిద కుప్పలు
చిమ్ముతూ నిప్పురవ్వలు
హసించేవా? నటించేవా?
నీ అవతారానికి నీవే మురస్తూ! అని ప్రశ్నిస్తారు.

గ్రంథ విమర్శలు

అదీగాక ప్రతిమానవుడూ తనదేశ సంస్కృతీ సంపదకు వారసుడే! ఆతడే ప్రపంచం. ప్రపంచమే ఆతడు.

'ప్రపంచంలో భాగం నీవు
నీలోని భాగం ప్రపంచం
నీవులేంది ప్రపంచం లేదు
ప్రపంచంలేంది నీవులేవు.'

అనడంలో కవి చెప్పిన విశేషమే ఇది.

మానవుడికీ సమాజానికీగల అవినాభావ సంబంధాన్ని అర్థం చేసుకుందుకు కొంత సంస్కారం ఉండాలి. ఆలోచన కావాలి. మానవత లేందే అది రాదు.

అందుకే ... 'కదలు కదలు మనిషీ
పద పద పయోదమై' అంటూ ఉద్బోధిస్తాడు కవి.

పయోదం ప్రమోదయిన జీవనవనానికి క్రొత్త శోభల్ని ప్రసాదించే త్యాగమయ స్వరూపానికి ఒక ప్రతీక.

కవి తన మానవతావాదాన్నిచాటుతూ, ఈ 'ప్రమోదులు పచ్చని తోరణాలై, ఈ దిబ్బలు కదలే జీవనంతో సృజనరూపం పొందాలి, ఈ శిలలు మానవులై అనుభూతీ, అలోచనతో కాలాన్ని అర్థవంతం చేయాలి' అని ఆకాంక్షించాడు మనసారా.

చిట్టచివరి శీర్షిక 'ప్రణవమై ఆత్మయై' ఇందులో మనుగడకై సాగించే మానవయత్నం భౌతిక, అభౌతిక స్థితిగతులనుబట్టి ఎలా పరిణమించేదీ వివరించబడింది.

గదికీ మదికీ దిక్కులు నాలుగు. ప్రతి వస్తువుకూ ముఖాలు నాలుగే! నాల్గు దిక్కులనుంచీ ఆకర్షణ వికర్షణలుంటాయి. 'నాల్గు దిక్కుల్లో నాలుగు దారులు. నాలుగు దారులమధ్య మనస్సు! ఈ అధివాస్తవిక భావచిత్రంలో మనస్సు స్థితిగతులు చెప్పబడినాయి.

మనిషికి తెలియని రహస్యాల ముడులను ఆత్మ విప్పుతుంది.

అదే... 'నాలుగు దారులు కలవనిరూపం
మనిషికి తెలిసిన జీవితం
ఒకచోట కలిసినరూపం
ఆత్మకు తెలిసిన రహస్యం' అను పాదాల్లో కవి వ్యంజింప చేశాడు.

ప్రతి ప్రాణీ బతుకు గూడును ఎప్పుడూ చక్కదిద్దుకుంటూనే ఉంటుంది గూడు కట్టుకుందుకు తెచ్చుకున్న పుల్లలు కిందపడినా పక్షి మళ్ళీ ప్రయత్నిస్తుంది కాని కట్టడం మానదు. ఇది సహజం. కలుగుతూనే ఉంటుంది అంతరాయం. జరుగుతూనే ఉంటుంది ప్రయత్నం!

బతుకు బరువును గురు చేస్తాడు సూర్యుడు. బతుకు వెరువును ప్రశ్నిస్తాడు చంద్రుడు. పున్నమి చీకటినీ, అమావాస్య వెలుగునూ గ్రహించడానికి ఎప్పుడూ యత్నిస్తూనే ఉంటాయి. అందుకే మనిషి కాలానికి ఒక ప్రశ్నారూపం! అధికృతను నిరూపించుకునే రాత్రింబవళ్ల తీరాలమధ్య 'సీమాంచలాల నవలోకించే' అర్భకుడు.

ఈ సగటు మనిషి జీవితం మారాలంటే కాలగతిలో పరివర్తన రావాలి దానికి మానవుడే బాధ్యుడు. వెలుతురులో ముడుచుకునే శిలలూ, బొమ్మల్లా చీకట్లో దాక్కునే శిలలూ దారి ప్రక్కన ఇంకా ఉన్నాయి. ముందు వాటి స్థితిగతులు మారాలి. దానికి సంస్కారం, అనురాగం భూమిపై వెల్లివిరియాలి. అప్పుడు దేశం సంస్కృతీ సుసంపన్నమై మానసికంగా సామాజికంగా సర్వతోముఖాభివృద్ధిని పొందుతుంది. నిర్జీవమైన శిల రూపం సజీవ శిల్ప ఖండంగా అలరారుతుంది.

'రావాలి లోలోని గాలి
ఈ శిలలనుండి శబ్దమై
అదే ప్రణవమై, సంగీతమై
సాగాలి లోలోన గాలి
ఈ శిలల్లో ప్రాణమై
అదే ఆత్మయై, ఆనందమై'

అంటూ కవి ముగించడంలో ఇదే ధ్వనింపజేశాడు మొగటి ఘటంలోని దాణంగాఉన్న శిల చైతన్యంతో క్రమపరిణామం పొందడమే అసలు సారం.

తరవాత 'వియత్నాం శాంతికవితలు' నాలుగూ ఎన్నో ఏండ్ల తదుపరి ఏర్పడిన ప్రశాంత వాతావరణానికి వివరణలు.

'శాంతి నిర్పిన ఈ క్షణం ఎగిరి గంతువేసింది మానవత' 'గదిలో ఒకమూల పదిలంగా పెట్టిన వయొలిన్ హృదయంతీసి ఉంచినట్లు' కన్పిస్తోంది అనడంలో కలుగుతున్న ఆనందం వ్యంజింపబడింది వయొలిన్ వియత్నాంకు ఒక ప్రతీక.

సంఘర్షణ, సమన్వయం, పరివర్తన,పురోగమన [illegible]లో తప్పు ఏదిఏమయినా విప్లవం తరవాత [illegible]. '[illegible] వనుస

రించి ఎరుపురస్తే ఎరుపు ననుసరించిరావాలి తెలుపు.' నలుపు కార్మిక శక్తికీ, ఎరుపు విప్లవానికీ తెలుపు శాంతికీ ప్రతీకలు. ఈనాడు వియత్నాం మానవుని అభ్యుదయగతిలో రెపరెపలాడి ఎగిరే ఆశా కేతనం!

చిట్టచివరి 'ఇది కరాళ సమయం' అనే కవిత బంగ్లాబంధు హత్యచేయబడిన సందర్భంలో వ్రాయబడింది.

'కాడిగట్టిందీ సమయం' అనడంలో కవి తన ఆవేదనను వ్యక్తం చేశాడు ఆర్ద్రహృదయంతో.

ఈ విధంగా క్రొత్త పద్ధతిలో మాదిరాజువారు మానవ జీవిత గాథను మనస్తత్వ శాస్త్రానికి జోడించి ఆధునికదృష్టితో అందించారు.

తనను ప్రారంభంనుంచీ ప్రోత్సహించిన కీ శే శివలెంక శంభు ప్రసాద్‌గారి కీ పూజా ప్రసూనం అర్పించి కృతజ్ఞతను తెలుపు కున్నారు కవి. ఇదే సందర్భంలో...

'నీవు ఉన్నావు
అదృశ్యంగా పరమాణుమూర్తివై
అను భవంలో కాంతిలహరివై' అనడంలో శబ్దాన్నీ,
'ఉన్నావు నీవు
నాలో తెలీకుండానే
కదలీ కదలని
చంద్రరేఖవలె నిశ్శబ్దంగా' అనడంలో ప్రాణాన్నీ ధ్వనింప జేసి ఈ సంపుటానికి పెట్టిన పేరు సార్థకం చేశారు శ్రీ రంగారావు గారు.

ఈ వచన కావ్యం మానవ జీవిత చరిత్రకు ఒక ప్రతిబింబం. కవి ప్రతిభకు ఒక నికషోపలం.

— *శివలెంక ప్రకాశరావు.*

భారత గ్రంథాలయోద్యమము

సంపాదకులు : వెలగా వెంకటప్పయ్య, ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరురోడ్డు, విజయవాడ, పుటలు 151, వెల : 4 00.

ఇది పాతూరి నాగభూషణంగారికి సమర్పించిన షష్టిపూర్తి కానుక.

ఇది గ్రంథాలయ విజ్ఞానాన్ని విశేషంగా అందించే గ్రంథం. 19 రాష్ట్రాల గ్రంథాలయ సమాచారం ఆ కర్మచారులు వ్రాసిన వ్యాసములలో సంపుటీకరించబడినది. అయ్యంకి వెంకటరమణయ్యగారు ఆశీసుల నిస్తూ గ్రంథాలయాలు పాశ్చాత్య వాసనా విలసితమైన సంస్థలనుకోవడం పొరపాటని, భారతదేశంలో ప్రాచీన కాలంలో తక్షశిల మొదలగు విశ్వవిద్యాలయాలలో ప్రాచీన తాళపత్ర గ్రంథము లుండెడివని మహమ్మదీయులు, మొగలాయీ పాదుషాలు, తంజావూరి రాజులు మొదలగువారు ఎన్నో గ్రంథాలయాల నేర్పరచినారని తెలిపినారు. 1912 నుండి గ్రంథాలయోద్యమం ప్రారంభమై మహా వట వృక్షంగా వ్యాప్తి చెందినది. గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఈ ఉద్యమంలో అగ్రగాములు. పెదపాలెం గ్రంథాలయాన్ని పోషిస్తూ వచ్చిన అయ్యంకి వెంకటయ్యగారు నాగభూషణంగారి కృషిని దీనిలో అభినందించినారు. సురవరం ప్రతాపరెడ్డిగారి అంచనాలో క్రీ. పూ. 6000 ఏండ్లనుండి గ్రంథాలయా లుండేవి. రాగిరేకులు, రాతి పలకలు వారి గ్రంథాలయాల్లో ఉండేవి. ఇపుడు మైక్రోఫిల్మ్స్, ఎలెక్ట్రానిక కంప్యూటర్లు, టెలిప్రింటర్లు ఎన్నో గ్రంథాలను నిర్మించి దాచగలవు. ఆంధ్రదేశంలోని అమరావతి గ్రంథాలయం అందరినీ ఆకర్షించింది. కంచి మొదలగు ఘటికాస్థలములలో తాళపత్ర గ్రంథాలయాలు విలసిల్లి ఉంటాయి. 1950 సం॥ తరువాత చట్టపరంగా గ్రంథాలయా లేర్పడి వానిలో వేలమంది పనిచేస్తున్నారు.

విశ్వవిద్యాలయాలలో నేర్చుకొన్న విషయాలను సమగ్రం చేసేందుకు నైతికంగా సమాజ బాధ్యతను గుర్తించిన ప్రతి పౌరుడు ఈ కిల్లీకొట్టు గ్రంథాలయాలను వాడుకోనని ప్రతిజ్ఞ చేయాలని వెంకటప్పయ్య హెచ్చరిక చేశారు. గ్రంథాలయాలు మనిషిని మనిషి తెలుసుకోవడానికి చాలవరకు తోడ్పడుతాయని వెంకటపయ్యగారు దృఢంగా నమ్ముతున్నారు.

ఈ గ్రంథంలో గ్రంథాలయ చరిత్రలను గూర్చి వ్రాసిన వ్యాసాలు మిన్నగా ఉన్నాయి. కాంగ్రెసు ఉద్యమం, సంస్థానాలు, వీరేశలింగంగారు, వ్యావహారిక భాషోద్యమం అన్నీ గ్రంథాలయోద్యమానికి చైతన్యము నొసంగినవి. మంథన ఆదినారాయణమూర్తిగారు 1886 సరస్వతీ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అయ్యంకి వెంకటరమణయ్యగారు సైకిలు యాత్రలను, వసంతోత్సవాలను, గ్రామ గ్రంథాలయాలను ఏర్పాటుచేసి వాడ వాడల గ్రంథాలయాలను ప్రచారంలోనికి తెచ్చినారు. 1914 నుండి కృష్ణదేవరాయ గ్రంథాలయం భాషాభివృద్ధికై ఎంతో కృషిచేసింది. 1930 నుండి తెలంగాణా ప్రజలు ఎట్టి కష్టాల ననుభవించినారో అన్నీ గ్రంథాలయోద్యమాలతో ముడిపడి ఉన్నవి. ఇప్పుడైతే సరిగా శిక్షితులైన యువకులు, యువతులు గ్రంథాలయాలను చూచుకొంటున్నారు. కాని శాఖా గ్రంథాలయాలలో ఎన్ని పుస్తకాలున్నా సరిగా కోరిన పుస్తకం లభించుట

లేదు. రెఫరెన్సు గ్రంథాలు, పుస్తకాల సరియైన వాడుక అంతా బాధ్యత గలవారి చేతులలో ఉండాలి. ప్రధాన మంత్రికూడ ఈ విషయాన్ని హెచ్చరించినట్లు రేడియోలో విన్నాముగదా!

అస్సాంలో ఇండ్లకు పుస్తకాలు తీసికొని పొయ్యేవారిసంఖ్య తక్కువ. అలహాబాదు కేంద్ర గ్రంథాలయం చాలపెద్దది. రష్యాలోని మాస్కో గంథాలయం, బ్రిటిషు మ్యూజియం ఎవరీమాన్స్ లైబ్రరీ వంటి ప్రచురణ సంస్థలు పరిశోధనకు ఎంతో తోడ్పడుతున్నవి. మిశ్రాగారి వ్యాసాన్ని చూస్తే గజపతి కపిలేంద్రదేవ్‌కు మంచి గంథాలయం వుండేదని, ఇతర జమీందారులు కూడ మంచి గ్రంథాలయాలు నెలకొల్పినారని తెలుస్తున్నది. రాజా లక్ష్మణ్ సేన్ గారి తరువాత తురుష్కులు వారి గ్రంథాలయాలను భస్మీపటలం గావించి భారతీయ సంస్కృతికే ఎంతో చేటును తెచ్చినారని తెలుస్తున్నది. గుజరాత్‌లో 1849లో దేశీయ గ్రంథాలయం స్థాపించబడింది.

ఎ. ఎ. ఎన్. రాజుగారు కాశ్మీరం గాంధార శిల్పకళకు పుట్టినిల్లని, శిల్పకళ, భాష సాహిత్యాలకు, మధుర సంగీతానికి సంస్కృతి సంపత్తులకు కాశ్మీరీలు వైతాళికులని వ్రాశారు. కాశ్మీరును ఎవడు దర్శించినా దాని ప్రకృతి సౌందర్యం స్త్రీ సౌందర్యంలాగే ఆకర్షిస్తుంది. క్రీ. పూ. 6 వ శతాబ్దంనుండి ఒకటిన్నర వేల సంవత్సరాలపాటు కాశ్మీరు బౌద్ధ శైవ సంస్కృత సాహిత్యాలకు కాణాచి అనవచ్చును. దేశప్రజలందరు కాశ్మీరును ఇతోధికంగా సందర్శించి అక్కడి ప్రజలలో పురాతన వైభవాన్ని పునరుద్ధరింప జేయాలి. కల్హణుడు, పతంజలి, బిల్హణుడు, ఎందరో తత్త్వవేత్తలు వర్ధిల్లిన దేశమిది. అక్కడే శారదాపీఠం ఉంది. త్రిమలాచార్యులు స్ఫూర్తిన అక్కడే చెందినారు. 1951 లో ఆచార్య కౌలా గ్రంథాలయాలను వృద్ధిలోకి తెచ్చినాడు.

క్రీ. శ. 5 వ శతాబ్దంలో వంగదేశం చైనా యాత్రికులను విశేషంగా ఆకర్షించింది. 1784 లో ఏషియాటిక్ సొసైటీని సర్ విలియం జోన్స్ స్థాపించాడు. 1718 లో ఛార్లెస్ విల్కిన్స్ పుస్తకాలు ముద్రించినాడు. 1792 లో జోనాథన్ బెనారస్ సంస్కృత పాఠశాలను ప్రారంభించాడు. ఎన్నో వ్రాతప్రతులు విదేశాలకు తరలింపబడినవి. నిరంతరంగా పెరిగే చదువరుల సంఖ్యకు తగినంత గ్రంథాలయసేవ లేకపోవడం దురదృష్టకరమే! గ్రంథాలయాలు "నన్నునేను తెలుసుకోవడానికి మరిచి పోవడానికికూడా పనికివస్తాయని" దేశ్‌పాండేగారన్నారు. పండితులైన గ్రంథపాలకులుండాలి.

ఈగ్రంథంవలన గ్రంథాలయాలవారి కష్టములు తెలిసి వాటి పునరుద్ధరణ కావచ్చునని మనం ఆశించవచ్చు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు చరిత్ర

[(1943–73) గడియారం రామకృష్ణశర్మ. తిలక్ రోడ్డు ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు–1. వెల 1 రూ.]

ఆంధ్ర సారస్వత పరిషత్తు శ్రీపాద నుండి శ్రీ శ్రీ వరకు అందరినీ వేదిక నెక్కించింది; సమన్వయం సాధించింది. ఇది ఆంధ్ర జనసంఘానికి సమాంతరమైన సాంస్కృతికసంఘం. అక్కడక్కడ మినుకుమినుకుమను తెలుగు చమురు దీపపుకాంతిని అతిశయింప జేయడానికి చేసినకృషే సారస్వత పరిషత్తు.

మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి గార్ల కృషిమూలాన ఎందరో తెలుగు భాషాప్రావీణ్యాన్ని సంపాదించుకున్నారు. ఈవేదికపై సాహిత్య సమితిసభలు, బహుమతి ప్రదానాలు, కావ్యగానాలు ఎన్నో కార్యక్రమాలు జరుగుతుంటాయి.

ఈ పుస్తకము ఆంధ్రభాషోద్యమానికి ఆంధ్ర సారస్వత పరిషత్తు ఎట్టికృషిని సల్పిందో వివరిస్తున్నది. అసఫ్ జాహీయులు తెలుగును ఎలానొక్కి పెట్టినారో, కొందరు మహారాష్ట్రులు ఎలా అవహేళన చేశారో, కొమర్రాజు వెంకటలక్ష్మణ రావుగారు ఎట్లు మేల్కొల్పినారో అంతా చక్కగా తెలుస్తుంది. శ్రీ మాడపాటి హనుమంతరావుగారు విద్యార్థులను ప్రోత్సహించి విద్యాంసులను గౌరవించి, శాసనములను, తాళపత్ర గంథాలను తెప్పించి పరిశోధనల చేయించి నిర్మాణాత్మక కార్యక్రమాన్ని సారస్వత పరిషత్తుచే చేయించినారు.

బహదూర్ యార్‌జంగుగారి అంజుమన్ ఇత్తిహాదుల్ ముసల్మీన్ తీవ్రరాజకీయ ప్రచారానికి పూనుకొన్నప్పుడు హైందవమత సంస్కృతులను, తెలుగు జాతిని పరిరక్షించడానికి ఆంధ్రోద్యమంతో చేతులుగలిపి ఆంధ్రసారస్వత పరిషత్తు ఎంతో కృషిచేసింది. 1944 లో జరిగిన వైభవోపేతమైన సభావర్ణన, ఇతర కార్యక్రమాలను గూర్చిన వర్ణన ఉన్నాయి. ఆంధ్రసంస్కృతి, సాహిత్యాలను సర్వతోముఖంగా వికాసంచెందించడానికి ఈ పరిషత్తు కంకణం కట్టుకున్నది. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రం తీసుకోకుండా తీవ్రమైన పోరాటం చేసినదీ ఇదే. దీనిలో చేర్చిన ఫోటోలుకూడా అందంగా ఉన్నవి. ఈ సంస్థనడిపిన కళాశాల పట్టభద్రులు దీక్షలో చదివి సారస్వతసేవ చేస్తున్నారు. వయోజన పాఠశాలలు, పండిత, మహిళా కళాశాల ముద్రించిన అపూర్వగ్రంథాలకూడ దీని సారస్వతసేవకు తార్కాణము.

— రా చ

ఉత్తరరామచరితము

[భవభూతి మహాకవి సంస్కృతమూలమునకు నువాగము అనువాదకుడు : శ్రీ సామవేదం జానకీరామశర్మ, వసంతవాడ,

ఏలూరుతాలూకా, పశ్చిమగోదావరిజిల్లా. డెమ్మి 16+140పుటలు వెల 5 రూ.]

సంస్కృత నాటక వాఙ్మయంలో కాళిదాస మహాకవి శాకుంతల నాటకం తర్వాత అంతటి ప్రచారాన్నీ ప్రశస్తినీ పొందినది మహాకవి భవభూతి రచించిన ఉత్తరరామచరితం. ఇది భారతీయభాష లన్నిటి లోనికీ బహువిధాల అనూదితమై ఉన్నది. అనుకరణలుకూడా చాలా వచ్చాయి. తెలుగులోనూ యధామూలంగా అనువాదాలు చాలాకాలం కిందటనే వెలువడ్డాయి. వాటిలో వేదంవారూ, జయంతి రామయ్య గారు, మల్లాదివారు, రామకృష్ణకవులు రచించినవి ప్రసిద్ధాలు. శ్రీ శర్మగారు సంస్కృత నాటక కథలను వ్యవహారభాషలో వ్రాస్తున్న సందర్భంలో దీనిని అనువదించాలనే గట్టి సంకల్పం వారికి కలిగింది. తత్ఫలితంగా ఇది రచించబడింది.

రచయిత సంస్కృతాంధ్రాలలో సమర్థులైన విద్వాంసులు. చక్కగా కవిత్వం చెప్పగలరు. ఏలూరు థేరీసా పాఠశాలలోనూ, కళాశాలలోనూ అధ్యాపకులై సామాన్యుల కర్థమయే పద్ధతి ఎట్టిదో అనుభవంవల్ల బాగా తెలుసుకున్నారు. అనువాదం చెయ్యడానికి కావలసిన అర్హతలన్నీ ఉన్నవారు. అందువల్ల ఈ అనువాదం ఇదివరకు ఉన్నవాటికన్న మెరుగుగా సాగింది. ఇది సంస్కృతం రాని వారికి సులభంగా అర్థమయేటట్లు రచించబడింది. కొన్నిచోట్ల మూలభావానికి అనుగుణమైన సొంతభావం చేర్చబడింది. మూలంలోని ప్రాకృతభాగాలకు శిష్ట వ్యవహారికభాష ఉపయోగించబడింది. ఇవి అనువాదకులు అనుసరించవలసిన పద్ధతులు. కొన్ని అనువాదాలలో ఈ పద్ధతులు కానరావు. ఇది సరియైన అనువాదమని వీరు అనుసరించిన పద్ధతివల్లనే గ్రహించవచ్చును.

సుప్రసిద్ధ పండితులు గరికిపాటి మల్లావధానిగారు దీనిని పరిచయం చేస్తూ భవభూతి మహాకవి కవితావైశిష్ట్యాన్నీ, రసానుగుణంగా మూలకథకు ఆయన చేసిన మార్పులనూ, అనువాదకుల రచనా సామర్థ్యాన్నీ, రచనలనూ, కృతి భర్త శ్రీ వీరమాచనేని వెంకట నారాయణగారి ఉదాత్తస్వభావాన్నీ వివరించారు. ఆచార్య శ్రీ భాష్యం అప్పలాచార్యులుగారు కూర్చిన 'ఆనందావిర్భూతి'లో భవభూతి కవితా వైశిష్ట్యాన్నీ, ఉత్తరరామచరిత్ర ప్రత్యేకతనూ, అనువాదకుల తెలిగింపులోని నేర్పునూ, ఇతరానువాదాలకంటె దీనిలో ఉండే విశేషాలనూ సోపపత్తికంగా వివరించారు. సుప్రసిద్ధాలైన 'కిమపి కిమపి మందం, అపూర్వ కర్మచండాలం, అద్వైతం సుఖదుఃఖయోః' మొదలైన శ్లోకాలకు శర్మగారెలా సముచితంగా తెలిగింపు చేసినదీ వివరిస్తూ, సంస్కృతంలోని శబ్దగ్రథనం, ఉక్తి వైచిత్రి విడువబడలేదని నిరూపించారు.

అనువాదం మూలానుసారిగా ఎలా ఉన్నదీ తెలుసుకొనుటకు ఒక్క ఉదాహరణం –

మూలం –

ఘోరం లోకే వితత మయశో
　　యా చ వహ్నౌ విశుద్ధిః
లంకాద్వీపే కథమివ జన
　　స్తామిహ శ్రద్దధాతు;
ఇక్ష్వాకూణాం కులధనమిదం
　　యత్సమారాధనేయః
కృత్స్నే లోకే స దతిగహనే
　　కిం స వత్సః కరోతు.

[సప్తమాంకం-శ్లోకం 6]

దీని అనువాదం –

అయశము ఘోరమై జగము
　　నందునలంబర్వెను; లంకలోనలదా
వయినను వహ్నిశుద్ధి జన
　　మక్కట! నమ్మదు; రాజ్యపుం బ్రజా
శయపరిరక్షణమ్మె రఘు
　　సంతతి సద్ధన; మిట్టి కష్ట సం
శయపరిణామ మేర్పడిన
　　సాధ్యమె యూరకయుంట వత్సకున్.

[పుట. 131]

'ఘోరం లోకే వితత మయశః' అన్నదానికి 'అయశము ఘోరమై జగమునందున బర్వెను' అనే తెలిగింపు చక్కగా ఉన్నది. రసవంతమైన 'వత్స' పదం ఉన్నదున్నట్లే గ్రహించబడింది.

అనువాదకులు సంకల్పించినట్లు ఇది సంస్కృతం తెలియని వారికి భవభూతి మూలాభిప్రాయాన్ని తెలుసుకొనుటకు బాగా ఉపయోగిస్తుంది. వాఙ్మయాభిమానులు ఆదరించవలసిన గ్రంథం ఇది.

ఉదారహృదయులు, దేశ సేవాపరాయణులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు అయిన శ్రీ వీరమాచనేని వెంకటనారాయణ గారికి ఇది అంకితం కావడం ఎంతో ఉచితమై ఉన్నది.

— *శ్రీ బులుసు వేంకట రమణయ్య.*

మ ధు కో శ ము

(శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి సమ్మాన పంచిక, క్రౌన్ 1/4 సైజు, 140 పేజీలు. సచిత్రం. వెల 15 రూ. ప్రతులకు శ్రీ ఎం. వెంకటచలపతి, వి. టి. హైస్కూలు, రాజమండ్రి.)

సహజకవి పతంసులు, స్వయంకృషివల్ల సంస్కృతాంధ్రాలలో

ంచి పాండిత్యం సంపాదించి, తమ విజ్ఞానాన్ని జిజ్ఞాసులకు అందిస్తున్నవారు అయిన మధునాపంతులవారు బహుముఖాల భాషా వాఙ్మయసేవ చేసిన–చేస్తున్న విద్వాంసులు ఆంధ్రుల ఔన్నత్యాన్ని తెలిపే వీరి "ఆంధ్రపురాణం" వాఙ్మయంలో విశిష్టస్థానాన్ని ఆక్రమించింది. కొంతకాలం వీరు నడిపిన 'ఆంధ్రి', వీరి ఆంధ్రరచయితలు భాషావాఙ్మయాలకు గొప్ప సేవ చేశాయి. వీరి ఇతర రచనలు–స్వతంత్ర రచనలు, అనువాదాలు, శాస్త్ర గ్రంథాలు భాషాయోషకు బహురూప భూషలు. బాల్యంనుండి భాషాసేవ చేస్తూ యావదాంధ్రుల ఆదరాభిమానాలనూ చూరగొన్న–చూరగొంటున్న మధునాపంతులవారికి గత సంవత్సరం కార్తిక శుద్ధ పంచమినాడు(8-11-75) ఘనంగా సమ్మానం జరిగింది. ఆ సందర్భంలో వెలువడిన సంచికయే ఈ "మధుకోశము."

ఇది 'రాశీకృతమైన మధువ్యవసాయఫలము! ఇందు పండిన ము వంతయు నేటిది కాదు. ఈ భృంగములన్నియును ఒక్కనాటివి కావు. కొన్ని పురాణములు, నడిమికాలము నాటివి కొన్ని. మఱికొన్ని నవీనములు. అని 'ఉడుగర'లో సంపాదకులు తెలుపుతున్నారు. ఇందులో ఇప్పటివారి రచనలు కొన్ని ఉన్నవి. కొన్ని ఎప్పుడో 'ఆంధ్రి'కి వేలూరివారు, వేటూరివారు, మల్లంపల్లివారు మున్నగు పెద్దలు వ్రాసిన వ్యాసాలు కూడా ఇందులో చేర్చబడినవి.

సమ్మాన సంచికలలో సామాన్యంగా సమ్మానితులను గురించిన ప్రశంసలూ, వ్యాసాలూ అధికంగా ఉంటాయి. అలాటి సంచికలు ఒకసారి చదివి ఒకచోట ఉంచవలసినదే! తిరిగి దానిని చదవవలసిన అవసరం అంతగా ఉండదు. ఈ మధుకోశం ఆ తెగకు చెందినది కాదు. ఇందులో శ్రీ సత్యనారాయణశాస్త్రిగారి ఘనతను వివరించే వ్యాసాలతోపాటు వాఙ్మయాభిమానులకు ఉపయోగించే వ్యాసాలు, శ్రీ సత్యనారాయణశాస్త్రిగారి పద్యాలు ఉన్నవి. పెద్దల సందేశాలు, సమ్మాన సంఘం స్వాగతపత్రాలు, నివేదికలు, విన్నో ఛాయాచిత్రాలు ఇందులో చేర్చబడినవి. ఈ సమ్మాన మహోత్సవానికి ప్రారంభకులు డాక్టర్ దివాకర్ల వేంకటావధానిగారు. అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు. సమ్మాన సంచికను ఆవిష్కరించినవారు శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు.

—"అంగీరస"

వర్ణనాత్మక వ్యాకరణం :

[కన్నడ రచయిత : డా. ఎచ్. ఎస్. బిళిగిరి, తెలుగుసేత : గంగిశెట్టి లక్ష్మీనారాయణ; బెంగుళూరు : అభివ్యక్తి ప్రకాశనం, 1975; పేజీలు : IV+72; వెల : రూ. 3-50.]

బిళిగిరిగారు లబ్ధప్రతిష్ఠులైన భాషా పరిశోధకులు. వీరు 'ఒడియా' భాషకు రచించిన వ్యాకరణం ఇతర పరిశోధకుల మన్నన అందుకున్నది. (ఆ వ్యాకరణాన్ని పాఠంచెప్పే అవకాశం ఈ సమీక్షకుడికి లభించింది.) కన్నడ సాహిత్యవేత్తలలో కూడ వీరికి మంచి పేరుంది. సంభాషణా చతురులు, చమత్కారప్రియులు, రసలోలుపులు. కవితా హృదయులు. వీరు 1969లో బెంగుళూరు యూనివర్సిటీలో భాషాశాస్త్రంమీద కన్నడంలో ఇచ్చిన మూడుపన్యాసాలను ఆ యూనివర్సిటీ వారు ఒక పుస్తకంగా అచ్చేశారు దానికి గంగిశెట్టి లక్ష్మీనారాయణ గారు చేసిన తెలుగు అనువాదమిది. అనువాదకుడు బిళిగిరిగారి దగ్గర పరిశోధక విద్యార్థి. శైలి చదివేవారికి ఆసక్తికరంగా ఉంది. దీన్నిబట్టి మూల గ్రంథంలోని రమణీయతను అనువాదకుడు చెడకుండా తెలుగులోకి పట్టుకొచ్చాడని చెప్పొచ్చు. అందుకు అనువాదకుడు అభినందనీయుడు.

ఈ పుస్తకంలో వర్ణ, శబ్ద, వాక్య నిర్మాణాలను గురించి కొన్ని ముఖ్యవిషయాలు భాషమీద ఆసక్తి ఉన్న మామూలు విద్యావంతులకు కూడా అర్థమయ్యేటు రచయిత వివరించారు మూల రచయిత సాహిత్య దృష్టికూడా ఉన్న పరిశోధకుడు గనుక చక్కని ఉపమానాలతో ఆసక్తిదాయకంగా రచించారు భాషా శాస్త్ర మూలసూత్రాలను తేలికైన భాషలో తెలుసుకో దల్చుకున్న వాళ్ళకు పరిచయం చెయ్యటమే లక్ష్యం గనుక విషయ వైపుల్యాన్ని గురించి రచయితలో పేచీ పెట్టుకోనక్కర్లేదు. కాని అనువాదకుడు తన గురువుగారిమీదఉన్నగౌరవాధిక్యంవల్ల అతి ఛాదసానికిపోయి మూలంలోని పారిభాషిక పదాలను, కన్నడ ఉదాహరణలను యథాతథంగా తెలుగులోకి దించారు. అనువాదకుడికి స్వతహాగా మంచి తెలుగు రాసే నేర్పున్నట్టు ఈ పుస్తకాన్నిబట్టి గ్రహించొచ్చు. కాని భాషా శాస్త్రంమీద తెలుగులో భారతి మొదలైన పత్రికల్లో వచ్చిన వ్యాసాలతో వీరికి పరిచయం ఉన్నట్టు లేదు. తెలుగులో ప్రచారంలో ఉన్న పదాలను వాడితే ఈ పుస్తకానికి ఎక్కువ ప్రయోజనం కలిగేది. Immediate constituents అనే మాటకు సన్నిహిత సంబంధాలు అనేది ప్రచారంలో ఉంది. ఈ పుస్తకంలో "సాక్షాదంగం" అని వాడారు. Distributionకు 'వ్యాప్తి' అనే మాట ప్రచారంలో ఉండగా ఈ పుస్తకంలో 'ప్రసారం' అనే మాట ఉంది. తెలుగులో Morpheme అనే మాటకు 'పదాంశం' అని వాడుతున్నారు. ఈ మాట అంత సమర్థమైంది కాకపోయినా యూనివర్సిటీల తెలుగు శాఖల్లో బాగా ప్రచారమయింది. దీనికి ఈ పుస్తకంలో 'ఆకృతి' అని వాడబడింది. 'Constitute, constituent' అనే మాటలకు క్రమంగా అవయవి, అవయవం అనే మాటలను ఈ సమీక్షకుడు వాడుతున్నాడు. ఈ పుస్తకంలో అంగి, అంగం అనే మాటలు కనిపిస్తున్నై. ఇటా వాడటం తప్పుకాదు గాని ఈ పాటికే ప్రచారంలో ఉన్నమాటలు వాడితే పాఠకులకు ఎక్కువ

సౌకర్యంగా ఉంటుంది పూర్వవ్యాకరణాల్లో కూడా ప్రసిద్ధమైన సంశ్లేష అనే మాటకు 'యమళత' అని వాడటం మరీ ఛాదస్తం. తెలుగులో 'పట్టిక' అనేమాట ప్రసిద్ధంగా ఉంటే దానికి 'కోష్టకం' వాడటం కూడా ఇట్లాంటిదే. కొన్నిచోట్ల ఇట్లాంటి మాటలు పాఠకులను తప్పుదారి కూడా పట్టించొచ్చు. Simplicity అనే మాటకు 'సరళత' అనే మాట ఉద్దేశించిన అర్థాన్నియ్యదు. దీనికి వ్యాకరణ ప్రక్రియలో 'సౌలభ్యం' అనే మాట ప్రచురంగా ఉంది. Concept అనే మాటకు 'కల్పన' అనే మాట వాడారు. కొన్నిచోట్ల Artifact అనే అర్థంలో కూడా వాడినట్లు కనిపిస్తుంది. ("ఇక వర్ణనాత్మక వ్యాకరణకారుడు భాషా విశ్లేషణలో ఉపయోగించే కొన్ని మూల భూత కల్పనలకు గురించి మాట్లాడుతాను" పేజీ-15) పాఠకుల అర్థావగాహనకు ఈ మాట చాలా చిక్కు పెడుతుంది. పుస్తకం చివర ఇచ్చిన పారిభాషిక శబ్దాల పట్టికలో ఈ మాటలేదు.

విషయ వివరణకు అనువాదకుడు తెలుగు ఉదాహరణలు ఎన్నుకుంటే బాగుండేది. భాషాశాస్త్ర సూత్రాలకు ఉదాహరణలు ఫలాని భాషనుంచే ఉండాలన్న నియమం లేని మాట నిజమే. బహుభాషలనుంచి ఉదాహరించే సంప్రదాయం ఈ శాస్త్రంలోఉంది. కాని పాఠకులకు పరిచితంకాని భాషనుంచి ఇచ్చినప్పుడు వివరణ అధికంగా ఇయ్యాల్సుంటుంది. మూలం కన్నడ శ్రోతలకుద్దేశించింది గనుక వివరణ అక్కర్లేకపోవచ్చు. ఇతర భాషా పాఠకుల కుద్దేశించినప్పుడు ఈ వివరణ అవసరం. కనీసం ఆ ఉదాహరణలకు అర్థాలైనా అన్నిచోట్లా ఇచ్చి ఉండాల్సింది. ఉదాహరణకు 28 వ పేజీలో కురి, గురి, తురి, ... వంటి శబ్దాలకూ, డొళ్ళు, కాదు అనే శబ్దాలకు అర్థాలను చూపించలేదు. 35, 36, 37, 38వ పేజీల్లోనూ ఇంతే చేశారు. అక్కడక్కడ 'ఫుట్‌నోట్స్'లో తెలుగు ఉదాహరణలను అనువాదకులు చూపించారుగాని, అవి అంత సుష్ఠుగా లేవు. 29 వ పేజీఫుట్‌నోట్‌లో 'డాల్డా, ఒడ్లు' అనే మాటల్లో రాతలో సూచించిన విధంగా లకారాన్ని అమూర్ధన్యంగా భావించటం పొరపాటు. మూలంలో పాతకన్నడంనుంచి ఉదాహరణలిస్తే తెలుగులో కూడా అట్లాగే (పేజి 35) పాత తెలుగునుంచి ఇయ్యాలనుకోటం అనువాదకుడు తెచ్చిపెట్టుకొన్న అస్వతంత్రతను సూచిస్తుంది. 16 వ పేజీలో 'వ్రాశాడు' అన్న మాటలో ఆ అనే శబ్దాన్ని భూతకాల ప్రత్యయం అన్నారు. 37 వ పేజీలో ఇదే మాటలో వివృతమైన— ఏ – కారాన్ని భూతకాల ప్రత్యయంగా గుర్తించారు. బహుశా మొదటిది లేఖన చిహ్నాన్ని ఉద్దేశించింది కావచ్చు. రెండోది ఉచ్చారణ వినిపించే శబ్దరూపాన్ని సూచించేది కావచ్చు. కాని ఇట్లాంటి వా పాఠకుల ఊహకు వదిలెయ్యటం సమంజసంకాదు.

మంచి తెలుగు రాయగలిగిన ఈ అనువాదకుడు స్వతం బుద్ధితో తెలుగు ఉదాహరణలను కూరుస్తూ, తెలుగు రచన ప్రసిద్ధంగా కనిపిస్తున్న పారిభాషిక పదాలను వాడుకుంటూ, అనువాదాన్ని తయారుచేస్తే బాగుండేది. మూలరచయితను ఇం బాగా అర్థంచేసుకోటానికి వీలయ్యేది.

ఈ సందర్భంలో ఆత్మ విమర్శా పూర్వకమైన కొన్ని యాలనుకూడా ముచ్చటించుకోటం అవసరం. భాషలను శాస్త్రీయ దృక్పథాన్ని తెలుగుదేశంలో తొలిసారిగా ప్ర వాడు గిడుగు రామమూర్తిగారు. వీరి వ్యవహారిక భాషావాదం ఒక భాగం మాత్రమే. సవర భాషకు వీరు రచించిన వర్ణ వ్యాకరణం శాస్త్రవేత్తల ప్రశంసలనందుకొన్నది. ఇంతకంటే ఎ 1911–1913 సంవత్సరాల్లో విశాఖపట్నంలో జరిగిన ఉపాధ్యా పరిషత్తు సమావేశాల్లో ప్రసంగాలద్వారా ఈ కృషి చేశారు. ఇటీవ కాలంలో తెలుగుదేశంలో భాషాశాస్త్రం బాగా ప్రచారం పొందింది ద్రావిడ భాషలమీద, తెలుగుమీద చెప్పుకోదగిన మౌలికమైన పరిశోధన జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీలో భాషా శాస్త్రాని ప్రత్యేకమైన విభాగమే ఉంది. మూడు యూనివర్సిటీల్లో తెలు విభాగంలో కొంత భాషాశాస్త్రాన్ని బోధిస్తున్నారు. తెలుగులో కూడ బాగా రాయగలిగిన భాషాశాస్త్ర పరిశోధకులు మనకున్నారు. అయి ఈ శాస్త్రం మూలవిషయాల్ని పరిచయం చేసే పుస్తకం కన్నడ నుంచి అనువాదం చేసుకోవాల్సిన దురవస్థ ఈ జాతి కెందుకొ నట్లు? కొన్ని వ్యాసాలయితే 'భారతి'లాంటి పత్రికల్లో వచ్చినమా నిజమే. కాని ఇంతవరకు తెలుగులో ఒక పుస్తకం రాలేదన్న విచార మైన వాస్తవాన్ని ఈ పుస్తకం మనకు గుర్తుచేస్తున్నది. తెలు అకాడమీవారు బి. ఏ. సిలబసుకు అనుగుణంగా ఇట్లాంటి పుస్తక లను రాయించాలని అయిదేళ్ళ క్రితమే ప్రణాళికను సిద్ధపరచు కొన్నారు. అయితే (అందుకు కారణాలు ఏవైనా కావచ్చు) అది పుట్టిట్లోనే సంధికొట్టింది. "అంగట్లో అన్నీ ఉన్నై అల్లుడి నోట్లో శని" అని అన్నట్టుగా ఈ తెలుగు జాతికున్న అనంతకోటి దరిద్రాల్లో ఇదీ ఒకటి. ఈ దరిద్రం ఇట్లా ఉన్నంతకాలం ఇట్లాంటి అనువాద గ్రంథాలే మనకు గతి.

—వే రా

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.

BCP

ప
197
సమ్మా

ప

KLVA104M131

BC

BHARATI　　May 7th, 1976　　Regd. No. H/VJ-70

అమృతాంజన్ లిమిటెడ్

75 సంవత్సరాల పైగా గృహౌషధములు తయారు-చేస్తున్నవారు!

- అమృతాంజనం బాధానివారిణి
  తలనొప్పి, ఒళ్ళునొప్పులు, బెణుకులు, జలుబు, దగ్గు, కండరాల నొప్పులకు.
- అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్
  పసిబిడ్డల అజీర్ణానికి, పళ్ళు వచ్చేటప్పుడు కలిగే బాధలకు.
- అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్
  తామర, తీట, గజ్జి వగైరాలకు.
- అమృతాంజన్ ఇన్‌హేలర్
  జలుబుచేసి ముక్కుదిబ్బడ, తుమ్ములు వగైరాలకు.
- అనోలియమ్-కోల్డ్ రబ్
  దగ్గు జలుబులను పారద్రోలే అమోఘమైన ఒక కొత్త శక్తి.
- శాలోఫెన్-బాధానివారిణి మాత్రలు
  తలనొప్పి, ఫ్లూ, ఒళ్ళు నొప్పులకు

...ఇండియాలోను,
ఇతర దేశాలలోను
పేరు పొందినవి.

అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు-4



మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA104M131
పుస్తకం పేరు	భారతి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	HBCI,
లేని పేజీలు	NO
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	Navya
స్కాన్ చేసినది	Naveena
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good